సంపుటి 61 సంచిక 140 జులై 2021

పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి



# జీవశక్తి-సూర్యశక్తి

## విషయ సూచిక


**సంపాదకీయం – విజయ మాధవి గొల్లపూడి........................................................................................1**

సెక్రెటరీ రిపోర్ట్ – **అపర్ణ సుసర్ల..... ...............................................................................................2**


## శీర్షికలు


శ్రీమద్భగవద్గీత – రంగారావు పెయ్యేటి .........................................................................................4

ధీర వనిత - విజయ చావలి ...............................................................................................12

శంకర విజయం - లలిత రాంభట్ల...............................................................................................15

బ్రహ్మశ్రీ దివాకర్ల సీతారామ శర్మ గారికి గౌరవ నీరాజనాలు .......................................................19

విన్నపం - పెయ్యేటి రంగారావు...............................................................................................25

రాక్షసుడు - తమిరిశ జానకి...............................................................................................27

భయం (కార్డు కథ) - శ్రీదేవి పెయ్యేటి ...............................................................................31

మబ్బుల పల్లకి -కమల పరచ...............................................................................................32

సంగీత నాదామృతం - డా.పద్మ మల్లెల...............................................................................37

వంశీ కొత్త కథలు-4 పుస్తక ఆవిష్కరణ...............................................................................40

కలికాలంలో కరోనా 'కల'వరం- విజయ గొల్లపూడి ...............................................................42

తొంబై వసంతాల తెలుగు కవి సి.నా.రె - షామీరు జానకీ దేవి...........................................47

మహిమ – డి. కామేశ్వరి...............................................................................................52

పాట నేర్చుకుందామా/పాడుకుందామా...............................................................................57

బాలవాహిని ...............................................................................................60

శిధిల నగరం – 4 - జి.వి.సోమనాధ శాస్త్రి...............................................................................62

Telugu Association Inc.
PO Box -1382, Parramatta, NSW 2124
ABN : 56 303 933 034
www.sydneytelugu.org
పూని ఏదైనా ఒక మేలు చేసి జనులకు చూపవోయి!

email: vahini@sydneytelugu.org

| ఎడిటర్ | అసోసియేట్ ఎడిటర్ | కో-ఆర్డినేటర్ |
|---|---|---|
| విజయ మాధవి గొల్లపూడి | సాయి లక్ష్మీనారాయణ గొల్లపూడి | ప్రసాద్ రాంభొట్ల |

# సంపాదకీయం

ఆషాఢ మాసం శీతాకాలంలో తెలుగు వాహిని పత్రిక పాఠకులకు అసాంతం చదవడానికై ఆహ్వానం పలుకుతున్నాము. ప్రతి సూర్యోదయం నూతన ఆశలకు, ఆశయాలకు నాంది. చీకటిలోని భయాలను తొలగిస్తూ ప్రాతఃసమయాన సూర్యరశ్మినుంచి ప్రసరించే లేలేత కిరణాలు సర్వ ప్రాణికోటికి జీవశక్తిని ప్రసాదిస్తాయి. భారతీయులకు వేదపరంగా, ప్రపంచానికి వైద్యపరంగా ఆరోగ్య ప్రదాత భాస్కరుడు. 'డి' విటమిన్ కోసం రోజుకు పదిహేను నిమిషాలు సన్ లైట్ /సూర్యకాంతి శరీరంపై ప్రసరించే విధంగా చూసుకోమని ఆరోగ్యనిపుణులు సూచిస్తారు. వాల్మీకి మహర్షి అందించిన ఆదిత్య హృదయ పఠనం, సూర్యనమస్కారాలు ఆచరణలో పెడితే ఆరోగ్యవంతులుగా వెలుగొందుతారు. ఈ నెల ఆశావాద దృక్పధంతో ప్రకాశవంతమైన సూర్యశక్తి ని వాహిని ముఖచిత్రంగా మీకందిస్తున్నాము.

సిడ్నీలో కోవిడ్ విపత్తునుండి "హమ్మయ్యా! బయటపడుతున్నాము" అని అనుకుంటున్న తరుణంలో, మళ్ళీ కరోనా రక్కసి డెల్టా పేరుతో కోరలు విప్పుతోంది. త్వరితంగా వ్యాధి ప్రబలుతోంది. దీనికి వ్యాక్సిన్ ఒకటే మార్గం. అన్ని వేళలా, అన్ని ప్రదేశాలలో మాస్క్ ధరించి, కర ప్రక్షాళనం చేసుకుంటూ, మనిషికి, మనిషికి మధ్య దూరంతో మెలగాల్సిన పరిస్థితి.
సిడ్నీ తెలుగు అసోసియేషన్ ద్వారా నిర్వహించే వార్షిక కేలండర్ ఉపకమిటీ వేడుకలు స్థానిక ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించబడుతున్నాయి. ఈ ఏడాది క్రొత్త పరిణామం తెలుగు అధ్యక్షులు శ్రీ బైరెడ్డి మధుసుధన్ రెడ్డి గారు యువతరాన్ని తెలుగు కార్యక్రమాలలో నిమగ్నులను చేసే దిశగా నిర్వహిస్తున్న తొలి యూత్ మీట్ అప్ హర్షణీయం. వివరాలకోసం ముందు పేజీలు చూడండి.
ఈ పర్యాయం తెలుగు వాహిని సాహితీ సదస్సు సెప్టెంబర్ మాసంలో నిర్వహించాలని సంకల్పించాము.
పది నెలలుగా వాహినిలో సీరియల్ గా ప్రచురితమవుతున్న డి. కామేశ్వరి గారి 'మహిమ' నవల సమాప్తమవుతోంది. ఆసక్తిగా చదువుతున్న పాఠకులు స్పందన తెలియచేసారు. సీనియర్ రచయిత్రి దూర్వాసుల కామేశ్వరి గారికి ఈ సందర్భంగా వాహిని ధన్యవాదాలు తెలియచేస్తోంది.
తెలుగు వాహిని లో విలువైన విషయ సమాచారం, కథలు, కవితలు పొందుపరచి మీకు అందిస్తున్నాము.
మిమ్మల్ని అందర్నీ వాహిని మాసపత్రిక అలరించగలదని ఆశిస్తూ......

**మీ శ్రేయోభిలాషి**

**విజయ గొల్లపూడి**

**0438293687**

**vahini@sydneytelugu.org**

## ఎక్జిక్యుటివ్ కమిటీ


ప్రెసిడెంట్: మధు బైరెడ్డి
0425 209 397


వైస్ ప్రెసిడెంట్: మోహన్ కుమార్ పరుసు
0419 219 526


సెక్రెటరీ: : అపర్ణ సుసర్ల
0424 558 371


ట్రెసరర్: హరిబాబు కొల్లూరి
0425 291 032


కమిటీ మెంబర్: వీర్రాజు గున్నం
0431 714 501


కమిటీ మెంబర్: కామేశ్వరి ఉడత
0424 937 166


కమిటీ మెంబర్: ప్రసూన కంభంమెట్టు
0405 445 662

## సబ్ కమిటీలు


తెలుగు వాణి కన్వీనర్ :
రాజా తల్లాప్రగడ
0422 953 668


తెలుగు వాహిని ఎడిటర్:
విజయ గొల్లపూడి 0438 293 687


తెలుగు బడి కోఆర్డినేటర్
రావు పెద్దాడ 0456 226 000


వనితా మండలి కోఆర్డినేటర్
శోభ వెన్నలకంటి - 8901 3636


వెబ్ అడ్మిన్ : అపర్ణ సుసర్ల
0424 558 371


సిడ్నీ తెలుగు సీనియర్స్ కోఆర్డినేటర్
రవి సీతంరాజు

## ఆఫీసర్స్


మూర్తి పోతుకూచి-రిటర్నింగ్ ఆఫీసర్


ఆడిటర్
మధు వెన్నెలకంటి


పబ్లిక్ ఆఫీసర్
రవి సీతంరాజు

# SECRETARY REPORT

Dear Members,

A very warm Greetings from EC!

Despite the challenges that have confronted us, EC and SC have remained focused on the operational tasks and providing services that are most important to our members.

Telugu Badi annual schools meet up event planned to be held at Durga Devi Temple Auditorium on 27 June 2021 has been postponed, EC is working with Telugu Badi sub-committee in organising this event.

The EC has been working closely with sub-committees and the summary of activities are shared below:

- Telugu Vahini is having a meet up on 18 September 2021.
- Telugu Badi is organising 'Schools Annual Day' on 27 Jun 2021 at Durga Devi Temple Auditorium.
- Telugu Vani and EC are thankful to Mr. Chandrashekar Raghavaraju for digitizing historical radio programs. This has created a valuable resource library of information for STA.
- STA EC team are organising a Youth Networking Session on 7 August 2021. Planning is underway to make this event a fun catch up session. Thanks to all the 50 young adults that have already registered to the event. EC is thankful to Sailaja Kambhammettu, Diwija Paramathmuni, Pallavi Rachakonda and Srinivas Byreddy for helping us plan this event.

Thanks to the Treasurer Mr. Hari Kolluri for getting the accounts and expenses in place and finalising for the financial year end.

EC welcomes the life members to our STA family.

Ms. Pratibha Gollapudi
Ms. Pranavi Gollapudi
Ms. Sri Vaishnavi Danturty
Mr. Satwik Chemudupati
Ms. Yashaswini Dhanala

Don't forget to select Telugu as our language when you fill out Census form on 10 August 2021

We are grateful to all our sponsors for the continued support during these pandemic times and looking forward to the same support in future.

Best Regards,
Aparna Susarla,
Secretary Sydney Telugu Association.

***Do you like Telugu, Volunteering & giving back to community***
We are looking for two new teachers for Sydney Telugu Badi at Ring Rose public school in Greystanes.
Classes are on every Sun 10am to 12noon during school term.
This is a Voluntary position. Training provided & opportunity to attend community language courses at Syd Uni.
This is a great initiative to promote our mother tongue to next generations and you work with dedicated like-minded team.
Currently 220 students are learning Telugu through our 6 branches across Sydney.
Please contact Bharati Parasu, Telugu Badi Coordinator Mob: 0431 257 480

**Vahini**

**వాహినికి మీ రచనలు పంపడానికి, సూచనలు, స్పందనలు తెలుపడానికి మీరు**

**పంపవలసిన మా చిరునామా - vahini@sydneytelugu.org**

Newsletter of Telugu Association Inc., Sydney published in

*Telugu*,

The second largest language spoken in India

Please visit sydneytelugu.org and subscribe to Vahini monthly magazine to receive by e-mail.

❖❖❖❖❖

**విజ్ఞప్తి**

మీ శీర్షికలు, వాణిజ్య ప్రకటనలు వాహిని పత్రికలో ప్రచురించడానికి, విజయ మాధవి గొల్లపూడి vahini@sydneytelugu.org ద్వారా సంప్రదించగలరు. మీ ప్రచురణలు ప్రతి నెల 25వ తారీఖు లోపల పంపవలసినదిగా విజ్ఞప్తి. మీ రచనలతో పాటు ధ్రువీకరణ పత్రము, వాహినిలో ప్రచురించుటకు అంగీకార పత్రము జతపరచగలరు.

Disclaimer: It may be that this magazine uses some freely available content and material from web purely for informative purposes.

❖❖❖❖❖

భాష్యం: శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



**అథ ద్వితీయోధ్యాయః - సాంఖ్యయోగః**

**(రెండవ అధ్యాయము - సాంఖ్యయోగము)**

45,

త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున |

నిర్ద్వంద్వో నిత్యసత్త్వస్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ || 45 ||

అర్జున = ఓ అర్జునా!

వేదాః = వేదములు

త్రైగుణ్యవిషయాః = (పైన తెలుపబడినట్లు) త్రిగుణకార్య రూపములైన భోగములను, వాటి సాధనలను ప్రతిపాదించును.

నిస్త్రైగుణ్యః = (కావున నీవు) ఆ భోగముల యందును, వాటి సాధనల యందును ఆసక్తి లేనివాడవై

నిర్ద్వంద్వః = హర్షశోకాది ద్వంద్వములు లెనివాడవై

నిత్యసత్త్వస్థః = నిత్యుడైన పరమాత్మ యందే స్థితుడవై

నిర్యోగక్షేమః = యోగక్షేమములను ఆశింపక

ఆత్మవాన్ = అంతఃకరణమును స్వాధీనమొనర్చుకొనిన వాడవు

భవ = అగుము.

ఓ అర్జునా! వేదములు సత్త్వరజస్తమోగుణముల కార్యరూపములైన సమస్త భోగములను గూర్చియు, వాటిని పొందుటకై చేయవలసిన సాధనలను గూర్చియు ప్రతిపాదించును. నీవు ఆ భోగముల యెడలను, వాటి సాధనల యందును ఆసక్తిని త్యజింపుము. హర్షశోకాది ద్వంద్వములకు అతీతుడవు కమ్ము. నిత్యుడైన పరమాత్మ యందే స్థితుడవు కమ్ము. నీ యోగక్షేమముల కొఱకై ఆరాటపడవద్దు. అంతఃకరణమును వశమునందుంచుకొనుము.

వేదము యొక్క పూర్వభాగమునందు కర్మకాండ, యజ్ఞయాగాదులకు సంబంధించిన విషయములు ప్రస్తావింపబడినవి. ఉత్తరభాగమునందు త్రిగుణాతీతమగు పరబ్రహ్మమును గూర్చి ప్రస్తావింపబడినది. దృశ్యప్రపంచమంతయు త్రిగుణములతో గూడినది. అది అల్పమైనది. దృక్స్వరూపమగు ఆత్మ యొకటియే త్రిగుణాతీతమైనది. అది సర్వోత్తమమైనది. గుణములకు లోబడి యున్న వానికే ఈ బంధము, ఈ బాధలు, ఈ జన్మములు, కర్మములు. గుణములను దాటి ఆత్మయందు స్థితి గల్గియున్న జ్ఞానికి నివియేవియు నుండవు. కనుకనే భగవానుడు అర్జునుని గుణాతీతుడుగ, ఆత్మవంతుడుగ కమ్మని ఆదేశించినాడు.

సత్త్వస్థః = ఇచట తెలుపబడిన సత్త్వము త్రిగుణములలోని సత్త్వము కాదు. అది విశుద్ధతత్త్వస్థితి లేక ఆత్మస్థితి. 'జ్ఞ చిత్తం సత్త్వముచ్యతే' - ఆత్మజ్ఞాని యొక్క బ్రహ్మాకారమగు చిత్తము సత్త్వమనబడును అని శ్రీ వసిష్ఠమునీంద్రులు తెలిపియున్నారు. 'నిత్యసత్త్వస్థః' అని చెప్పబడినందున ఏదియో ఒకానొక కాలమందు గాక నిరంతరము సత్త్వము నాశ్రయించి, ఆత్మస్థితుడై యుండవలెనని భావము.

'నిర్యోగక్షేమ ఆత్మవాన్' - యోగమనగా లేని వస్తువును బొందుట, క్షేమమనగా దానిని కాపాడుట. ఈ రెండును లేకుండవలెను. ఏలననగా ఆత్మయందున్న వానికి సమస్త పదార్థములు పొందబడినట్లే యగును గాన ఇక నాతడు దేనిని వాంఛింపవలెను? ధనవాన్, సౌందర్యవాన్, అధికారవాన్..... అని చెప్పక ఆత్మవాన్ అని చెప్పుట వలన ప్రపంచములోని సమస్త పదార్థముల కంటెను, పదవుల కంటెను ఆత్మస్థితియే సర్వోత్తమమైనదని సూచితమగుచున్నది.

పరస్పర విరుద్ధములును, సుఖదుఃఖములకు హేతువులు నగు పదార్థములు ద్వంద్వములన బడును. అవి ఏవనిన శీతోష్ణములు, మానావమానములు, హానివృద్ధులు మొదలగునవి. అట్టి ద్వంద్వముల కెవడు లోనగునో వానికి నిష్కామత్వము ప్రాప్తింపదు. ద్వంద్వాతీతత్వ మెవరికి బ్రాప్తించునో వానికి నిష్కామత్వము కలుగును. కాన నో యర్జునా! నీవు నిష్కామత్వమునకు హేతువగు శీతోష్ణాది ద్వంద్వాతీతత్వమును సంపాదించుము.

యోగక్షేమములందు వ్యాపృతమగు నంతఃకరణము కలవాని కెపుడును సత్త్వగుణము సంభవింపదు కనుకనే యోగక్షేమములను వదలవలెను. యోగక్షేమములు జీవనహేతువులగుటం జేసి పురుషార్థసాధనములు. అవి ధర్మార్థకామములనెడి పురుషార్థత్రయమునకు సాధనములైనను, అవి ప్రధానముగ గలవానికి మోక్షమనెడి పురుషార్థము సంభవింపదు. కాన సర్వోత్కృష్టమగు మోక్షమునకు సాధనమగు యోగక్షేమపరిత్యాగము నొనరింపవలెను.

విషయములందయిన మానసికరూపమగు పరవశత్వము ప్రమాదమనబడును. మనస్సునకట్టి ప్రమాదమును దొలగించి అప్రమాదుడు కావలెను. అప్రమాదునకు యోగక్షేమరాహిత్యము, దానివలన నెల్లపుడు సత్త్వగుణ ప్రధానత్వము, అందుచే ద్వంద్వసహిష్ణుత్వము, దాని వలన నిష్కామత్వము ప్రాప్తించును. అట్టివానికే నిశ్చయాత్మక బుద్ధి గలిగి శ్రేయఃప్రాప్తి యగును.

త్రయాణాం గుణానాం కర్మత్రైగుణ్యం కామమూల స్సంసార స్స ఏవ ప్రకాశ్యత్వేన విషయో యేషాం త్రైగుణ్యవిషయా వేదాః కర్మకాండాత్మకాః' - సత్త్వరజస్తమోగుణముల కర్మము త్రైగుణ్యమనబడును. అది ఏదనిన కామమూలమగు సంసారము. అట్టి సంసారమును ప్రకాశింపజేయునవి కాన సంసారము విషయముగా గలవి కర్మకాండప్రతిపాదక వేదములు. అనగా నెవడీ ఫలమును కోరునో తత్ఫలమును బోధించునవి.

వేదములు 'త్రైగుణ్యవిషయాః' - రాజసములు, తామసములు, సాత్త్వికములు అను నీ మూడు విధములగు గుణములు త్రిగుణములన బడును. అట్టి రాగద్వేషలోభమోహాదులు, తత్కార్యములు, తత్ఫలముల యొక్కయు సముదాయము 'త్రైగుణ్యం' అని యనబడును. అదియే సంసారము. అట్టి సంసారముగా గలవి వేదములు. అనగా సంసార హేతువగు కర్మలను, తత్సాధనములను ప్రతిపాదన చేయుచు, సంసారమును వృద్ధి పొందించును. గాన వేదములు త్రైగుణ్యవిషయములనం బడును. (సంసారవృద్ధి వేదోక్త కర్మాధీనము గాన వేదములు త్రైగుణ్యవిషయములని

చెప్పబడును.). సంసారము వేదవిషయ మగుటచే సర్వుల కుపాదేయమైనను అది ముముక్షువుల కాదరణీయము కాదని 'నిస్త్రైగుణ్యో భవార్జున!' అని పరమాత్మ ఆదేశించినాడు. ఇష్టానిష్టపదార్థములు రెండున్ను ద్వంద్వశబ్దవాచ్యములు. రాగద్వేషాది జనకములు. వానియందు సమబుద్ధిచే నా ద్వంద్వముల నుండి నిష్క్రాంతుడవగుము. మోక్షము, తత్సాధనమగు శమదమక్షాంత్యాదులు కేవల సత్త్వగుణలభ్యములగుట నిస్త్రైగుణ్యమున్నను ముముక్షువునకు సత్త్వగుణము లేనిచో నవి లభించవను నాశయముచే 'నిత్యసత్త్వస్థః' అని చెప్పబడెను. ఎల్లప్పుడు సత్త్వగుణము గలవాడవగుము. వివేకవైరాగ్యశమదమాదులు కలవాడవగుము. యోగక్షేమములు కోరెడివానికి రాగద్వేషాదులవశ్యము సంభవించును. అట్టి రాగద్వేషాదులచే శమదమాదులు తొలగిపోవును. అందుచే సాధనవిచ్ఛిత్తి కలుగును. సాధనవిచ్ఛిత్తిచే మోక్షము సిద్ధింపదు. కాన ముముక్షువు యోగక్షేమములను వదలవలెను.

46

యావానర్థ ఉదపానే సర్వతః సంప్లుతోదకే |

తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః || 46 ||

సర్వతః = అంతటను

సంప్లుతోదకే = పరిపూర్ణమైన జలాశయము

(ప్రాప్తే సతి) = ప్రాప్తించుచుండగా (అందుబాటులో నుండగా)

ఉదపానే = చిన్న జలాశయము నందు (మానవునకు)

యావాన్, అర్థః = ఎట్టి ప్రయోజనము

(అస్తి) = ఉండునో

విజానతః = బ్రహ్మతత్త్వమును ఎఱింగిన

బ్రాహ్మణస్య = బ్రహ్మజ్ఞానికి

సర్వేషు, వేదేషు = సమస్త వేదములందు

తావాన్ = అంత ప్రయోజనమే (ఉండును).

అన్నివైపులా జలములతో నిండియున్న మహాజలాశయము అందుబాటులో నున్నవానికి చిన్న చిన్న జలాశయముల వలన ఎంత ప్రయోజనమో, పరమాత్మ ప్రాప్తినంది పరమానందమును అనుభవించు బ్రహ్మజ్ఞానికి వేదముల వలన అంతియే ప్రయోజనము.

ఆత్మానుభవము గల జ్ఞాని వేదోక్తములగు స్వర్గాది కామ్యకర్మల ఫలములకై దేవులాడడు.

జానతః అని పేర్కొనక విజానతః అని నుడివినందు వలన పైపై జ్ఞానము (Superficial knowledge) చాలదనియు, అనుభవజ్ఞానము వుండవలెననియు స్పష్టమగుచున్నది.

వేదోక్తములగు కర్మల నాచరించినచో తత్ఫలము వలన శబ్దస్పర్శరూపరసగంధాత్మకములగు విషయసంబంధము వలన సుఖవిశేషములు జనించుచుండును. అట్టి సుఖవిశేషములన్నియు పరిచ్ఛిన్నానందములు. కావున పరిచ్ఛిన్నానందములు అపరిచ్ఛిన్నానందము నందు అంతర్భవించును గాన జ్ఞాని యొక్క స్వరూపంబగు సుఖమునందు అంతర్భవించుచున్నది. ఈ విషయమునే 'ఏతస్యై వానంద సాన్యాని భూతాని మాత్రా ముపజీవన్తి' అను శ్రుతి గూడ బోధించుచున్నది. కాన పరిచ్ఛిన్నానందప్రాప్తికి సాధనమగు కర్మయోగమునకు మోక్షఫలము లభింపదు. కర్మఫలమంతయు జ్ఞానఫలము నందంతర్భవించును.

'సర్వం కర్మాఖిలం పార్థ!  జ్ఞానే పరిసమాప్యతే' అని ఒక చోట శ్రీకృష్ణుడు చెప్పినాడు.  అటులైన జ్ఞాననిష్ఠయే యాచరింపదగినది, దానివలననే కర్మఫలము ప్రాప్తించుచుండ కర్మనిష్ఠ వ్యర్థమేనా యని శంకింపవలదు.

ఎంతవరకు జ్ఞాననిష్ఠాధికారము ప్రాప్తింపదో, అంతవరకు కర్మలయందు అధికారము గలవాడు కూపతటాకాద్యర్థస్థానీయమగు కర్మను తప్పక యాచరింపవలయును.  అట్టి కర్మయోగము సత్త్వశుద్ధద్వారమున జ్ఞాననిష్ఠాయోగ్యతకు సాధనమగుటం జేసి కర్మయోగము నిష్ఫలము కాదు.

47

కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన |

మా కర్మఫలహేతుర్భూః మా తే సఙ్గోఽ స్త్వకర్మణి  || 47 ||

తే = నీకు

కర్మణ్యేన = కర్మమునందే

అధికారః = అధికారము

అస్తే = కలదు

కదాచన = ఒకప్పుడును

ఫలేషు = (వాని) ఫలములందు

(అధికారః = అధికారము)

మా = వలదు

కర్మఫలహేతుః = కర్మఫలములకు కారణమైన వాడవు

మా భూః = కాకుము.

అకర్మణి = కర్మలు చేయకుండుట యందు

తే = నీకు

సఙ్గః = ఆసక్తి

మా అస్తి = కలుగకుండును గాక!

(అర్జునా!) నీకు కర్మను చేయుట యందే అధికారము కలదు.  కర్మఫలముల నాశించుట యందేనాడును నీకు అధికారము లేదు.  కర్మఫలములకు నీవు కారణభూతుడవు కాకుము.  మఱియు కర్మలు మానుట యందును నీకాసక్తి కలుగకుండును గాక!

ఫలాపేక్ష లేకుండగ, ఈశ్వరార్పణబుద్ధితో, కర్తృత్వరహితముగ కర్మల నాచరింప వలెను.

కదాచన - ఏ కాలమునందును అట్టి ఫలమును వాంఛింపరాదు.

ఫలమును గోరి చేయు కర్మలచే చిత్తశుద్ధి కలుగదు.  చిత్తశుద్ధి కలుగనిచో ఆత్మజ్ఞానము అంకురింపదు.  ఆత్మజ్ఞానము లేనిచో మోక్షము చేకూరదు.  కావున మోక్షప్రాప్తికి నిష్కామకర్మ అత్యంతావశ్యకమై యున్నది.

మాతేసఙ్గోఽ స్త్వకర్మణి = కర్మల యొక్క ఫలమును కోరవలదు అని చెప్పిరి గదా యని అసలు కర్మలే మానరాదు.  అది సోమరితనము క్రిందకు వచ్చును.  అది తమోగుణము.  తమోగుణజన్యమగు అకర్మణ్యత్వము పనికిరాదు.

'పరంపరయా పురుషార్థసాధనము కర్మయోగము.  సాక్షాత్తుగ మోక్షసాధన మాత్మజ్ఞానము.  నా మనస్సు మోక్షమును కోరుచున్నది.  కాన సాక్షాత్తు మోక్షసాధకమగు నాత్మజ్ఞానమునే యుపదేశింపుమని యనెదవా?  నీకు గర్మయందే అధికారము గలదు.  కాని జ్ఞాననిష్ఠ యందు లేదు.  అట్లయినచో ఫలమును కూడ గోరెదనందువా?  అట్లు

కాదు. కర్మానుష్ఠానమునకు ప్రాక్కాలము నందును, ఉత్తరకాలము నందును కర్మానుష్ఠాన కాలము నందును నీకు కర్మఫలము నందు తృష్ణ వలదు. అనగా ఏ కాలమునందును నీకు కర్మఫలము పై ఆశ వుండరాదు. నీకు కర్మఫలమునందు ఎప్పుడు ఆశ కలుగునో, అప్పుడే నీవు కర్మఫలప్రాప్తికి హేతుభూతుడవగుదువు. కావున ఈ విధమున నీవు కర్మఫలప్రాప్తికి హేతుభూతుడవు కాకుము. ఎప్పుడు నీవు ఫలము నాశించి కర్మలను చేయుదువో, అప్పుడే కర్మఫలమగు జన్మకు కారణభూతుడవగుదువు. ఆవిధముగ జననమరణచక్రమందు బంధింపబడెదవు. నిష్కామముగ భగవదర్పణబుద్ధితో చేయు కర్మ వలన కలుగు ఫలము నీకు అంటదు.

అంతఃకరణ శుద్ధి లేని కారణమున నీకు జ్ఞాననిష్ఠ యందు అధికారము లేదు. కర్మమునందే కలదు. అందుకూడ చిత్తశుద్ధిహేతువగు ఫలాబిసంధిరహిత కర్మముల యందే అధికారము కలదు. బంధమునకు హేతువగు కామ్యకర్మములందు అధికారము లేదని 'మా ఫలేషు కదాచన' అను వాక్యముచే చెప్పబడినది. ఏ యవస్థ యందును నీకు కర్మఫలతృష్ణ లేకుండు గాక.

తృష్ణ లేకున్నను భోజనము వలన తృప్తి కలుగునట్లు కర్మము వలన ఫలము సంభవించునను శంకను 'మా కర్మఫలహేతుర్భూః' అను వాక్యముచే తొలగింపబడినది.

48

యోగస్థః కురు కర్మాణి సంగం త్యక్త్వాధనంజయ |

సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే || 48 ||

ధనంజయ = ఓ ధనంజయా!

సంగమ్ = ఆసక్తిని

త్యక్త్వా = త్యజించి

సిద్ధ్యసిద్ధ్యోః = సిద్ధి, అసిద్ధుల యందు

సమః = సమబుద్ధిని

భూత్వా = కలిగియుండి

యోగస్థః = యోగమునందు స్థితుడవై

కర్మాణి = కర్మలను

కురు = ఆచరింపుము

సమత్వమ్ = సమత్వమే

యోగః ఉచ్యతే = యోగమని చెప్పబడును.

ఓ ధనంజయా! యోగస్థితుడవై ఆసక్తిని వీడి, సిద్ధి, అసిద్ధుల యెడల సమబుద్ధిని కలిగియుండి, కర్తవ్యకర్మలను ఆచరింపుము. ఈ సమత్వభావమునే యోగమందురు.

ఓ అర్జునా! నీవు యోగనిష్ఠుడవై ఆసక్తిని విడచి, కార్యము ఫలించినను, ఫలించకపోయినను నిశ్చలమైన బుద్ధి గలవాడవై కర్మలను జేయుము. సమత్వబుద్ధియే యోగము.

నీవు యోగస్థుడవై ఈశ్వరార్థము, ఈశ్వరానుగ్రహప్రాప్తికై కర్మముల నాచరింపుము. కాని ఈశ్వరుడు నన్ను అనుగ్రహింప వలెను అన్న కోరికను కూడ వదలి కర్మల నాచరింపుము. ఫలమునందు ఆసక్తిని పరిత్యజించి ఆచరించు కర్మల వలన అంతఃకరణము పరిశుద్ధమగును. అట్టి యంతఃకరణశుద్ధి వలన జ్ఞానప్రాప్తి యగును. అట్టి జ్ఞానప్రాప్తియే 'సిద్ధి'

యనబడును. తద్విరుద్ధమగు మలినాంతఃకరణము వలన జ్ఞానము సిద్ధింపదు. దీనినే 'అసిద్ధి' యందురు. జ్ఞానము సిద్ధించునని గాని, సిద్ధించదని గాని ఆలోచనను వదలి ఈశ్వరార్థము ఫలకామనను విడచి కర్మల నాచరింపుము.
'నిర్దోషం హి సమం బ్రహ్మ' అను శ్లోకముచే చెప్పబడు బ్రహ్మమే యిచట సమశబ్దముచే జెప్పబడినది. అట్టి బ్రహ్మభావమే సమత్వమనబడును. అట్టి బ్రహ్మభావము జ్ఞానముచే బొందబడును గాన యోగమనబడును. అట్టి బ్రహ్మమునందు తనకు బ్రహ్మభావాపత్తిచే బ్రహ్మభావైక్యాపేక్షచే నుండువాడు 'యోగస్థుడు' అని చెప్పబడును. నీవట్టి మోక్షైక కాముడవై, 'సంగం త్యక్త్వా', ఈ కర్మములచే నాకు దురితక్షయమగు గాక, లేక జ్ఞానప్రతిబంధనివృత్తి యగుగాక, లేక నాకొఱకీశ్వరుడనుగ్రహించు గాక, లేక కర్మజన్యమగు ఫలము నాకు సంభవింపు గాక యనెడి కర్మలయందు కోరికలను వదలి, 'సిద్ధ్యసిద్ధ్యోస్సమో భూత్వా' ప్రారబ్ధకర్మముల సాంగత్యము సిద్ధి, తదభావమసిద్ధి, లేక ఈశ్వరప్రసాదప్రాప్తి సిద్ధి, తదభావమసిద్ధి, చిత్తప్రసక్తి సిద్ధి, తదభావమసిద్ధి యనబడును. అట్టి సిద్ధ్యసిద్ధుల యందు హర్ష విషాద శూన్యుడవై కర్మములను క్లేశాత్మకములైనను విహితము అనెడి బుద్ధితో నాచరింపుము.

క్షత్రియులను జయించి ధనము నార్జించి రాజసూయము నందు నీవు వినియోగించితివి. అట్లే యిపుడును ఈ సర్వులను జయించి యజ్ఞాదుల నాచరించుటకు సమర్థుడవని తెలియజేయుటకు 'ధనంజయ' అని సంబోధించుట జరిగినది.

49

దూరేణ హ్యవరం కర్మ బుద్ధియోగాద్ధనంజయ |

బుద్ధౌ శరణమన్విచ్ఛ కృపణాః ఫలహేతవః || 49 ||

ధనంజయ = ఓ అర్జునా!

బుద్ధియోగాత్ = సమత్వబుద్ధితో గూడిన నిష్కామకర్మము కంటె

కర్మ = ఫలాపేక్షతో కూడిన కామ్యకర్మము

దూరేణ = మిక్కిలి

అవరహి = తక్కువది గదా! (కాబట్టి)

బుద్ధౌ = (అట్టి) సమత్వబుద్ధి యందు

శరణమ్ = ఆశ్రయమును

అన్విచ్ఛ = కోరుకొనుము.

ఫలహేతవః = ఫలమును గోరువారు

కృపణాః = దీనులు. (అల్పులు.)

ఓ అర్జునా! సమత్వబుద్ధితో గూడిన నిష్కామకర్మము కంటె ఫలాపేక్షతో గూడిన కామ్యకర్మము చాల తక్కువైనది గదా! కనుక సమత్వరూపమైన అట్టి నిష్కామకర్మానుష్ఠానబుద్ధినే ఆశ్రయింపుము. ఫలమును గోరువారు అల్పులు.
క్రిందటి శ్లోకంలోను, ఈ శ్లోకంలోను కూడ ధనంజయ అని అర్జునుని సంబోధించడం జరిగింది. భౌతికధనమునే కాక, జ్ఞానధనమును, యోగధనమును గూడ జయింపుము అని సూచించడం జరిగింది.
కామ్యకర్మ జననమరణములకు కారణభూతమైనది. నిష్కామకర్మ చిత్తశుద్ధి ద్వారా మోక్షమును ఇచ్చునది. కామ్యకర్మ మిక్కిలి అల్పమైనది. దానిని గోరువారు అల్పులు. వారు జననమరణ రూపమగు సంసారప్రవాహమున గొట్టుకొని పోవుదురు. అట్టి దీనత్వమును ఆశ్రయింపరాదు. అరుదైన మానవజన్మమును పొంది, ఈశ్వరుడిచ్చిన బుద్ధిశక్తులను దుర్వినియోగపఱచి, విషయాదులందు ఆసక్తి గలిగి, ఫలాభిలాషతో కర్మల నాచరింపుచు,అల్పులై ప్రవర్తించుట ఎంతమాత్రము అభిలషణీయము కాదు.

'యో వా ఏత దక్షరం గార్గ్యవిదిత్వాఽ స్మా ల్లోకా త్ప్రైతి స కృపణః' - ఓ గార్గీ! నాశరహితంబగు నీ పరబ్రహ్మమును తెలిసికొనక యీ లోకమునుండి పరలోకమున కెవడేగునో వాడు దీనుడు అను శ్రుతి ననుసరించి దీనుడనబడును.

పరమాత్మబుద్ధియోగము కంటె సర్వకర్మములు నికృష్టములైనవి. కాన సర్వానర్థనివర్తకమగు పరమాత్మబుద్ధి యందు ప్రతిబంధక పాపక్షయద్వారమున రక్షకమగు నిష్కామకర్మయోగము నాచరింపవలెను.

ఏవిధమున లోభులు అతిదుఃఖముచే ధనము నార్జించి, ఏదో యొక విధమగు దృష్టసుఖమాత్ర లోభముచే దానాదిజనిత మహాసుఖము ననుభవించుటకు శక్తులు కాక యాత్మను వంచించుచుండిరో, అదేవిధమున గొప్పశ్రమచేత కర్మలనాచరించుచు క్షుద్రఫలమాత్రలోభముచే బరమానందానుభవము నుండి వంచింపబడుచుండిరి. వీరల దౌర్భాగ్యము, మౌఢ్యమెంత విషాదకరమని కృపణాః అను పదమును వాడుట జరిగినది.

50

బుద్ధియుక్తో జహాతీహ ఉభే సుకృతదుష్కృతే |

తస్మాద్యోగాయ యుజ్యస్వ యోగః కర్మసు కౌశలమ్ || 50 ||

బుద్ధియుక్తః = సమత్వబుద్ధి గలవాడు

ఉభే సుకృతదుష్కృతే = పుణ్యపాపములను రెండింటినీ

ఇహ = ఈ లోకమునందే (ఈ జన్మము నందే)

జహాతి = విడుచుచున్నాడు.

తస్మాత్ = అందువలన

యోగాయ = సమత్వబుద్ధి సహిత నిష్కామకర్మయోగము కొఱకు

యుజ్యస్వ = సిద్ధపడుము

కర్మసు = కర్మలయందు

కౌశలమ్ = నేర్పు

యోగః (ఇతి) = యోగము అని

ఉచ్యతే = చెప్పబడుచున్నది.

సమత్వబుద్ధి గలవాడు పుణ్యపాపములను రెండింటిని ఈ జన్మయందే తొలగించుకొనుచున్నాడు. కావున నట్టి సమత్వబుద్ధియుక్తమగు నిష్కామకర్మయోగము కొఱకు యత్నింపుము. కర్మల యందలి నేర్పరితనమే యోగమనబడును. కోరికలను విడచి కర్మలనాచరించు వానికి పుణ్యము గాని, పాపము గాని అంటదు. ఇలా చెప్పబడింది కనుక నిష్కామబుద్ధితో పాపకర్మల నాచరింపకూడదు. అనాసక్తముగ పుణ్యకార్యముల జేయుచుండవలెను.

కౌశలమ్ = సమత్వబుద్ధితో కామ్యకర్మల నుండి మనస్సును తొలగించుకొను నేర్పరితనమే యోగము.

సమత్వబుద్ధి కలవాడై స్వధర్మమగు కర్మల నాచరించినచో దానివలన నంతఃకరణము సత్త్వప్రధానమై, తద్ద్వారమున జ్ఞానమును బొంది, తద్ద్వారమున నీ లోకమునందే పుణ్యపాపముల రెండింటిని పరిత్యజించును.

పరమేశ్వరుని యందు అర్పింపబడిన చిత్తము కలవాడగుటచే స్వధర్మములగు గర్మలయందు బ్రవర్తించు వానియొక్క యే సిద్ధ్యసిద్ధుల యందు సమత్వబుద్ధి గలదో అదియే కర్మలయందు కౌశలము. అట్టి కౌశలమెట్టిదనిన, కర్మలు బంధస్వభావము కలవి. అట్టివైనను సమత్వబుద్ధిచే నట్టి బంధస్వభావము నుండి మరలి జ్ఞానమును గలుగజేయును. ఇదియే సమత్వబుద్ధియందు గల కౌశలము.

ముముక్షువునకు జన్మాదిహేతువులగు సర్వకర్మముల యొక్క నిశ్శేషనివృత్తి జ్ఞానబలము చేతనే సిద్ధించును. కాన నీవు జ్ఞానయోగనిష్ఠనే చేయుమని 'బుద్ధియుక్తః' అను శ్లోకముచే బోధించుచుండెను.

జ్ఞానయోగముతో గూడిన యారూఢుడగు బ్రహ్మవిత్తు కూటస్థాసంగ చిద్రూపాత్మ తత్త్వవిజ్ఞానబలముచే జన్మాంతర శతసహస్రముల యందును, వర్తమాన కాలమందును, జ్ఞానోత్పత్తికి పూర్వమందును, ఊర్ధ్వమునందును నాచారింపబడిన నానాయోని సహస్రప్రాపకమగు తన సంబంధమైన సుకృతదుష్కృతములను విడచుచుండెను. జ్ఞానాగ్నిచే పుణ్యపాపములను నిర్మూలించి యీ లోకమందు జీవించియుండగనే ముక్తుడగును. కావున జ్ఞానయోగము కొఱకు ప్రయత్నింపవలెను. చెప్పబడిన ప్రాయశ్చిత్తాదులు ఏ పాపములు నివర్తించవలెనను నుద్దేశముతో చేయబడునో, ఆ పాపములే ఆ యా ప్రాయశ్చిత్తాదులచే నివర్తించును. ఇతరపాపములు నివర్తించవు. 'తరతి బ్రహ్మహత్యాం యోఽ శ్వమేథేన యజతే' - అశ్వమేథయాగముచే బ్రహ్మహత్య వలన జనించిన పాపమును దాటును, అను శ్రుతియందు బ్రహ్మహత్యావ్యతిరిక్త పాపతరణము శ్రూయమాణము కానందున నిఖిలపాపనివృత్తి కలుగదు. కాని శతకోటిజన్మహేతువగు పుణ్యమునకు నివర్తకము జ్ఞానమును విడిచి వేరొండు సంభవింపదు. 'తదావిద్వాన్పుణ్యపాపే విధూయ', 'స ఏవం విద్వా నాత్మానగ్ స్పృణుతే' అను శ్రుతులయందును, ఈ గీతావాక్యమునందు గల 'ఉభే సుకృతదుష్కృతే' అను వాక్యమునందును పుణ్యపాపోభయనివర్తకము జ్ఞానయోగమనియే చెప్పబడెను.

ఓం నమో భగవతే వాసుదేవాయ!

❖❖❖❖❖

## తెలుగు వాహిని పాఠకుల స్పందన

### 'మే' నెల వాహిని సంచిక గురించి శ్రీమతి విజయ చావలి గారి స్పందన

**వాహిని సంచిక శీర్షికలన్నీ చాల బాగున్నాయి.**

**కథల ఎంపిక బాగుంది. గృహలక్ష్మి పుట్టినరోజు, గోతి లో పడ్డ ఫేమస్ ఎన్నారై, నల్ల చీర,కందిపప్పు కావాలా కథలు ఆకట్టుకున్నాయి.**

**తెలుగు భాష అభివృద్ధి చెందాలి,ప్రోత్సాహించాలి అనుకునే తెలుగు వారు చుట్టు పక్కల జరిగే అనేక విషయాలకి తమ స్పందనలు కవితల,కథల ,కార్టూన్లులేక చిన్న బ్లాగ్ లాగ పంపిస్తే బాగుంటుంది.**

❖❖❖❖❖

### శ్రీమతి షామీరు జానకీ దేవి

**మన తెలుగు తేజం, మాజీ ప్రధాన మంత్రి, శ్రీ పి వి నర్సింహారావు గారి ముఖ చిత్రంతో వెలువడిన జూన్ నెల సంచిక ''వాహిని'' 'వహ్వా' అనిపించింది... ప్రవాస భారతీయులు మన పి వి గారి లీవిని గుర్తుంచుకోవడం అభినందనీయం...**

**శ్రీ పి వి నర్సింహారావు గారి శత జయంతి సందర్భంగా వారిని మీ సంపాదకీయంలో గుర్తు చేసిన విధానం, తెలుగు భాషపై వారి అభిమానం చక్కగా వ్యక్తీకరించారు...**

**పెయ్యేటి రంగారావుగారు భగవద్గీతలో కోర్కెలకతీతంగా నిష్కామ బుద్ధితో కర్మల ఆచరణ విధానం బాగా చెప్పారు... కర్మలనాచరించువారు మోక్షం పొందెదరు... మంచి విషయములు తెలియజేసారు...**

**విజయగారి వృత్తి ధర్మం బాగుంది... ఉద్యోగంలో మనసు చంపుకోవాలా?.. మనసుకు విరుద్ధంగా పని చేయడంలో ఉన్న బాధ బాగా చెప్పారు...**

**రమ్యగారి ''కరోనా లాక్ అప్'' బాగుంది... ఈ కరోనా వలన ఎన్ని కాపురాలో ఇలా జీవితానందాన్ని కోల్పోతున్నారు... వాస్తవానికి దగ్గరగా చాలా బాగుంది...**

"ఆపరేషన్ సక్సెస్ – పేషెంట్ డెడ్" బాగుంది... కమల పరచగారి కథ హాస్య భరితంగా ఉంది... ఆద్యంతం నవ్వులు వెదజల్లాయి...

నిక్ నేమ్స్ వలన కలిగే ఇబ్బంది, అందులో పడే బాధ, పెయ్యేటి శ్రీదేవి గారు 'జాంపండు'లో బాగా రాసారు... చక్కటి పేర్లు పెట్టుకుని ఇలాంటి నిక్ నేమ్స్ తో పిలవటం పిల్లలకి ఎంత బాధాకరమో చాలా బాగా చెప్పారు...

'మహిమ'లో కొత్త మలుపు బాగుంది... డి కామేశ్వరిగారు చాలా ఆసక్తికరంగా రాసారు...

బహు భాషా కోవిదుడు, ఒక సాహిత్యవేత్తగా పి వి గారి గురించి చక్కటి ఆర్టికల్ అందించారు...

ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన 'వాహిని' నూతన అందాలతో కలర్ ఫుల్ గా ఉంది...

❖❖❖❖❖

## ధీర వనిత

శ్రీమతి విజయ చావలి, సిడ్నీ

తాళి వున్న దన్న తలపుతో భార్యగా
కొత్త యింటి కొచ్చు కోడలౌతు
బంధమున్నదంటు బంధుత్వము కలిపి
వెలుగు చూపు ధీర వీర వనిత

శాస్త్రవేత్త యైన శస్త్రచికిత్సైన
నాయకత్వమైన నాట్యమైన
అతివ చూపగలదు అతిశయమెల్లడన్
వెలుగు చూపు ధీర వీర వనిత

గేలి చేయలేరు గెలిచి చూపగ నంత
మహిళ యన్న మాట మరిచి పోగ
దీక్ష పూని రాయి తిరుగులేని చరిత
వెలుగు చూపు ధీర వీర వనిత

కూలి పనుల డబ్బు కూడబెట్టగ పాట్లు
పడుతు చిన్నదొ కతి పరుగు పెట్ట
కొంగు లాగి వెకిలి కొంటెవారికి బుద్ధి

అమ్మ మెచ్చు కుశల వార్తల నెవ్వేళ
తనయగాను ముదము తల్లికియ్యి
రుణము తీర్చలేము రూపాయలివ్వగ
వెలుగు చూపు ధీర వీర వనిత

గేలి చేయలేరు గెలిచి చూపగ నంత
మహిళ యన్న మాట మరిచి పోగ
దీక్ష పూని రాయి తిరుగులేని చరిత
వెలుగు చూపు ధీర వీర వనిత

చరిత చదువ తెలియు జాగృతి నీయగ
స్ఫూర్తి నింపు శైలి సుదతి బతుకు
ఎంచదగునెవారి జీవిత లోపాలు
వెలుగు చూపు ధీర వీర వనిత

మాట నమ్మి చేరు మగువకు మోసము
నగలు దోచి నూత్న నటన చూపి
వలచి వచ్చి యతివ వంచనన్ వగవక
వెరపు లేక దారి వెతుకు వనిత

వెరపు లేక దారి వెతుకు వనిత

చింకి చీర చూసి చీదరించ తగదు
పేదరికము కోరి పెరగరెవరు
సాయమిచ్చు మనిషి సహకార మివ్వగ
వెరపు లేక దారి వెతుకు వనిత

.నమ్మకమ్ము చూప నయవంచకునితోడ
మోహమాయలోన మునిగిపోక
మరలు దారి మంచి మహిళగా మేలుకో
వెరపు లేక దారి వెతుకు వనిత

ఆశ తోడ నతివ యవకాశమందగా
మాయ మాట నమ్మి మానహాని
కలుగ నాలసించి కన్నీరు మునగక
వెరపు లేక దారి వెతుకు వనిత

❖❖❖❖❖



❖❖❖❖❖

ACHIY HOMES
Your Happiness is Our Satisfaction BL No. 323075C
HIA 0431081640
www.achiyhomes.com.au Email: info@achiyhomes.com.au
Custom Built Homes
Dual Occupancy/Duplex
House & Granny Flat
Granny Flat
Knock Down & Re-Build

## సిడ్నీ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో
## తెలుగువాహిని మూడవ సాహితీ సదస్సు
## నిర్వహించబడుతోంది



**వేదిక: 21 Sturt Street, Telopea**

**తేది: సెప్టెంబర్ 18, 2021**

**సమయం: 4.30 pm – 8.30 pm**

**తెలుగుభాషా ప్రేమికులకు, సాహిత్యాభిమానులకు, వాహిని పాఠకులకు మూడవ తెలుగుసాహితీ సదస్సుకు ఇదే మా ఆహ్వానం.**

## సిడ్నీ తెలుగు వాహిని మూడవ సాహితీ సదస్సుకు ఆహ్వానం

వివరాలకు సంప్రదించండి:

శ్రీమతి విజయ గొల్లపూడి 0438 293 687

**E-mail:** vahini@sydneytelugu.org



**మా తెలుగుతల్లికి మల్లెపూదండ**

**మా కన్నతల్లికిమంగళారతులు**

# శంకర విజయం

**శ్రీమతి లలిత రాంభట్ల, హైద్రాబాద్**



ఆది శంకరుల జన్మస్థలం కేరళ రాష్ట్రంలోని కాలడి. క్రిస్తూ పూర్వం 509వ సంవస్త్రంలో నందన నామసంవత్సరం వైశాక పంచమి నాడు ఆరుద్ర నక్షత్రంలో పరమ శివావతారుడై ఆ శివగురు దంపతులకు జన్మించిన ఆదిశంకరులు బాల్యాన్ని ఎనిమిదేళ్ళ కాలాన్ని కాలడిలోనే గడిపారు. కాలడి క్షేత్రమును దర్శించిన వారికి శంకరుల ఇంటి ముందు కనకధారాస్తవం స్వీకార దృశ్యాలు కనువిందు చేస్తాయి. లోనికి ప్రవేశిస్తే తల్లి ఆర్యాంబ సమాధిని, శారదాంబ ఆలయాన్ని చూడవచ్చు. తల్లి బాధచూచు పూర్ణానదిని దారి మర్లించారు. నది మళ్లింపులో శ్రీకృష్ణాలయాన్ని లీలమాత్రంగా ముందుకు జరిపారని ప్రతీతి. ఆ కృష్ణాలయాన్ని కూడా శంకరుల ఇంటి కుడిపక్కన దర్శించవచ్చు. కొంచం ముందుకు వెళితే శంకరులు కనకధారలు కురూపించిన స్థలం కనిపిస్తుంది. శంకరుల ఇంటినుంచి సుమారు కిలోమీటరు దూరంలో బస్టాండుకి దగ్గరలో అద్వైత కీర్తిస్తంబ మండపం ఉంటుంది. గాణపత్యం, కౌమారం, సౌరం, వైష్ణవం, శాక్తేయం, శైవం అనే ఆరు మతాలను శంకరులు స్థాపించి **షణ్మతస్థాపనాచార్యులయ్యారు**. అందుకు ప్రతీకగా కంచికామకోటి పీఠంవారు ఈ అద్వైత కీర్తిస్తంబ మండపాన్ని నిర్మించారు. ఆరు అంతస్తులుగా ఉండే ఈ మండపంలో వరుసగా వినాయకుడు, కుమారస్వామి, సూర్యదేవుడు, విష్ణువు, పార్వతి శివాలయాలున్నాయి. గోడలపై శంకరవిజయానికి సంబంధించిన గాధలు చిత్రాలుగా మలచారు, తల్లి ఆర్యాంబకు అంత్యేష్టి సంస్కారాన్ని నిర్వహించడానికి శంకరులు కాలడి వచ్చారు, అద్వైతమే అన్నీ వాదాలలోను గొప్పదని అక్కడి వారితో వాదించారు. ఆయన వాదనకు నిరూపణకు ఆయనతోడు శంకరనారాయణుడు సాక్ష్యామిచ్చారు. కాలడి నుంచి 3 కిలోమీటరు దూరంలోని ఈ ఆలయములోనే పరమశివలింగం నుంచి ఒక చేయి బయటకు వచ్చి ఆదిశంకరులను సమర్థించింది. ఆ గాధను కాలడిలోని అద్వైత కీర్తిస్తంబ మండపంలో దర్శించవచ్చు.

శ్రీ గురుభ్యోనమ: - ఆదిశంకరుల గురువు గోవిందభగవత్పాదులు ఓంకారేశ్వర జ్యోతిర్లింగ స్వామి ఆలయం దిగువున ఒక గుహలో శంకరులు తన గురువును తొలిగా కలుసుకున్నారు. అక్కడే ఆయన విద్యాభ్యాసం కొనసాగింది. కాలగమనంలో ఆ గుహ చాలాకాలంపాటు మూసుకుపోయింది. 1989వ సంవత్సరంలో కంచి పరమాచార్యులు ఈ గుహను తెరిపించారు. శంకరుల ఓంకారేశ్వర క్షేత్రానివాస సమయంలోనే ప్రస్థానత్రయంగా ప్రసిద్ధికెక్కిన ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీతలకు భాష్యం రచించారు. అతి చిన్న వయసులోనే శంకరులు సాధించిన విద్యా పరిణితికి, తర్కపాండిత్యానికి సంతృప్తిచెందిన గోవిందులు, విద్యానిలయమైన వారణాసి క్షేత్రానికి వెళ్ళి ధర్మ సంరక్షణ, ధర్మ సముద్ధరణ చేయవలసిందిగా ఆదేశించారు. వారణాసి క్షేత్రం నుంచి శంకరులు సాగించిన ప్రస్థానాన్ని శంకరవిజయాలుగా పేర్కొంటారు. కాశి నుంచి ఆదిశంకరుల దిగ్విజయ యాత్రలు ఉత్తరాన బదరి, కేదార్, నేపాల్ వరకు... దక్షిణాన శ్రీశైలం, శృంగేరి, కంచి వరకు... ఆసేతుశీతాచలం కొనసాగాయి. భారత దేశపు ప్రతి మట్టి రేణువును ఆయన స్పృశించారు, ప్రతిభావితం చేశారు, నిరంతర సంచారం చేస్తూనే, భక్తయోగానికి పట్టు అయిన స్తోత్ర సాహిత్యాన్ని, జ్ఞానయోగానికి మార్గదర్శకాలైన ప్రకరణ గ్రంధాలను, మీమాంస, తర్కశాస్త్రాలకు ప్రామాణికాలైన ఆయన భాష్యాలను శంకరులు రచించారు. అనేక జీర్ణదేవాలయాలు శంకరుని వల్ల తిరిగి పునర్వైభవాన్ని సంతరించుకున్నాయి. భారతదేశమంతట అద్వైతానికి తిరుగులేదనిపించారు, జగద్గురువుగా కీర్తిచెందారు.

అద్వైత పీఠస్థాపన – భారతావనికి నాలుగు దిక్కులలోనూ నాలుగు ఆమ్నాయ పీఠాలను శంకరులు స్థాపించారు. పూరీజగన్నాథ క్షేత్రంలోని గోవర్ధన పూర్వమ్నాయ పీఠం, ఋగ్వేద విజ్ఞానాన్ని సంరక్షించి, ప్రచారం చేయడం ఈ పీఠానికి కర్తవ్యంగా నిర్దేశించారు.

తొలిపీఠాదిపతి శంకరుని నలుగురు శిష్యుల్లో ఒకరైన హస్తామలకాచార్యులు **"ప్రజ్ఞానం బ్రహ్మ"** అనే బ్రహ్మసూత్రం గోవర్ధన పీఠానికి మూలవాక్యం. హస్తామలకాచార్యులు తొలిగా ఆదిశంకరులను కలిసినప్పుడు చేతిలో ఉసిరికాయలతో విద్యాభిక్షను అర్థించి "ప్రజ్ఞానం బ్రహ్మ" అనే మహాకావ్యానికి ప్రతీక వంటి సన్నివేశం అది. హస్తామలకాచార్యుల వల్లే జాగరూకునిపై పరతత్త్వాన్ని అన్వేషించి తెలుసుకోవాలి అన్నది ఈ వాక్య సారాంశం.

పశ్చిమ దిక్కున ద్వారకలో నెలకొల్పిన కాళికా పీఠం రెండోది. సామవేద విజ్ఞానాన్ని సంరక్షించి, ప్రచారం చేయడం ఈ పీఠానికి కర్తవ్యంగా నిర్ధేశించారు. తొలి పీఠాదిపతి శంకరుని శిష్యుల్లో ఒకరైన పద్మాచార్యులు, **"తత్వమసి"** అనే బ్రహ్మ సూత్రం కాళిక పీఠానికి ములవాక్యం. తత్వమసి – ఎదైతే నువ్వుకోరుతున్నావో అదే అదే నీవు అని అర్థం. గురువుని చేరాలని కోరుకున్న పద్మపాదునకి నది ఎలా అడ్డం కాలేదో... పరమాత్మను కోరెవారికి అదే నీవు అనిపించే సాయుజ్యం కలుగుతుందని భావం ఉత్తర దిక్కున నెలకొల్పిన ఆమ్నాయ పీఠం నరనారాయణుల తపో భూమి అయిన బదరీ క్షేత్రంలో ఉంది జ్యోతిర్మఠం లేదా జ్యోతిష్పీఠంగా పిలిచే ఈ పీఠం అధర్వణ వేద విజ్ఞానాన్ని సంరక్షించే కర్తవ్యాన్ని పాటిస్తోంది, **ఆయమాత్మా బ్రహ్మ** అనేది ఈ పీఠానికి ములవాక్యం. ఆయమాత్మా బ్రహ్మ = జీవుడే దేవుడు. జీవాత్మకు పరమాత్మకు భేదం లేదని బావించాలి.

గురువులకు శుశ్రూష చేయడం విద్యాభ్యాసంతో సమానంగా భావించిన తోటకాచార్యుల ఉదాంతం విభూతి. మండనమిశ్రులను వాదంలో గెలిచి దక్షిణ ఆమ్నాయ పీఠమైన శృంగేరి శారద పీఠాధిపత్యం ఇచ్చి సురేశ్వరాచార్యగా మార్చారు. యజుర్వేద విద్యావ్యాప్తికి శృంగేరి పీఠం కట్టుబడి ఉంది. **అహంబ్రహ్మస్మి** అనేది ఈ పీఠానికి మహావాక్యం = నేను పరతత్వానికి ప్రతికను పరబ్రహ్మముకంటే నేను వేరుగాలేను అని అర్థం.

శంకర: శంకరసాక్షాత్, ఆదిశంకరుల పేరు వినగానే పండిత పామరులందరిని పరవశింపచేసేది "సౌందర్యలహరి" ఆదిశంకరుల కైలాస గమనం ఒక అద్భుతం. కైలాస దర్శన వేళ పరమశివుడు స్వయంగా స్ఫటిక లింగాలను ఇవ్వడం ఒక ఆసక్తికరమైన కథ. జ్యోతిర్లింగా స్వరూపుడైన పరమేశ్వరుని ఆద్యంతాలను కనిపెట్టడం శివకేశవులకు సాధ్యంకాలేదు. అటువంటి మహాశివుని పాదం మొదలు కేశం వరకు దర్శించి **"శివ పాదాది కేశాంత స్తోత్రం"** గానం చేశారు ఆదిశంకరులు. సంతృప్తి చెందిన మహాదేవుడు సౌందర్యలహరిని ఐదు స్ఫటికలింగాలను కానుకగా ఇచ్చాడు. తిరిగి నేలకు వస్తూ శంకరులు శివ పాదాది కేశాంత స్తోత్రం గానం చేశారు. చంద్రమౌళిశ్వరుడు ఆదిశంకరులను అనుగ్రహించి మహితమైన ఐదు స్ఫటిక లింగాలలో మొదటిది

1. ముక్తిలింగం: ఇది జ్యోతిర్లింగ క్షేత్రాలలో ఒకటైన కేదార్ నాథ్ ఆలయంలో ఉంది.
2. వరలింగం: స్ఫటికలింగానికి వరలింగం అని పేరు. ఇది నేపాల్ లోని నీలకంఠ క్షేత్రంలో ఉంది.
3. భోగలింగం: చంద్రమౌళిశ్వర లింగం శృంగేరి శారద పీఠంలో ఆదిశంకరులు ప్రతిష్టించారు, అక్కడి మహిమాన్వితలింగానికి భోగలింగం అని పేరు. దాని మహిమ వల్లే శృంగేరి పీఠం శంకర పీఠాలలో మకుటాయమానంగా వెలుగొందుతుందని ప్రతీతి.
4. మోక్షలింగం: తమిళనాడులోని చిదంబర క్షేత్రం ముక్తిక్షేత్రం. పంచభూత లింగాలలో ఆకాశ లింగం ఇక్కడ కొలువైఉంది. నటరాజ మూర్తి కొలువై ఉన్న చిత్సభకు సరిగ్గా వెనుక భాగంలోని దేవసభలో ఆదిశంకరులు ప్రతిష్టించిన మోక్షలింగం కనిపిస్తుంది.

5. యోగలింగం: కంచి పీఠంలో యోగలింగాన్ని ఆదిశంకరులు తనలోనే ఉంచుకొని అర్చించారని, తదుపరి కంచి పీఠానికి అనుగ్రహించారని చెబుతారు. కంచి వరదరాజుని సమక్షంలో, కామక్షమ్మసాన్నిధ్యంలో మోక్షపీఠంగా కామకోటి పీఠాన్ని స్థాపించారు.

శంకరులు ఆయన జీవించింది కేవలం 32 సంవత్సరములు, అతి తక్కువ జీవిత కాల వ్యవధిలో ఇన్ని రచనలు ఇన్ని పర్యటనలు, వాధ సభల్లో విజయాలు, దేవతా ప్రతిష్ఠలు చేయడం అనేది ముందు లేదు, తరువాత జరుగలేదు. క్రిస్తూ పూర్వం 477వ సంవత్సరంలో సిద్ధి పొందిన శంకరుల సమాధి కేదార్ నాధ్ క్షేత్రంలో ఉంది.

❖❖❖❖❖

## కడలిమాట


ఉద్వేగపు ఘోష శూన్యమై
ఎవరూ విహరించని
ఓ ప్రశాంత సముద్రం
తరచుగా నా కలలోకి వస్తుంటుంది.
అరణ్యాల ఏకాంతంలోనుంచీ
నా నీడను లాక్కుంటూవచ్చి
తీరాన నిబడితే
అన్నీ ప్రశ్నలే!
విస్తారంగా పరచుకున్న
ఈ సాగరం అంతర్యంలో
బడబాగ్ని జ్వలిస్తుంటుందా?
అంతుతెలియని అగాథాలుంటాయా?
సముద్రం సంగతి నీకెందుకోయ్ అంటూ
నీడ మెలికలు తిరుగుతూ చుట్టుకుంది.
ఎదలోపలికి తొంగిచూసుకుందామంటే
సభ్యతను ఉరితీసుకున్న
బలహీనతల అపరాధభావన
బాహ్యానికీ, అంతరానికీ తెరవేసేసిందిగదా!
కవిత్వపు గాంభీర్యాన్ని పులుముకొని
కీర్తి చొక్కా తగిలించుకున్నవాణ్ణి
ఎప్పటిదో చిరునవ్వు అరువుదెచ్చుకుని
నిద్రలోనే నీడనువదిలేసి వెనుదిరిగితే
కాళ్లను తడిపింది కదలివచ్చిన అల
"ఆటుపోట్లేగానీ అంతరించడంలేని
నా సంగతికేంగానీ
నా నీటిలో ప్రతిఫలించే మీ నీడల్లో
స్వర్గంలోనూ చల్లారని దుఃఖజ్వాల
నాకు పారదర్శక దృశ్యమే" అంటూ
నవ్వింది నిర్వేదంగా కడలి
మరోకెరటంతో ముందుకు కదలి.

- డా॥ వై.రామకృష్ణారావు
హైద్రాబాద్

❖❖❖❖❖


Telugu Association Inc.
TELUGU ASSOCIATION PRESENTS
STA
YOUTH
MEET UP
5PM - 8PM
ERMINGTON COMMUNITY CENTRE
6 RIVER ROAD,ERMINGTON
NSW 2115
7 TH
AUGUST
2021
INVITATION FOR ALL YOUNG ADULTS 18 -40 YEARS
MUSIC | FOOD | TALKS | GAMES | NETWORKING
FREE ENTRY
REGISTRATION AND RSVP REQUIRED
FOR EVENT INFORMATION AND QUERIES CONTACT
APARNA SUSARLA 0424 558 371 SECRETARY@SYDNEYTELUGU.ORG
MADHU BYREDDY 0425 209 397 PRESIDENT@SYDNEYTELUGU.ORG
WWW.SYDNEYTELUGU.ORG
EC@SYDNEYTELUGU.ORG

# బ్రహ్మశ్రీ దివాకర్ల సీతారామ శర్మ గారికి గౌరవ నీరాజనాలు




శ్రీవిద్యా ప్రకాశం గ్రంథకర్త, ఆధ్యాత్మికవేత్త, సౌందర్యలహరి శ్లోక పారాయణ భోధకర్త పూజ్యులు, శ్రీ దివాకర్ల సీతారామ శర్మ గారు జులై 6 వ తేదీ నాడు భౌతిక దేహాన్ని వీడి, శివసాయుజ్యం పొందారు. గతంలో సిడ్నీ తెలుగువాహిని మాసపత్రికకు వారి ఆధ్యాత్మిక రచనలు అందించేవారు. ఎన్నో ఆధ్యాత్మిక ప్రసంగాలు విశ్లేషణాత్మకంగా పరిశోధించి సిడ్నీ తెలుగువారందరినీ జ్ఞానసంపన్నులను చేసారు. వారి నిష్క్రమణ తెలుగువారందరికీ తీరని లోటు. సిడ్నీ తెలుగు వాహిని శ్రీ దివాకర్ల సీతారామశర్మగారికి గౌరవ నివాళులు సమర్పిస్తోంది. ఈ సందర్భంగా గతంలో జులై 2015 సంవత్సరంలో ప్రచురితమైన వారి వ్యాసాన్ని మరల ఈ సంచికలో ప్రచురిస్తున్నాము.



# సుందరకాండమందలి మంత్రతుల్య శ్లోకములు

*రచన : శ్రీ దివాకర్ల సీతారామశర్మ*

సప్తకాండమండితమైన శ్రీమద్వాల్మీకి రామాయణమున ఐదవది సుందరకాండము. ఇందు రామాయణమహామాలరత్నమని చెప్పబడు హనుమంతుని తేజోబలపరాక్రమాదులు వర్ణింపబడినవి. హనుమంతుడు శివాంశ సంభూతుడు. సుభగ సుందరుడు. హనుమంతుడు సముద్రమును దాటి లంకను ప్రవేశించి సీతాదేవిని దర్శించి రాక్షససంహారము గావించి, లంకను దహించి సీతాదేవి క్షేమవార్తను శ్రీరామచంద్రుని కెరిగించుటయే సుందరకాండయందలి ఇతివృత్తము. ఇందు ఆద్యంతము హనుమంతుని గుణగణములు అత్యంత నిపుణముగా వర్ణింపబడినవి.

వాల్మీకి గాయత్రీమంత్రమునందలి 24 బీజాక్షరములను గ్రహించి ఒక్కొక్క అక్షరమునకు ఒక్కక్క వేయి శ్లోకముల చొప్పున రామాయణమున 24,000 వేల శ్లోకములను రచించెను. సుందరకాండములో స, ధ, మ యను మూడు బీజాక్షరములు వచ్చునట్లు ఈ క్రింది మూడు శ్లోకములు రచిపబడినవి.

1. సనిర్జిత్యపురీం శ్రేష్ఠాం లంకాంతాం కామరూపిణీమ్ ..
2. ధన్యాదేవాస్సగంధర్వా స్సిద్ధాశ్చ పరమర్షయః ..
3. మంగళాభిముఖీ తస్యసాత దానీన్మహాకపేః ..

పై 3 శ్లోక పాదముల మొదటనున్న స, ధ, మ అను మూడు అక్షరములును గాయత్రీ మహామంత్రమునందలి 'భర్గోదేవస్యధీమహి' అను పాదమునందలి 5 ,6,7 వర్ణములని గమనింపవలెను.

సుందరకాండమున సుందరము కానిదేదియూలేదు. అది ఆద్యంతసుందరము.

" సుందరే సుందరో రామః
సుందరే సుందరీ కథా
సుందరే సుందరీ సీతా
సుందరే సుందరం వనమ్
సుందరే సుందరం కావ్యం
సుందరే సుందరః కపిః
సుందరే సుందరం మంత్రం
సుందరే కిం న సుందరమ్"

ఒక్క సుందరకాండమును పారాయణ చేసినను శ్రీమద్రామాయణమునంతను పఠించిన ఫలము సమకూరునని పెద్దలు చెప్పుదురు. సుందరకాండ కథతో పాటు అంతకు ముందును తరువాతను జరిగిన రామాయణ కథ అంతయూ ఇందు సూచింప బడినది. 31-34 సర్గములందు హనుమంతుడు తాను సముద్రలంఘనముచేసి లంకనుచేరి సీతాదేవిని చూచువరకుగల రామాయణ కథనంతను ఎరిగించును. యుద్ధకాండ కథాసూచన కూడా ఇందుకలదు. అందువలన సుందరకాండను సంక్షిప్త రామాయణమని చెప్పవచ్చును.

సుందరకాండము నందలి మంత్రతుల్యమైన కొన్ని శ్లోకములు ఈ క్రింద నుదాహరింపబడినవి. వాటిని నిత్యమూ పారాయణ చేసి హనుమత్కృపను పొందవచ్చును.

మనోజవం మారుతతుల్య వేగం
జితేంద్రియం బుద్ధి మతాం వరిష్టం |
వాతాత్మజం వానర యూధ ముఖ్యం
శ్రీరామ దూతం మనసాస్మరామి ||

1. తతో రావణ నీతాయాః సీతాయాః శత్రు కర్శనః |
ఇయేషపద మన్వేష్టుం చారాణా చరితే పథి || (1-1)

తా : తరువాత శత్రువులను కృశింపజేయగల హనుమ రావణునిచే తీసికొనిపోబడిన సీతాదేవి యొక్క స్థానమును అన్వేషించుటకు దేవగాయకులగు చారణులు సంచరించు ఆకాశమార్గమున వెళ్ళవలెనని సంకల్పించెను.

**తత్వ సంబంధ విషయములు :**

ఈ శ్లోకములో గాయత్రీ మంత్రములోని 12వ అక్షరమైన 'వ' కలదు. ఈ శ్లోకములో రహస్యమైన అర్థము నిక్షిప్తమైయున్నది. భగవదనుజ్ఞనుపొంది, భగవద్దత్తమైన అంగులీయకమును పొందిన తరువాత భగవంతునినుండి వేరుచేయబడిన జీవుని అన్వేషించుటకు ఆచార్యుడు సంకల్పించెనని ఆచార్య స్వరూపమందు సూచితమైనది. హనుమంతునకి 'శత్రు కర్శనః' అను పదము ఇందు ప్రయోగింపబడినది. శత్రువులను కృశింపచేయువాడు హనుమ. హనుమ సీతమ్మను హింసించు రావణాదులగు రాక్షసులను కృశింపచేయజాలినాడు. ఆచార్యుడు కూడా శత్రుకర్శనుడు కావలెను. భాగవత్ప్రాప్తికి ప్రతిబంధకమగు శత్రువు- కామము ఒక్కటియే! ఆ కామమును జయింప గలిగిన వాడే గురువు.

'పద' మనగా చోటు లేక గురుతు. హనుమ సీతమ్మ ఉండెడు చోటును వెతకవలనని సంకల్పించెను.
'సీతా' అను పదము జీవుని సూచించును.
'ఇయేష' అనగా సంకల్పించెనని అర్థము.
గురువుయొక్క సంకల్పమే శిష్యునికి రక్షయని సూచించుటకు ఈ పదము ప్రయోగింపబడినది.
భగవత్సంకల్పముకంటే ఆచార్య సంకల్పమే మనలను రక్షింపజాలినది.

హనుమ చారణులు సంచరించు ఆకాశమార్గమున వెళ్ళవలెనని సంకల్పించెను. ఆచార్యుడుకూడా చారణులు నడిచిన మార్గమునే నడువవలెను. చారణులు అనగా పూర్వపు ఋషులు, ఆచార్యులు మొదలైన వారు. శాస్త్ర జ్ఞానమున్నను పెద్దల యొక్క నడువడియే అనుసరింపదగినది. మరియూ ఆకాశమున వెళ్లుటయనగా సతత బ్రహ్మనిష్ఠ కలిగియుండుట. ఆకాశమనగా పరబ్రహ్మము.
ఇట్లు ఈ శ్లోకములో జీవుని తరింప జేయగల గురువు యొక్క స్వరూపము తెలియ జేయబడినది.

2. నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్మై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః (13-59)

తా : హనుమ అశోకవనమునన్వేషించుటకు సిద్ధపడి లేచి పై విధముగా ప్రార్థించెను.
లక్ష్మణునితో కూడియున్న రామచంద్రునకు నమస్కారము. దేవియగు ఆ జనకాత్మజకు నమస్కారము. రుద్ర, ఇంద్ర, యమ వాయు దేవతలకు నమస్కారము. చంద్ర, సూర్య, మరుద్గణములకు నమస్కారము.

**తత్వ సంబంధ విషయములు :**

వెనుక మహేంద్ర పర్వతమునుండి బయలుదేరినపుడు హనుమ నమస్కారము చేసి బయలుదేరెను. అప్పుడు సూర్యునకు, ఇంద్రునకు, బ్రహ్మకు, వాయువునకు మాత్రమే నమస్కరించెను. కాని ఇప్పుడు రామునకు, లక్ష్మణునకు, సీతకు ముందు నమస్కరించి తరువాత ఇతర దేవతలకు కూడా నమస్కరించెను.

భగవదనుగ్రహము, భగవద్భక్తుల అనుగ్రహము, దేవి అనుగ్రహము కలిగిననాడు కానీ ఆత్మదర్శనము, తద్వారా భగవద్దర్శనము లభింపవు.

వెనుక నమస్కారము చేసినపుడు 'నమ' శబ్దమును వాచ్యముగా ప్రయోగించలేదు. ఈ శ్లోకములో 3 సార్లు 'నమ' శబ్దమును ప్రయోగించెను.

నమః : *మః - నాది, న - కాదు*

ఈ అన్వేషించుటలో నేను కర్తనుకాను. నేను వారి కృపతో మాత్రమే ఏ పనినైననూ చేయగల శక్తుడనగుదును అని భావన మనోవాక్కాయములచే ప్రదర్శించి భగవంతుని శరణాగతివేడెను. అపుడు కాని సీతమ్మ దర్శనము లభించలేదు.

3. త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ
రాఘవస్త్వత్సమారంభాత్ మయి యత్న పరోభవేత్ (38-66)

తా : ఆంజనేయ ! వానరోత్తమ! ఈ కార్యము సమకూర్చుటలో నీవే వ్యవస్థాపకుడవు. రాముడు నీ ప్రేరణ వలన నా విషయమున ప్రయత్నము చేయువాడగుగాక!

**తత్వ సంబంధ విషయములు :**

ఈ శ్లోకము ఒక మంత్రము. దీనిని హనుమనుద్దేశించి చదివిన రామనుగ్రహము లభించును. శూరుడగు రామునితో మరల మరల ఈ మాటను చెప్పుము. దశరధాత్మజా! నెలరోజులు మాత్రమే బ్రతికెదను. తరువాత జీవింపను. నేను చెప్పుదనది సత్యము. రావణు నిచే బంధింపబడిన నన్ను పూర్వము ఇంద్రునికి వృత్ర వధచే పాపము సంక్రమించినపుడు అతనిని వీడి పాతాళములో దాగిన శ్రీని, మహావిష్ణువు పాతాళమునుండి తెచ్చి రక్షించినట్లు రక్షింపుమని చెప్పుము. ఇట్లు చెప్పి వస్త్రములో దాచియుంచిన దివ్యమగు చూడామణిని తీసి రామునికొసంగుమని సీత హనుమంతునకి ఇచ్చెను. వీరుడగు హనుమ ఉత్తమమగు ఆ మణిని వేలుకి పెట్టుకొనెను.

4. జయత్యతి బలో రామో లక్ష్మనశ్చ మహాబలః
రాజా జయతి సుగ్రీవో రాఘవేణాభిపాలితః
దాసోహం కోసలేన్ద్రస్య రామస్యాక్లిష్ట కర్మణః
హనుమాన్ శత్రు సైన్యానం నిహంతా మారుతాత్మజః
నరావణ సహస్రంమే యుద్ధే ప్రతిబలంభవేత్
శిలాభిస్తు ప్రహరతః పాదపైశ్చ సహస్రశః
అర్దయిత్వా పురీం లంకాం అభివాద్యచ మైదిలీం
సమృద్ధార్థో గమిష్యామి మిషతాం సర్వరక్షసాం (42-33,34,35,36)

తా : అదిక బలుడగు రాముడు, మహాబలుడగు లక్ష్మణుడు అతిశయముతో వర్ధిల్లుచున్నారు. రామునిచే రక్షింపబడిన సుగ్రీవుడు జయము కలిగి ఒప్పుచున్నాడు. నేను ఎట్టి కార్యమునందును క్లేశమునొందని వాడును, కోసలేంద్రుడగు రాముని దాసుడను. శత్రు సైన్యములను చంపు వాడను. వాయువు పుత్రుడను. వేయి మంది రావణులు వచ్చినను యుద్ధములో నన్ను ఎదిరించి నిలవలేరు.

శిలలరాళ్ళుతో, వృక్షములతో మాత్రమే నేను కొట్టెదను. లంకాపురిని మర్దించి, మైదిలికి నమస్కరించి, సాదింప వలసిన కార్యమును సాదించి రాక్షసులందరూ చూచుచుండగా వెళ్ళెదను.

**తత్వ సంబంధ విషయములు :**

హనుమ రాక్షస విజయమునకుపయోగించు 'జయ' మంత్రము. దీనిని చదువుకొన్నచో మనకు కూడా విరోధులు తొలగి విజయమును పొందుదుము. ఇంతవరకు హనుమ ఎచ్చటను తనను దాసునిగా పేర్కొనలేదు. సుగ్రీవ సచివుడు, రామదూతయనియే చెప్పుచుండెను.


సర్వ శక్తి మతియగు సీత రామునికే చెందినదై ఉండుట చూచి అట్టి శేషత్వమే ఆత్మ స్వరూపమని హనుమ గుర్తించెను. అందుచే తనను రామదాసునిగా పేర్కొనెను. ఇట తాను చేయు సర్వ వ్యాపారములు రాముడే తన ద్వారా చేయించుచున్నాడని దాని వలన కలుగు అతిశయమాతనిదే యని భావించును. అట్లు భావించి రాక్షసులని జయించును.

ఇప్పుడు హనుమ చేయునది విరోధి నిరశనము. శత్రువులను చంపుట, దానిని చేయువాడు తాను కాదనియూ, దాని వలన కలుగు ప్రీతియూ తనది కాదనియూ హనుమంతుడు భావించుచుండెను. అట్లు భావించుచూ కర్మ చేయుచుండెను. ఇదియే మనము అలవరుచుకొనవలసిన విజయ మంత్రము.

**మనోవైక్లబ్య నివారణ మంత్రము :**

సంజీవ పర్వతోద్ధారా మనో దుఃఖ నివారాయ |
ప్రసీద మహాబాహో త్రాయస్వ హరి సత్తమ ||

❖



తెలుగు బడి
Telugu Association Inc Sydney
Telugu Language School, Telugu Badi
An initiative of Telugu Association Inc.
Telugu Association Inc.
JOIN
TELUGU BADI
For Enrolment forms visit
Term Starting from
Sunday 31 Jan 2021
www.sydneytelugubadi.org
Email: school@sydneytelugu.org
COVID SAFE PLAN
Telugu School Locations
Strathfield South
Kellyville
Wentworthville
Eastwood
Quakers Hill
Online Classes
TEACH YOUR
CHILD TELUGU
SUNDAY CLASSES
10AM-12 PM
NSW Community
Language Certified
Teachers
+150 Students
+6 Locations
Locally Developed New Curricullum
Early Stage 1
Early Stage 2
Level 1
Level 2
Level 3
Co-Curricular Activities
Operated in Association with
NSW Federation of Community Languages
NSW Department of Education
Department of Social Service
Made with PosterMyWall.com


❖❖❖❖❖



Sweet
UTSAV
Sweet UTSAV
When Only The Best Will Do
6/17 Brumby Street, Seven Hills, NSW, 2147 Tel: (02) 8608 7146 Mob: 0450 740 277


❖❖❖❖❖

# విన్నపం

శ్రీ పెయ్యేటి రంగారావు, హైద్రాబాద్



వేణువు నూదరా గోపాలా

ఇహ వ్యామోహము వదలునటుల నీ ||వేణువు||

సరిగమప అను ఆరు స్వరమ్ముల

ఆరు వైరులను అంతము చేసి

ని అను సప్త స్వరమ్మున

నిష్కామమ్మును కలుగగ జేసి

నాద సాధనతో మోక్ష సాధనకు

మార్గము సుగమము చేయర గోపాలా ||వేణువు||

నాద మునీంద్రుడు త్యాగరాజుకు

రామ భక్తుడు శ్రీ రామదాసుకు

వాగ్గేయకారుడు పురందర దాసుకు

భారత రత్న బిస్మిల్ల ఖానుకు

ముక్తి పథమ్మును చూపిన ఘనుడవు గోపాలా ||వేణువు||

గీతము తెలియదు సంగీతము తెలియదు

నీ వేణునాదము ఎడద వీనులతొ

వినుచుంటినయా మీగడ చోరా

బేగడ రాగముతో వైరాగ్యము నీయవయా గోపాలా ||వేణువు||

తానమాడెడు తరుణమందున

గోపిక లందరి వలువల దాచి

నేను అన్నదే మిథ్యని తెలిపి

అహమును బాపి ముక్తిని యిడితివి గోపాలా ॥వేణువు॥

చిన్నదిగానే అగపడు కోరిక

అతి పెద్దదని నీకూ ఎరుక

శ్వాసను వదిలెడి ఘడియలనందు

నీ నామమునే తలుపగ చేయరా గోపాలా ॥వేణువు॥

జీవన వనమున గతి తప్పి తిరిగితి

ఆకలి నిద్రల ఇతర వాంఛల

మతి మాలితిని, నిను మరచితిని

అనాయాసముగ నిన్ను చేరనీ గోపాలా ॥వేణువు॥

❖❖❖❖❖




# రాక్షసుడు

శ్రీమతి తమిరిశ జానకి, హైద్రాబాద్

నిద్ర రావట్లేదు. కథ చెప్పమ్మా

ఇంకోరోజు చెప్తాన్లేమ్మా. పడుకో. మంచిదానివి కదూ.

ఉహూ....ఇప్పుడే చెప్పు. ఏడేళ్ళ రమ గునిసింది .

చెల్లెలికి రవి కూడా వంతపాడాడు. చెప్పమ్మా . కథ వింటూ నిద్రపోతాం.

ఏం కథ చెప్పనూ...కాకి నక్క బావా కథ చెప్పనా

ఆ... చెప్పు...చెప్పు...ఉత్సాహంగా తల్లి మొహంలోకి చూసింది రమ.

వొద్దమ్మా .ఎప్పుడూ అలాంటి కథలేనా...ఏదైనా రాక్షసుల కథ చెప్పు. అడిగాడు రవి . వాడికి తొమ్మిదేళ్ళు. ఈమధ్య స్నేహితుల దగ్గిర రాక్షసుల కదలు డిష్యుం డిష్యుంల కథలు వింటున్నాడు వాడు.ఆకథలు నచ్చుతున్నాయి వాడికి.

అటువంటి కథలు వింటున్నప్పుడు వాడిలో తెలియని ఆవేశం వచ్చి కళ్ళు పెద్దవి చేస్తాడు. ఆరాక్షసుల్నీ దొంగల్నీ తనే పిండి పిండి చేసెయ్యగలడన్నట్టుగా పోజు కూడా పెట్టేస్తాడు.

రాక్షసుడి కథ కావాలా నీకు......అడిగింది అరుంధతి .

ఔనమ్మా చెప్పు.....

సరే అయితే....వింటూ నిద్రపోవాలి తెల్సిందా....

తెల్సిందన్నట్టుగా బుద్ధిగా తలలు ఊపారు పిల్లలిద్దరూ.

మరేమో ఒక పెద్దఅడవి ఉందిట. ఆ అడవికి అవతల ఒక పెద్ద కొండగుహ ఉందిట. ఆ గుహలో ఒక రాక్షసుడు ఉండేవాడుట.

తల్లికి దగ్గిరగా జరిగి ఆవిడ కొంగు రెండు చేతుల్తోనూ గట్టిగా పట్టుకుంది రమ.

ఆ రాక్షసుడు కొండకి దగ్గిరలో ఉన్న ఒక ఊరిమీదపడి రోజుకో మనిషిని ఎత్తుకొచ్చి చంపి తినేస్తుండేవాడుట. ఒకరోజు వాడికో వింతకోరిక కలిగింది. మనుషులు తినే తిండి అప్పుడప్పుడు తింటే బావుండుననిపించింది. కానీ వాడికి ఎవరు వండిపెడతారు.అప్పుడు వాడేం చేశాడంటే ఒంటరిగా బతుకుతున్న ఒక అమ్మాయింటికి వెళ్ళాడు అర్ధరాత్రి. ఆ అమ్మాయి కెవ్వుమంది వాడిని చూసి. నోరెత్తావంటే చంపేస్తాను.నేను చెప్పినట్టు చెయ్యి. నీ ఇంట్లో ఉన్న బియ్యం పప్పులు పచ్చళ్ళు తిండి సరుకులన్నీ ఏమేం ఉన్నాయో అన్నీ ఇలా పట్టుకొచ్చి మూటకట్టు అని అరిచాడు. ఆ అమ్మాయి ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని వాడు చెప్పినట్టే చేసింది. మూట ఒక భుజమ్మీద అమ్మాయిని ఒక భుజమ్మీద  పెట్టుకుని తన గుహకి తీసికెళ్ళిపోయాడు.

ఒక్క నిమిషం చెప్పడం ఆపింది అరుంధతి. అయ్యో పాపం అంటూ జాలిగా మొహంపెట్టాడు రవి. ఆ అమ్మాయి ఎంతో ఏడ్చి ఉంటుంది కదమ్మా మరింత జాలిగా అడిగింది రమ.

ఔనమ్మా ఎంతో ఏడ్చింది తనని వదిలిపెట్టమని. అయినా సరే రాక్షసుడికి దయ కలగలేదు.

రాక్షసులకి దయ ఉండదు కదమ్మా . వెంటనే అన్నాడు రవి.

ఉండదురా. కొందరు మనుషులు కూడా  ఏమాత్రం దయలేనివాళ్ళుంటారు. అందుకే అటువంటివాళ్ళని రాక్షసులని తిడతారు. తల్లి మాటలకి రవి బుర్రలో ఏదో ఆలోచన కదలాడింది. మళ్ళీ కద చెప్పడం మొదలుపెట్టింది అరుంధతి. పాపం ...ఆ అమ్మాయి భయపడుతూ భయపడుతూనే రాక్షసుడికి వండిపెడుతూ ఉండేది. ఎప్పుడో ఓరోజు తనని చంపి తినేస్తాడని దిగులుతో ఉండేది. భగవంతుడిని మనసులో ప్రార్ధించుకుంటూ ఉండేది. ఒకరోజు రాక్షసుడు వచ్చేసరికి ఏడుస్తూ కూచుని ఉంది. నీ ఏడుపు చాలించి ఇవాళ ఏం వండావో నాకు తొందరగా వడ్డించు అన్నాడు. అప్పుడు తను లేచి నిలబడి పొద్దున్న నువ్వు వెళ్ళేటప్పుడే చెప్పాను కదా సరుకులన్నీ అయిపోయాయని వండడానికేమీ లేవు. సరుకులు తీసుకొస్తే వండుతాను అంది. అంతే....కోపంతో రాక్షసుడు భీకరంగా చూశాడు. దావబాదాడు. అమ్మాయి ఏడ్చింది మొత్తుకుంది. నువ్వు సరుకులు తీసుకొచ్చి ఇవ్వనిదే నేనెలా వంటచెయ్యగలనని కాళ్ళమీద పడి ఏడ్చింది. చిత్రహింసలు పెట్టాడు

వాడు.
అమ్మా అంటూ మధ్యలో అడ్డు తగిలింది రమ. నాకు భయం వేస్తోందమ్మా ఇంక చెప్పొద్దమ్మా కథ .
సరేనమ్మా చెప్పనులే. చూశావా రవీ రాక్షసుడి కద చెప్తే చెల్లాయి భయపడుతుంది. ఇంక పడుకోండి .
నాకు భయం లేదమ్మా అందుకే చెప్పమన్నాను.....నసిగాడు రవి. మరి కాసేపట్లో పిల్లలిద్దరూ నిద్ర పోయారు.
కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చుంది అరుంధతి. బయట వీధి దీపాలు వెలగట్లేదు. ఆచీకటితో తన జీవితాన్ని పోల్చుకుంటూ భారంగా నిట్టూర్చింది. ఎదురింటిముందు కారు ఆగింది. లోపల్నించి నౌకరు పరిగెత్తుకుంటూ వచ్చి గేటు తీశాడు. సరిగ్గా ప్రతిరోజూ తొమ్మిదింటికల్లా వస్తారు ఎదురింటి ఆఫీసర్ గారు భార్యా. వాళ్ళు క్లబ్ నించి ఇంటికి తిరిగి వచ్చారంటే తొమ్మిదైందన్న మాటే సరిగ్గా. వాళ్ళకి పిల్లల్లేరు. ప్రతిరోజు సాయంత్రం ఆఫీస్ నించి ఇంటికి వచ్చాక ఒక అరగంటలో భార్యని కూడా తీసుకుని ఆఫీసర్స్ క్లబ్ కి బయల్దేరతాడు ఆయన. ఆఫీసర్ల భార్యలు కొందరు వస్తూనే ఉంటారు. తమకి పిల్లలు కూడా లేరు అటువంటప్పుడు పొద్దున్నించీ రాత్రిదాకా ఒక్కత్తీ కూచుని పిచ్చెక్కిపోదూ ఆమెకి అన్న ఆలోచనతో ఆమెని కూడా తీసుకువెళ్తాడాయన. అన్నీ ఉండి పిల్లలు లేరన్న దిగులుతో బాధపడే ఆ ఆఫీసర్ గారిని తల్చుకుంటుంటే అరుంధతికి డబ్బులేక అధిక సంతానంతో ఎన్నో అవస్థలు పడిన తన తండ్రి గుర్తొచ్చాడు. భగవంతుడి సృష్టి ఎంత విచిత్రమైనది అనిపించింది. గతం కళ్ళముందు కదలాడింది.
రాఘవయ్యగారికి ఆయన నలభైమూడో ఏట కడగొట్టుదానిగా సరిసంఖ్య ఉంటే బావుంటుందన్నట్టుగా అయిదుగురి అక్కల తర్వాత పుట్టింది అరుంధతి. ఆయనా భార్యాకూడా విసుగూ చిరాకులతోనే పెంచుకొచ్చారు ఆ పిల్లని. అందుకే
తల్లితండ్రుల్లో ఎవరిదగ్గిరా కూడా చనువులేదా పిల్లకి. ప్రేమకి నోచుకోలేదు. ఒక్క నాడూ ఒక్క కొత్త గౌనుక్కూడా నోచుకోలేదు. ఔనుమరి ముందు అయిదుగురు అక్కలున్నారాయె. వాళ్ళకి పొట్టిఅయిపోయిన గౌన్లు పరికిణీలే తొడుక్కుని పెద్దదయ్యింది. ఏడాది పిల్లగా ఉన్నప్పుడే పెద్దక్కకి పెళ్ళయి వెళ్ళిపోడంతో అసలు పెద్దక్క తనతో మాట్లాడిందేలేదు.తర్వాతి అక్కయ్యలదగ్గిర కూడా భయమే. పెద్దవుతున్నకొద్దీ పాతబట్టల్లోనూ చెల్లెలు కుందనపు బొమ్మలా ఉండడం వాళ్ళకి అసూయగా ఉండేది. చేరదీసేవారు కాదు.
అరుంధతికి కాస్త జ్ఞానం తెలిసేసరికి పైముగ్గురక్కలకీ పెళ్ళిళ్ళయి కాపరాలకి వెళ్ళారు. తర్వాత వరసగా ప్రతిఏడూ వాళ్ళు కాన్పులకి ఒక్కొక్కళ్ళూ రావటం అయిదేసి నెలలు ఉండటం వెళ్ళడం ఆ బాదరబందీలో తల్లితండ్రులిద్దరికీ అరుంధతిని పట్టించుకునే ఓపిక తీరుబడి ఉండేవికావు. సంసారం గడవక అప్పుచెయ్యని రోజంటూ ఉండేదికాదు రాఘవయ్యకి. పాత అప్పులు తీరకుండానే కొత్త అప్పులతో గుండెల్లో మంటలు మరింత రాజుకుంటూ ఉండేవి. ఎప్పుడైనా ధైర్యం చేసి ఆడుకునేందుకేమైనా కొనివ్వమని అడిగితే నీమొహానికి అదొక్కటే తక్కువైంది అంటూ చీదరించుకునే తండ్రి అక్కయ్యలొచ్చినప్పుడల్లా వాళ్ళ పిల్లలకి అడగకుండానే ఆటసామాను కొనివ్వడం ఆశ్చర్యంగా ఉండేది అరుంధతికి. ఇప్పుడెందుకండీ ఇవి కొన్నారూ అంటూ మొహమాటానికి ఏదో అనాలికదా అని అల్లుళ్ళు అనడం చిన్నప్పుడు కాకపోతే పెద్దయ్యాక ఆడుకుంటారా అంటూ తనచిరిగిన కాలరు మావగారు సవరించుకోవడం.....అప్పుచేసి కొన్నాడన్నది వేరే విషయం.
ఇటువంటివన్నీ చిన్నతనంనించే బాగా ఆకళింపు చేసుకున్న అరుంధతికి తండ్రి అంటే చనువులేకపోవడమే కాదు ఆయనమీద కోపాన్ని కూడా పెంచుకుంటూ వచ్చింది లోలోపల. ఎంత కోపం వచ్చినా అణిచిపెట్టుకోడమే తప్ప పైకి ప్రదర్శిస్తే వీపు విమానం మోత మోగుతుందని తెలుసు. వెన్నెముక విరగ్గొట్టుకోడమెందుకని నోరెత్తేదికాదు.
అనారోగ్యంతో సంసారం ఈడ్చుకొస్తున్న అనసూయమ్మకి చెయ్యాసరాగా ఉండేందుకు థర్డుఫారమ్ తో అరుంధతి చదువు ఆగిపోయింది. తనపైనున్న అక్కలిద్దరి పెళ్ళిళ్ళు కూడా అయిపోయాయి. తండ్రి రిటైరవడానికి ఇంక రెండేళ్ళు మాత్రం ఉంది. వరసగా నాలుగేళ్ళు ఇంటిపనుల్లో బాగా అనుభవం సంపాదించేసింది. ఇంటి పనుల్తోపాటూ పెళ్ళిచూపులకి కూచోవడంలో కూడా అనుభవం వచ్చేసింది. పెళ్ళినిగురించిన ఆలోచనలొక్కటే తనకి రిలీఫ్ ని ఇచ్చేవి. తెల్లవారి లేచినది మొదలు తల్లి సేవ తండ్రికి కావల్సినవి చూడటం పనిమనిషిని పెట్టుకోకపోడంవల్ల ఆ పన్లు వంటపని వీటన్నిటితో అలసిన మనసు రాత్రిళ్ళు రెక్కలు కట్టుకుని విహరించేది. పెళ్ళిచేసుకుని వెళ్ళిపోతే తనకోసం అంతా సుఖమే ఎదురు చూస్తోందనుకునేది. పంచరంగుల కలల్లో పరవశమైపోయేది. తను అందంగా ఉంటుందని అందరూ తనవంక కన్నార్పకుండా చూస్తారని తెలుసు. పద్దెనిమిదోఏడు నడుస్తుండగా పక్క ఇంట్లోకి అద్దెకి వచ్చాడు ఆనందరావు. అడపా తడపా ఎవరూ చూడనప్పుడు తనని పలకరిస్తుంటే మొదట్లో సిగ్గుతోనూ భయంతోనూ జవాబీయకపోయినా తర్వాత తర్వాత ధైర్యం చేసింది. అతని

అందం చూసి దేవుడు తనకోసం పంపిన రాజకుమారుడు ఇతనే అనుకుంది. రాత్రి కళ్ళుమూసుకుంటే అతనే కళ్ళల్లో మెదిలి గిలిగింతలు పులకింతలు కలిగేవి. కానీ ఒక్కటే లోటుగా అనిపించేది. అతను చేస్తున్నది చాలా చిన్న ఉద్యోగం. కానీ అంతలోనే తనకితనే నచ్చచెప్పుకునేది ఎల్లకాలం అటువంటి ఉద్యోగమే చేస్తాడా.....అదృష్టం వరించి ముందుముందు పెద్దఉద్యోగస్తుడు అవకూడదని ఏముంది. ఈఆలోచనతో అతన్ని తన ఊహల్లో తిరగనిచ్చేది మనస్పూర్తిగా. అనారోగ్యం ఎక్కువై తల్లి కన్నుమూసింది.

కూతుళ్ల పెళ్ళిళ్ళకి చేసిన అప్పులు తీర్చకుండానే భార్య జబ్బుకోసం మళ్ళీ బోలెడు అప్పులు చేసిన రాఘువయ్యకి ఈజన్మలో అరుంధతి పెళ్ళి చెయ్యలేననిపించింది.

ఆమె పేదవాడి ఇంట్లోపుట్టిన రాజకుమారిలా కనిపించేది ఆనందరావు కళ్ళకి. ఒక శుభముహూర్తాన ఆనందరావు కోరికమీద అతనితో అతను తీసుకెళ్ళిన ఊరు వెళ్ళిపోయింది. తండ్రితో చెప్తే ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదంటాడు. కారణం తమ కులాలు వేరు. అసలు పెళ్ళన్నా చెయ్యకుండా కూచో పెడతాడుగానీ ఇటువంటి పెళ్ళికి ఒప్పుకోడు. అటు ఆనందరావు తల్లి తండ్రులూ ఒప్పుకోరని తెల్సింది. తనే చెప్పాడు. అటువంటప్పుడు ఎవరికీ చెప్పకుండా చేసుకోడంతప్ప వేరే మార్గం లేదని ఆనందరావన్నమాటని వ్యతిరేకించలేకపోయింది అరుంధతి.

రోజులుగడిచేకొద్దీ

ఇరుగుపొరుగుల మాటలు ....స్నేహితుల ఎగతాళి మాటలు ఆనందరావు మనసుమీద గట్టిదెబ్బ తీశాయి. తమకులం కాని పిల్లని చేసుకుని కన్నతల్లితండ్రులకి దూరమై నలుగురిచేతా మాటలనిపించుకుంటూ తను పొందిన సుఖమేమిటన్నప్రశ్న అతన్ని కుంగదీయటం మొదలుపెట్టింది. దానికంటే మరో పెద్దప్రశ్న అనుమానంతో కూడిన ప్రశ్న అతని మెదడుని పురుగులా తొలవసాగింది. ఇంత అందమైన అరుంధతి మీద....డబ్బుకి కటకటలాడిపోయే ఇంట్లో పుట్టిన ఇంత అందమైన అరుంధతి మీద తన కన్ను పడకముందు మరెవరి కన్నూ పడకుండా ఉండి ఉంటుందా ధైర్యంగా తనతో ప్రేమాయణం సాగించినట్టే అదివరకు మరెంతమందితో సాగించిందో ఏమో.....వాళ్ళెవరూ పెళ్ళి అనే బుట్టలో పడకుండా జాగ్రత్తగా కథ నడిపించుకుని వెళ్ళిపోయి ఉంటారు. తను మాత్రం పడిపోయాడు బుట్టలో. ఈ అనుమానం బలపడిపోయి అరుంధతి మీదా వెంటవెంటనే పుట్టిన పిల్లలిద్దరిమీదా విసుగులూ చిరాకులూ ఎక్కువయ్యాయి. మనశ్శాంతి కరువైంది ఆనందరావుకి. మధువుకి బానిసయ్యాడు. కొత్తలో స్నేహితుల బలవంతమ్మీద పుచ్చుకున్న పొరపాటు అలవాటుగా మారింది. అలవాటు నిత్యవసరంగా మారడానికి ఆట్టే కాలం పట్టలేదు. మేనమామ కూతురు సుబ్బలక్ష్మి వాళ్ళీఊరే రావడంతో పుండుమీద కారం చల్లినట్టయి భార్యమీద మండిపడటం మరింత ఎక్కువైంది. వంకలేనమ్మ డొంకట్టుకేడ్చిందన్నట్టు... రానురాను భార్యని ప్రతిరోజూ వొంగదీసి బాదడానికి ఏకారణమూ అవసరం లేదన్నట్టు ఉండేది అతని ప్రవర్తన. తండ్రంటే భయపడిపోతూ బిక్కమొహాలేసుకుని బిక్కుబిక్కుమంటూ పిల్లలు ఓమూల కూచున్నా తప్పే....పరుగులెడుతూ వాళ్లదోవన వాళ్ళు ఆడుకున్నా తప్పే. అరుంధతిని తను చేసుకోకపోతే సుబ్బలక్ష్మి తన భార్య అయిఉండేదన్న ఆలోచన నిత్యం కురుపు సలిపినట్టు సలపడం మొదలైంది వాళ్ళు ఈ ఊరు వచ్చినప్పటినించీ. సుబ్బలక్ష్మికీ తనకి పెళ్ళిచెయ్యాలని అటు పెద్దవాళ్ళూ ఇటుపెద్దవాళ్ళూ అనుకున్నారు. తను చేసిన పనేమిటి వెర్రి పనికాక .....సుబ్బలక్ష్మికి అందం లేకపోవచ్చు కానీ అరుంధతికి లేని ఐశ్వర్యం తన వెనకాల ఉంది. మావయ్యకి ఒక్కతే కూతురు. ఆయన ఇల్లు ఆస్తి మొత్తం సుబ్బలక్ష్మిక్కాక మరెవరిదవుతుంది. కూతురిపెళ్ళి కట్నకానుకలతో గొప్పఆర్భాటంగా మరెంతో ఆడంబరంగా చేసిందికాక రికమెండేషన్లమీద అల్లుడికి పెద్ద ఉద్యోగం కూడా వేయించాడు మావయ్య అనే విషయం ఆనోటా ఆనోటా చెవిని పడి తను చేస్తున్న ఉద్యోగం తనకి వచ్చే జీతం తననే ఎక్కిరిస్తున్నట్టుగా అనిపించసాగింది ఆనందరావుకి. ముందు చూపన్నది లేకుండా తను మోజులో పడి అరుంధతిని రిజిష్టర్ మ్యారేజ్ చేసుకోడం పెద్దపొరపాటుగా భావించుకుని బాధతో కుమిలిపోడం అలవాటైపోయింది. రోడ్డుమీద నడుస్తుంటే అందరూ తననే వేలెత్తి చూపిస్తున్నారమోనన్న శంక పీడించేది. రాత్రయితే పేకాటలోనూ మత్తులోనూ మునిగితేలడం ......తెల్లారితే పెరుగుతున్న అప్పులు తల్చుకుని బెదిరిపోవడం....చివరికి అన్ని విసుగులూ చూపించుకునేటందుకు భార్య అనే మరబొమ్మ ఒకటి తేరగా ఉంది.

ఫలితం......ప్రతిరోజు అరుంధతి కడుపునిండా తిండి తినలేకపోయినా కదుములు కట్టే దెబ్బలు మాత్రం ఠంచనుగా తింటోంది. కాస్త జ్ఞానం తెల్సిన పిల్లాడు రవి గిలగిల్లాడిపోయేవాడు తల్లి తినే తిట్లు దెబ్బలు చూసి. వాడికి తండ్రి మీద కోపం ఇంతా అంతా కాదు. తల్లిమీద జాలి చెప్పనలవికాదు.

అమ్మా....

రవి పిలుపుకి ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి తేరుకుంది అరుందతి. పక్కకి తిరిగి చూసింది. రమ మంచి నిద్రలో ఉంది. రవి మాత్రం ఇటే

చూస్తున్నాడు. కిటికీ దగ్గిర్నించి లేచి వచ్చి రవి పక్కనే కూచుంది.

ఏం రవీ ఇంకా నిద్ర పోలేదూ.....

గడియారం వంక చూసింది. పది దాటింది.

ఊఁ..నిద్ర రావట్లేదు....అమ్మా...మరేమో నువ్వు చెప్పిన కథలో ఆ అమ్మాయి రాక్షసుడినించి తప్పించుకుని పారిపోగలుగుతుందా లేకపోతే వాడి చేతుల్లో చచ్చిపోతుందా ...

రేపటివరకూ తెల్సుకోకుండా ఆగలేని ఆతృత వాడిది. తను చెప్పిన పిచ్చికథ వాడి మనసుని అంతగాఆలోచనతో ఇబ్బంది పెట్టినందుకు అరుంధతి మనసు నొచ్చుకుంది. ఏదో ఒకటి ఇప్పుడు వాడికి జవాబు చెప్పాలి. తప్పించుకుని పారిపోయి సుఖంగా ఉందనే చెప్పాలి. అప్పుడే వాడి మనసుకి తృప్తిగా ఉంటుంది. నిద్రపోగలడు. పిల్లలకి సుఖాంతమైనవే కదా చెప్పాలి. అందుకే వెంటనే అనేసింది.

ఆ రాక్షసుడి గుహలోంచి తప్పించుకుని పారిపోయి సుఖంగా బతుకుతుంది ఆ అమ్మాయి. నీ సందేహం తీరిందిగా. ఇంక పడుకో.

రవి కళ్ళల్లో మెరుపు అరుంధతి కళ్ళపడలేదు ఆ చీకట్లో. అంతలో వీధి తలుపు చప్పుడైంది. అదిగో నాన్నగారు వచ్చేశారు అంటూనే వెళ్ళి తలుపు తీసింది. తాగి తూలుతున్న భర్త కింద పడిపోతాడేమోనని చటుక్కున పట్టుకుంది. పురుగుని విదిలించికొట్టినట్టుగా ఆ చేతిని విదిలించాడు ఆనందరావు.

ఎంతసేపు తలుపుకొట్టినా తియ్యవేం...ఏం రాచకార్యాలు వెలగబెడుతున్నావు

వెంటనే తలుపు తీశానండీ ఆలస్యం చెయ్యలేదు

ఎదురు సమాధానం కూడానా అంటూ చెంపమీద కొట్టాడు ఆనందరావు

మంచంమీంచి దిగిపోయి తలుపు పక్కన నిలబడి గుండె అరచేతుల్లో పెట్టుకుని చూస్తున్న రవి అప్రయత్నంగా తన చెంప తడుముకున్నాడు. మరోసారి తండ్రి చెయ్యి అమ్మ వీపుమీద పదేపదే పడింది. భయంతోనూ బెదురుతోనూ పైకి తన్నుకొస్తున్న ఏడుపుని మింగేస్తూ వెళ్ళి బల్లిలా మంచాన్ని అంటిపెట్టుకుపోయాడు.

మర్నాడు తండ్రి ఇంట్లో లేని సమయంలో తల్లి దగ్గిరకొచ్చి మెల్లిగా పిలిచాడు రవి. వాడి చేతుల్లో రెండు సంచులున్నాయి. ఒకదాన్లో వాడి పుస్తకాలు రెండోదాంట్లో చెల్లెలి పుస్తకాలూ ఉన్నాయి.

ఏమిట్రా రవీ....

పదమ్మా వెళ్ళిపోదాం....

ఎక్కడికిరా.... లేనినవ్వు తెచ్చిపెట్టుకుంటూ అడిగింది.

రాముడే తర్వాత కృష్ణుడిగా పుట్టాడని నువ్వోసారి చెప్పావుకదమ్మా....

ఔనూ....అయితే....

అలాగే ఒకటి నాకు తెల్సిపోయిందమ్మా......నువ్వు నిన్న రాక్షసుడి కధ చెప్పావు చూడూ.....ఆ రాక్షసుడే ఈజన్మలో మన నాన్నగారిలా పుట్టాడమ్మా ......అప్రయత్నంగా తన చేత్తో వాడి నోరు మూసింది అరుంధతి.

ఔనమ్మా...అంతే అయ్యుంటుంది. నిన్నెప్పుడూ కొడుతుంటారు. సరుకులు అయిపోయాయని నువ్వెన్నిసార్లుచెప్పినా ఏమీ తీసుకురాకుండా అన్నంలోకి ఇది చెయ్యలేదే అదిచెయ్యలేదే అంటూ కొడుతుంటారు. ఆకథలో అమ్మాయి రాక్షసుడినించి తప్పించుకుని పారిపోయింది కదా. అలాగే మనం ఈ ఇంట్లోంచి పారిపోదాం.ఇవిగో నావీ చెల్లాయివీ పుస్తకాలు పట్టుకొస్తున్నాను.నేను తొందరతొందరగా అన్నిక్లాసులూ ప్యాసయిపోయి పెద్దయిపోయి పెద్దఉద్యోగంలో చేరి నిన్నూ చెల్లాయినీ చక్కగా చూసుకుంటాను.పదమ్మా ఈ ఇంట్లో ఉండద్దు.

బాబూ రవీ .....

కొడుకుని దగ్గిరకి తీసుకుంది అరుంధతి. కన్నీరు కార్చడం తప్ప వాడికేమీ సమాధానం ఇవ్వలేకపోయింది. ఆకన్నీటి తెరల్లో కాంతికిరణంలా రవి మెరిశాడు. రవికి మాత్రం తల్లి కన్నీటి వెనక నాన్న రూపంలో ఉన్న ఒక పెద్ద రాక్షసుడు కనిపించాడు.

❖❖❖❖❖

# భయం (కార్డు కథ)

శ్రీమతి పెయ్యేటి శ్రీదేవి

శారద తన స్నేహితురాలు శాంతి పుట్టినరోజు పార్టీకని వెళ్ళివస్తూంటే ఉన్నట్లుండి హోరున వర్షం మొదలయింది. రాత్రి పదయింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వర్షంలో తడుస్తూ వడివడిగా నడుస్తోంది. వెనకాల ఎవరో తరుముకు వస్తున్నారు. రౌడీలు వెంట పడుతున్నారని ఒకటే భయం. అసలే ఆడపిల్ల కనబడితే మొగాళ్ళు మృగాళ్ళలా తయారవుతున్నారు. వర్షం అంతకంతకీ ఎక్కువవుతోంది గాని తగ్గటల్లేదు. శారద ఇంకా వేగంగా పరిగెడుతోంది. ఆ కుర్రాళ్ళు 'ఆగు, ఆగు' అంటూ తరుముకొస్తున్నారు. శారదకి ఇంక పరిగెత్తే ఓపిక లేక, ఒక పక్క భయంతో అక్కడ ఒక ఇంటిదగ్గర ఆగి తలుపు బడబడ బాదుతోంది. ఒక పెద్దాయన తలుపు తీసారు.

'ఎవరమ్మా మీరు? ఇంత రాత్రివేళ వర్షంలో ........ ముందర లోపలికి రండి. బాగా తడిసారు.' అంటూ లోపలినించి తువ్వాలు ఇచ్చి తుడుచుకోమన్నాడు.

'అమ్మో, ఈయనా మృగాడే! ముసలాడైతే మాత్రం? వీళ్ళా ఆడపిల్ల కనబడితే వదలరు.' మనసులో అనుకుంటూ అంది, 'మా యిల్లు పక్కవీధిలోనేనండి. నన్నెవరో తరుముకొస్తున్నారు. అందుకే గమ్మున మీ తలుపు తట్టాను. నా స్నేహితురాలి పుట్టినరోజు పార్టీకి వెళ్ళి వస్తుంటే వర్షం మొదలయింది.'

'ఫరవాలేదు. నువ్వేం భయపడకు.

ఇంతలో తలుపులు మళ్ళీ బడబడా బాదుతున్నారు.

'అదిగో ఆ రౌడీలే అయివుంటారు. నేను లేనని చెప్పండి. నేను ఆ గదిలో వుంటాను.' అంది వణికిపోతూ.

పెద్దాయన తలుపు తీసాడు.

ఆ వచ్చిన కుర్రాళ్ళు, 'ఇటో అమ్మాయి వచ్చింది. స్నేహితురాలి ఇంట్లో తన బ్యాగ్ మర్చిపోయింది. ఇది ఆమెకిచ్చేయండి.' అంటూ ఆయనకు బ్యాగ్ ఇచ్చి వెళిపోయారు.

శారద తను అనవసరంగా భయపడినందుకు నవ్వుకుంది. ఇంతలో వర్షం వెలిసింది. ఆమె ఇంటికి బయలుదేరింది.

❖❖❖❖❖



# మబ్బుల పల్లకి

శ్రీమతి కమల పరచ, కాలిఫోర్నియా, అమెరికా

"ఏమండీ... ఏమండీ... ప్లీజ్ ప్లీజ్" ముందుకు వెళుతున్న ఏమండీగారి చేయిపట్టుకొని అన్నాను.

"ఊ... వెళ్ళు" అన్నారు ఏమండీగారు.

"థాంక్యు. ఎంతైనా మా అయన చాలా మంచివారు. బంగారు కొండ" అన్నాను.

"ఎందుకూ కిటికీ సీట్ ఇచ్చినందుకా? ఇవ్వక పోతే బతకనిస్తావా, దారంతా గొణుగుతూనే వుంటావు." అన్నారు చిన్నగా నవ్వుతూ.

నేనూ నవ్వుతూ లోపలకు వెళ్ళి, కుర్చీ సరిగ్గా సద్దుకొని కూర్చుంటూ కిటికీలో నుంచి బయటకు చూసాను. కొద్ది దూరంలో, అక్కడక్కడ రెక్కలు సాచి, వెండిరంగులో, ఎండకు మిలమిలా మెరుస్తూ రాయంచలా నిలబడి వున్నాయి మబ్బుల పల్లకీలు (విమానం కు నేను పెట్టుకున్న ముద్దు పేరు.) వాటిని అలా పరవశంగా చూస్తూ వుండి పోయాను. అందులో ఒకటి చిన్నగా స్టార్ట్ అయ్యి ముందుకు, చిన్నగా పరుగు మొదలు పెట్టింది. దానిని అలా చూస్తూ వుండగా మనసు గతంలోకి పరుగెత్తింది. అది 1972 వ సంవత్సరము. అప్పుడే పాకిస్తాన్ యుద్ధము ముగిసి శాంతి నెలకొంటున్న రోజులు. సరిహద్దులల్లో ఇంకా పూర్తి ఉద్రిక్తత తగ్గలేదు. ఆ సమయము లో మా ఏమండీగారికి సరిహద్దు ప్రదేశంలో ఒకటైన షిలిగురి నుండి వెళ్ళే ఆర్మీ కాంప్ కు పోస్టింగ్ వచ్చింది. యుద్ధం ముగిసినా ఉద్రిక్తత తగ్గలేదు కాబట్టి ఆంక్షలు ఇంకా పూర్తిగా సడలించ లేదు. దాన్ని ఇంకా పీస్ స్టేషన్ కా మార్చలేదు కాబట్టి కుటుంబాలను, దగ్గరలోనే వున్న డార్జ్ లింగ్ లో సెపరేటెడ్ ఫామిలీ క్వాటర్స్ లో వుండవచ్చు అన్నారు. కానీ అక్కడకూ ఆయన ఏ రెండు మూడు నెలలకో కాని రాలేరు. అప్పుడు చంటిపిల్లతో వక్కతీ అక్కడ ఎలా వుంటుంది వద్దు అని పెద్దవాళ్ళు, ఇక పోతే బి. యే పూర్తి చేయ వలసిన బృహత్కార్యం నా భుజ స్కందాలపైన వుండటం వల్లనూ, నేనూ మా అమ్మాయి హైదరాబాద్ లోనే వుండిపోయాము. ఆయన సంవత్సరానికి రెండు నెలలు సెలవల్లో వచ్చి వెళుతుండేవారు. ఇలా రెండు సంవత్సరాలు గడిచాయి. పోయిన సారి వచ్చివెళ్ళిన తరువాత, మా అమ్మాయి డాడీ అని ఏడ్చినప్పుడు ఏమండీగారి ఫొటో చూపించి ఏవో కథలూ కాకర కాయలు చెబితే వూరుకుంది కాని ఈ సారి చాలా బెంగ పెట్టుకుంది. ఏమి చేయాలో మాకు తోచటం లేదు. ఆయన వచ్చివెళ్ళి నాలుగు నెలలైనా బెంగ తగ్గ లేదు. పోనీ ఆయనతో మాట్లాడిద్దామంటే ఈరోజుల్లా ఫోన్ల కాలం కాదు. ఉత్తరాలే గతి. అవీ పోస్టల్ వాళ్ళ దయా, మా ప్రాప్తం అన్నట్లూ నిక్కి నీలిగీ తీరికగా వచ్చేవి! అప్పుడేమైందంటే.....

ఓ రోజు పొద్దున్నే కాలేజీకి వెళుదామని పుస్తకాలు తీసుకొని బయటకు వస్తున్నాను. నా వెనుక మా అత్తగారు ఏదో చెబుతూ వస్తున్నారు. ముందు వరండాలోకి వచ్చాము. అక్కడ మా మామగారు కూర్చొని పేపర్ చదువుకుంటున్నారు. ఇంతలో...

"టెలిగ్రాం" అంటూ వచ్చాడు... పోస్ట్ మాన్. ఒక్క వుదుటన మా మామగారు లేచి ఎక్కడి నుంచి బాబూ అని అడిగారు.

"కాప్టెన్. కుమార్ దగ్గర నుంచండి" అన్నాడు పోస్ట్ మాన్.

ఆ అని వణుకుతున్న చేతుల తో టెలిగ్రాం అందుకున్నారు మా మామగారు.

గోడను పట్టుకొని నేను, నా భుజం గట్టిగా పట్టుకొని మా అత్తగారు వణుకుతూ నిలబడ్డాము.

ఆ టెలిగ్రాం నన్ను చదవమన్నట్లుగా అమ్మాయ్ అంటూ నావైపు చాచారు మామయ్యగారు. నేను అప్పటికే ఫేంట్ అయ్యే ప్రోగ్రాం లో వున్నాను!

ఇక తప్పక ఆయనే విప్పి చదివారు. "మాలను,సంజును కలకత్తా లో రిసీవ్ చేసుకుంటాను" అని వుంది అందులో. ఇదేమిటి? ఏమి జరిగింది? మమ్మలిని కలకత్తా లో రిసీవ్ చేసుకోవటం ఏమిటి? అంతా అయోమయం లో పడ్డాము. కళ్ళ నీళ్ళ తో

అత్తయ్య గారు కుర్చీలో కూలబడ్డారు. మామయ్య గారు ఆ టెలిగ్రాం ను అటు తిప్పి ఇటు తిప్పీ అలోచనలో వున్నారు. నేను పుస్తకాలు పక్కన పడేసి, గోడ కు వంటి కాలి మీద ఆనుకొని నిలబడి గోళ్ళు కొరికేస్తున్నాను.

సంజు వచ్చి కాళ్ళకు చుట్టుకొని అమ్మా ఆకలి అంది. అప్పుడు గమనించాము పొద్దుటి నుంచీ అలాగే వున్నామని, భోజనాలు చేయాలని. "ఏ పాటు తప్పినా సాపాటు తప్పదు కానీయండి భోజనం చేద్దాం" అన్నారు మామయ్య గారు.

మమ్మల్ని ఇంకా అయోమయావస్తలో వుంచటం ఇష్టం లేక పోస్టల్ వాళ్ళు మధ్యాహ్నం పోస్ట్ లో వుత్తరం ఇచ్చేసారు పాపం. మళ్ళీ గుండె దడ మొదలు ఎందుకంటే అది మామూలు కవరు కాదు బ్రౌన్ కలర్ పొడవాటి కవర్ మామయ్య గారి పేరు మీద వుంది! చిన్నగా, జాగ్రత్తగా చించారు.

అందులో నుంచి పొడవుగా మడత పెట్టి వున్న రెండు అట్ట ముక్కలు వక ఉత్తరము బయటకు వచ్చాయి. సంజు చాలా మనాది పడ్డది కాబట్టి ఒక వారము రోజులు తన దగ్గరలో ఫామిలీ ని వుంచుకునేందుకు పర్మిషన్ తీసుకున్నానని, (కూతురే మనాది పడిందా నేను కాదా కొంచం కినుకగా అనుకున్నాను.) విజయవాడలో, కలకత్తా లో రైళ్ళు మారి నాలుగు రోజులు వక్కతే ప్రయాణం చేయటం కష్టం కాబట్టి విమానం టికెట్లు పంపుతున్నాననీ, ఫలానా రోజు అక్కడ వాళ్ళిద్దరినీ విమానం ఎక్కిస్తే, కలకత్తాకు నాలుగు గంటల్లో చేరుకుంటుంది, తనను రిసీవ్ చేసుకోవటానికి నాకు వచ్చేందుకు వీలు కాకపోతే, కలకత్తా ఏర్ పోర్ట్ కు వక సిపాయిని పంపిస్తాననీ, అతను యూనీఫారం లో వుంటాడు, మాల పేరు వున్న అట్టను పట్టుకొని వుంటాడు కాబట్టి అతనిని కనుక్కోవటం సులభం, అతను జాగ్రత్తగా ఇక్కడకు తీసుకు వస్తాడు అని ఆ వుత్తరం సారాంశం! సిపాయి కాకుండా తనే వచ్చి రిసీవ్ చేసుకుంటానని టెలిగ్రాం ఇచ్చారన్నమాట! ఐతే టెలిగ్రాం బులెట్ లా, ఉత్తరం తాపీ గా టెలిగ్రాం ముందు, ఉత్తరం వెనకలా ముందు వెనుకల వచ్చాయన్నమాట. మామయ్య గారి దగ్గర నుంచి ఉత్తరం తీసుకొని, గదిలోకి వెళ్ళి ఉత్తరం మళ్ళీ చదివాను. అంతా నేను ఎలా రావాలో, ఏమేమి తెచ్చుకోవాలో వ్రాసి ఉంది. సంజు గురించి వ్రాసారు కాని నా గురించి కాని, నాకు వేరే ఉత్తరం కాని ఏమీ లేదు! కొంచం నిరాశగా అనిపించి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఉత్తరంలో నుంచి చిలిపిగా నవ్వారు. ఊ అనుకొంటూ తల పక్కకు తిప్పుకున్నాను. నా గడ్డం పట్టుకొని, నా మొహం తన వైపు తిప్పుకుంటూ "అలిగావా?" అని అడిగారు.

"కాదా మరి నాకస్సలు ఉత్తరమే వ్రాయలేదు. అంతా మామయ్య గారికే వ్రాసారు. నేను మీ ఉత్తరం కోసం ఎంత ఎదురు చూస్తానో తెలుసు కదా?" అలుకగా అన్నాను.

"నిజమేననుకో కాని నిన్ను రమ్మని నీకు వ్రాస్తే బాగోదు కదా! నాన్నకు చెప్పాలిగా! అందుకని నాన్నకు రాసాను." అన్నారు.

"మీరన్నీ అంతే చేస్తారు. సెపరేటెడ్ ఫామిలీ క్వాటర్స్ లలో కూడా బాగుంటుందిట. లేడీస్ అందరూ కార్డ్స్ అనీ, క్లబ్ నీ ఎంజాయ్ చేస్తారుట. అంతా చక్కగా కలిసి మెలిసి వుంటారుట. పిల్లలకూ కంపెనీ వుంటుందిట. మిలిట్రీ కాంప్ కాబట్టి సెక్యూరిటీ బాగా ఉంటుందిట. మొన్న బజార్ లో మిసెస్. చెడ్డా కనిపించించి చెప్పింది. నువ్వెందుకు వెళ్ళలేదు అని అడిగింది. పైగా మీరూ అప్పుడప్పుడూ కనిపిస్తూ వుంటారు. ఇక్కడికైతే సంవత్సరం దాకా రారు. ఇంకా సంవత్సరం గడవాలి. అప్పుడు కాని పోస్టింగ్ రాదు. మీరేమో నువ్వు గ్రాడ్యుయేట్ కావాలి అని కాలేజ్ లో చేర్పించి వెళ్ళారు. ఇప్పుడు పది రోజులున్నా మళ్ళీ 8 నెలల దాకా కనిపించరు. ఇక నా వల్ల కాదు ఇలా వంటరిగా వుండటం" విచారంగా చెప్పాను.

"మరి నేను ఉండగలనా? మిమ్మలినందరినీ వదిలి ఈ అడవిలో ఉంటున్నాను. మొన్న రాజ్ చెప్పాడు, ఇంటికి వెళ్ళినప్పుడు “మమ్మీ ఎవరో అంకుల్ వచ్చాడు” అన్నాడుట కొడుకు. ఎంత బాధ! మిలిట్రీ వాళ్ళ జీవితాలు ఇంతే వుంటాయి. మరి అడ్జెస్ట్ కావాలి. రాత్రి పూట బీర్మగ్ తీసుకొని టెంట్ ముందు కూర్చుంటే, పైన చంద్రుడు వెన్నెలలు కురిపిస్తూ వుంటాడు. అడవిపూల సువాసనలు తేలి వస్తూ ఉంటాయి. వాతావరణం ఎంత ఆహ్లాదంగా ఉంటుందో తెలుసా! నీన్నెంత మిస్ అవుతానో! ఈ వెన్నెలంతా దండగై పోయింది కదా అనిపిస్తుంది" నవ్వారు ఏమండీగారు .

"అయ్యగారికి కవిత్వం కూడా వస్తోంది" నవ్వాను నేను.
"కమలా" మామయ్య గారి పిలుపు వినిపించింది. ఉలిక్కి పడ్డాను. ఓ ఇదంతా కలా నిరాశగా అనుకున్నాను. చేతిలోని ఉత్తరమూ, టికెట్లూ మసక మసకగా కనిపించాయి. కళ్ళు తుడుచుకున్నాను. "నీవు వచ్చేవని నీ పిలుపే విని కన్నుల నీరిడి కలయ చూసితిని." అనుకుంటూ లేచి బాత్రూంలోకి వెళ్ళి మొహమూ కళ్ళూ కడుక్కొని బయటకు వెళ్ళాను.
గాభరా ఏమీ లేదని తెలిసాక మళ్ళీ చర్చ మొదలైంది. అప్పటికే ఐదవ నెల కనుక సీమంతానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాము, ఇప్పుడు పంపిస్తే ఎలాగా? మళ్ళీ అది తిరిగి వచ్చే సరికి ఆరో నెల వచ్చేస్తుంది. మన ఆనవాయితీ ఐదో నెల చేయటమే. రాట్ ఇప్పుడు పంపేందుకు వీలు లేదు వాడి కి ఉత్తరం వ్రాసేయండి అన్నారు అత్తయ్య గారు. ఎట్లాగా వాడు టికెట్ పంపాక పంపమని ఎలా చెబుతాము? మీ తల్లీ కొడుకులతో చస్తున్నాను మామయ్యగారి ధుమధుమలు! గోడకానుకొని, అడుగూ బొడుగూమిగిలిన  గోళ్ళు కొరుకుతూ నేను. కాకపోతే ఈ సారి సీను బయట వరండాలో కాకుండా లోపలి హాల్ లో! సరే తర్జన భర్జన లు, శిఖరాగ్ర సమావేశాల అనంతరం నన్ను పంపేందుకూ, సీమంతం తొమ్మిదో నెలలో చేసేందుకూ నిర్ణయాలు జరిగి పోయాయి.
ఆకాశం లో కనిపించే విమానం ఎక్కుతున్నానంటే చెప్పలేనంత ఎక్సైట్ మెంట్! ఎంచక్కా కిటికీ లో నుంచి మబ్బులు పట్టుకోవచ్చేమో! మబ్బులు ఎలా వుంటాయి? మబ్బుల్లో తేలి పోయాను. మా అమ్మాయిని బయటకు తీసుకెళ్ళి చుక్కలా దూరంగా కనిపిస్తున్న విమానం చూపించి మనం అందులో డాడీ దగ్గరకు వెళుతున్నాము అని చెప్పాను. మా అమ్మాయి ఎగిరి గంతేసింది. మల్లీశ్వరి లోని మబ్బుల పాటలు గుర్తొచ్చాయి. నేను కాలేజి లో ఫ్రెండ్స్ తో, మా అమ్మాయి ఇంటికొచ్చిన వాళ్ళందరితో మా విమాన ప్రయాణం గురించి డప్పు కొట్టేసాము.
ఎదురు చూస్తున్న శుభ గడియ వచ్చేసింది. సూట్ కేస్ బయటకు తెస్తుంటే మా ఏమండి  నాకు ఇవి తేకు అవి తేకు, భోజనం కూడా విమానలో పెడుతారు అంటూ వ్రాసిన బోలెడు జాగ్రత్తలు గుర్తొచ్చాయి. ఆయన పిచ్చి కాకపోతే నేనేమన్నా పార్వతీశాన్నా నల్ల ట్రంక్ పెట్టె, మర చెంబు, గొడుగు గట్రా పట్టుకు పోవటానికి! ఎలా తయారవ్వాలి అన్న మీమాంస లో పడ్డాను. సంజుకైతే ఏమండి తెచ్చిన గళ్ళ పినోఫాం వేసాను కాని నాకే ఓ పట్టాన తోచటం లేదు. చక్కగా చీర టైట్ గా కట్టు కొని, పెద్ద నల్ల కళ్ళద్దాలు పెట్టుకొని, తలకు స్కార్ఫ్ కట్టుకొని విమానం మెట్లెక్కి, తలుపు దగ్గర నిలబడి చేయి అలవోకగా వూపే హీరోయిన్లు గుర్తొచ్చారు. నేనూ అలా తయారవుదామని సరదా పడ్డాను కాని అమ్మో ఇంకేమైనా వుందా?  గంజి పెట్టిన వెంకట గిరి చీరో, బెంగాల్ కాటనో కట్టుకుంటే మరీ ముసలమ్మలా కనిపిస్తానేమొ!  చీరలన్నీ అటుతిప్పీ ఇటు తిప్పీ సీమంతానికి మా అమ్మ తెచ్చిన లేత పసుపు రంగు జార్జెట్ చీర తీసాను. జాకెట్ కుట్టించుకోమని అమ్మ ఇచ్చి పోయింది. ఎలాగూ సీమంతం ఇంకా నాలుగు నెలలు వుంది కదా ఇంకోటి కొనుక్కోవచ్చులే అనుకొని అదే కట్టేసాను. మమ్మలిని విమానం ఎక్కించటానికి మామయ్యగారు, పనివాడు వచ్చారు.
విమానం దగ్గరకు వెళ్ళాము.....
మెట్లెక్కాము...
లోపలి కివెళుతూ తలుపు దగ్గర నిలబడి తిరిగి చూసాను. లాంజ్ చాలా దూరంగా వుంది. మామయ్య గారు ఎక్కడున్నారో తెలీలేదు. వాళ్ళు నాకు కనిపించనట్లే నేనూ వాళ్ళకు కనిపించను కదా స్టైల్ గా చేయి ఊపుదామా అని ఓ క్షణం అనుకున్నాను. అమ్మో నా పక్కన బుజ్జిపిల్ల వుంది కదా వాళ్ళు కనిపెట్టేస్తారేమో! తిరిగి వచ్చేటప్పుడు ఆయన వుంటారు గా ఆయనకు చేయి ఊపొచ్చులే అని సరి పెట్టుకొని లోపలకు వెళ్ళాను.
తలుపు దగ్గర ఏర్ హోస్టెస్ నాజూకుగా నమస్కార్ చేసి లోపలకు ఆహ్వానించింది.  ఇంకో ఏర్ హోస్టెస్ మమ్మలిని తీసుకెళ్ళి మా సీట్ దగ్గర కూర్చోపెట్టింది.  మా వెనుక ఇద్దరు నన్స్ కూర్చొని వున్నారు.  వాళ్ళు సంజును పలకరించారు. వాళ్ళు పిలిచి

మాట్లాడించారు. ఎవరైనా మాట్లాడాలే కాని దానికేమీ కొత్తా పాతా లేదు అందరి తో మాట్లాడేస్తుంది. వాళ్ళతో కబుర్లు మొదలు పెట్టింది. ఇంతలో విమానం తలుపు మూసేసారు. ఏర్ హోస్టెస్ వచ్చి సంజును ఎత్తుకొచ్చి నా పక్కన కూర్చో బెట్టి, ఇద్దరికీ బెల్టులు కట్టి వెళ్ళింది. నేను చుట్టూ కలియ చూసాను. నేనూ, ఇద్దరు నన్స్ తప్ప ఆడవాళ్ళెవరూ లేరు అంతా మొగవాళ్ళే! వాళ్ళైన అక్కడక్కడ వున్నారు. ఏర్ హోస్టెస్ ఓ ట్రే లో చాక్లెట్ లు, దూది వుండలు తెచ్చి అందరికీ ఇస్తోంది. సంజు రెండు గుప్పిళ్ళ నిండా చాక్లెట్స్ తీసుకొని తన జేబుల్లో పోసుకుంది. అయ్యో బంగారు అన్ని తీసుకోకూడదు అని నేను గాభరా పడి పోయాను. పరవా లేదు అని ఆమె నవ్వుకుంటూ వెళ్ళి పోయింది. మా ఏమండీగారి ఇన్స్ ట్రక్షన్స్ ప్రకారం దూది నేను రెండు చెవుల్లో పెట్టుకొని సంజుకూ పెట్టాను.

విమానం చిన్నగా కదలటం మొదలైంది. కాస్త పరుగెత్తి ఒక్క జర్క్ తో పైకి లేచింది! గుండె గుభేల్ మంది! సంజు ఒక్కసారే ఉలిక్కి పడి కెవ్ మంది. బెల్ట్ చేత్తో తీసేసేందుకు ప్రయత్నం చేస్తూ గింజుకుంటోంది! నేను దాని చేయి పట్టుకొని ఊరడిస్తున్నాను. విమానం స్టడీ అయ్యాక ఏర్ హోస్టెస్ వచ్చి మా ఇద్దరి బెల్ట్ లూ విప్పేసింది. సంజు ఒక్క ఉదుటన నా వళ్ళోకి దూకి నా మెడ చుట్టూ చేతులు వేసి ఏడవటం మొదలు పెట్టింది. ఎంత ఊరడించినా ఊరుకోదు. నాకేమో ఉక్కిరి బిక్కిరి ఐపోతోంది. ఏర్ హోస్టెస్ వచ్చి ఎత్తుకో బోయింది. ఆమె చేతులు నెట్టేసింది. వెనుక వున్న నన్స్ పిలిచారు ఉమ్... హూ.... వెళ్ళదు. నా వడిలో నుంచి లేవదు. ఒకటే ఏడుపు! ఏర్ హోస్టెస్ ను అడుగుతే పాపం నా హాండ్ బాగ్ లో నుంచి దాని పాల సీసా తీసి ఇచ్చింది. అది నోట్లో పెడితే ఒక్క తోపు తోసేసింది. అలా గంట పైనే అనుకుంటా ప్రయాణం చేసి ఓ ఊరు చేరు కున్నాము. అది ఏ వూరో గుర్తులేదు. అక్కడ ఎక్కువ సేపు ఆగ లేదు.

మళ్ళీ ప్రయాణం మొదలు! ఇంకాసేపు గడిచాక భువనేశ్వర్ చేరుకున్నాము. అక్కడ కొద్ది సేపు ఆగుతుంది అని, కిందికి దిగి కాసేపు నడుస్తే ఫ్రెష్ గాలి కి ఏడవటం వూరుకుంటుదేమో అని ఏర్ హోస్టెస్ చెప్పింది. చిన్నగా దాని ని ఎత్తుకొని దిగాను. నేల మీదకు దిగగానే నా మీది నుంచి ఒక్క దూకు దూకి రయ్ న ముందుకు పరిగెత్తింది!

అదృష్టవసాత్తు ఎదురుగా వస్తున్న ఏర్ పోర్ట్ ఉద్యోగి దానిని పట్టుకొని నాకు ఇచ్చాడు. విమానం వద్దు అని ఒకటే ఏడుపు! మరి డాడీ దగ్గరకు వెళ్ళొద్దా అంటే డాడీ కావాలి, విమానం వద్దు అంటుంది.

ఓ నన్ నా దగ్గరకు వచ్చి నా దగ్గర స్లీపింగ్ టాబ్లెట్ వుంది. ఓ హాఫ్ వేయి పడుకుంటుంది అంది.

అమ్మో స్లీపింగ్ టాబ్లెట్ నా. నాకు స్లీపింగ్ టాబ్లెట్ అంటే చాలా భయం. వద్దండి థాంక్ యు అని చెప్పాను.

విమానం ఎక్కనంటుంది. భువనేశ్వర్ లో ఎలా దిగను? ఏమి చేయను? అంతా అయోమయం. ఏర్ హోస్టెస్ సహాయంతో కష్టం మీద విమానం ఎక్కాను. ఏర్ హోస్టెస్ చాక్లెట్స్ తెచ్చింది. ఏమనుకుందో ఏమో కాని మా అమ్మాయి తన దగ్గర వున్న చాక్లెట్స్ కూడా తీసి ఆ ట్రే లో వేసేసింది. ఏడుపు తగ్గలేదు. నా వడిలో నుంచి దిగదు. ఏడ్చీ ఏడ్చీ తోటకూర కాడ లా వడిలి పోయింది. కళ్ళూ ఎర్రబారి, కళ్ళూ మొహమూ వాచిపోయాయి. ఇంక ఏడ్చే ఓపిక లేదేమో వెక్కిళ్ళు పెడుతోంది. నాకూ ఓపిక ఐపోయింది. ఏర్ హోస్టెస్ అటు వచ్చినప్పుడల్లా ఇంకెంతసేపు అని అడగటమే! పొద్దున్నా ప్రయాణం సరదాలో మా అత్తగారు వట్టి పిల్లవు కూడా కాదు, వాళ్ళు పెడితే ఏం పెడుతారో తినిపో అంటే కష్టం మీద సగం చపాతి తిన్నాను. ఇక్కడ వాళ్ళు పెట్టినవి తను తినలేదు నన్ను తిననీయలేదు నా కూతురు. నీరసం వస్తోంది. కళ్ళు తేలి పోతున్నాయి. అమ్మయ్య ఎట్టకేలకు కలకత్తా చేరుకున్నాము. లేచి నిలబడ లేను. కాళ్ళూ, నడుమూ పట్టేసాయి. పిల్ల చంక దిగదు. చాలా అంటే చాలా కష్టం మీద ఏర్ హోస్టెస్ సహాయము తో దిగి బస్ ఎక్కాను.

అమ్మయ్య అదిగో అక్కడ ఏమండీగారు కనిపిస్తున్నారు. అప్పటి వరకూ గొంతులో సుళ్ళు తిరుగుతున్న ఏడుపు బయటకు వచ్చేస్తోంది. ఆయన దగ్గరకు ఎలా వెళ్ళామో తెలీదు! డాడీ

అంటూ మా అమ్మాయి, ఏమండీ అంటూ నేను ఇద్దరమూ ఆయనను వాటేసుకొని భోర్ మన్నాము!

మబ్బుల పల్లకీ లో నా మొదటి ప్రయాణం అలా బీభత్సం గా మొదలై భీభత్సంగా ముగిసింది!

విమానం ఎక్కిన ప్రతి సారి అది గుర్తొస్తుంది. మేమిద్దరమూ మీద పడి భోర్ మనగానే ఏమండీగారు పడ్డ కంగారు గుర్తొస్తే నవ్వొస్తుంది. చిన్నగా నవ్వుతున్న నన్ను చూసి ” ఏమిటీ నీ మొదటి ప్రయాణం గుర్తొచ్చిందా?" అని అడిగారు ఏమండీగారు.

"ఊ! అప్పుడంత గోల గోల చేసిందా, ఇప్పుడేమో పెద్ద డైరక్టరై నెలకు పది రోజులు మబ్బుల పల్లకీ లోనే ఊరేగుతూ వుంటుంది మీ కూతురు.” అన్నాను నవ్వుతూ.

"మరి నా బంగారు తల్లి కదా?" మురిపెంగా అన్నారు ఏమండీగారు.

❖❖❖❖❖



❖❖❖❖❖




# సంగీత నాదామృతం __ పదం 2

డా. పద్మ మల్లెల, సిడ్నీ



గత సంచికలో పదం గురించిన విశ్లేషణ కొనసాగించే ముందు మనకి అనాదిగా తెలిసిన ఒక శ్లోకం చూద్దాం.

"సంగీతమపి సాహిత్యం సరస్వతీ స్తన ద్వయం
ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం"

అంటే సంగీత సాహిత్యాలు రెండు సరస్వతీ అమ్మవారి స్తనద్వయం లో ఏది ముందు ఏది వెనుక అనే ప్రశ్న ఉదయించక మానదు. కనుక ఇప్పుడు సంగీతం యొక్క ఆరంభం గురించి ఆలోచిస్తే మొదటగుర్తించాల్సింది దాని యొక్కఆవిర్భావం సామవేదంలో ఉంది. మనందరికీ తెలిసిన అతి ముఖ్య మైన 4 వేదాలు ఋక్, యజుర్, సామ మరియు అధర్వణ వేదాలలో సామ వేదం గానం చేయబడుతుందని మిగతా మూడు వేదాలు పారాయణ చేయబడతాయని చెప్పారు. ఈ మూడు వేదాలు ఉదాత్త, అనుదాత్త మరియు స్వరిత అనే 3 స్వరాలమీద ఆధార పడి పారాయణ చేయబడతాయి కానీ సామవేదం యొక్క మూలం ఋగ్వేదం.అనగా ఋగ్వేదంలోని కొన్ని మంత్రాలు పారాయణ కాకుండా సామవేదంలోని మంత్రాలుగా గానం చేయబడుతాయి. ఈ సామవేదానికి సంబంధించిన ఋగ్వేద మంత్రాలను సామవేద సాంఖ్యమంటారు. దీనిలో తిరిగి ఆర్చిక మరియు గాన అని రెండు భాగాలుంటాయి. తిరిగి ఈ ఆర్చిక పూర్వార్చిక మరియు ఉత్తరార్చిక అని భాగాలుంటాయి.పూర్వార్చికలో 585 ఋక్కులు ఉన్నాయి.ఇవి సామ గానం లోని పాటలకు సాహిత్యాన్ని కలిగి ఉన్నాయి. ఉత్తరార్చికలోయజ్ఞ యాగాదులకు సంబందించిన ఋక్కులు ఒక క్రమంలో వివరింపబడి ఉన్నాయి. వీటిని సూక్తాలుగా వ్యవహరిస్తారు. ఇక ఈ సామ గానం ప్రకారం గానం4 విధాలు:

1) గ్రామగేయ గానం
2) ఆరణ్యగానం
3) ఊహ్ గానం
4) ఊహ్య లేక రహస్యగానం

ఇందు లో ముందు రెండు పూర్వార్చికకు సంబంధించినవి. దీన్నే ప్రకృతి గానం అనికూడ పేర్కొంటారు. ఇక ఇందులో ఋక్కులు పాడేటప్పుడు సాహిత్యంలో ఫణితికి తగ్గట్టుగా చిన్న మార్పులు చేస్తారు. ఇక ఈ మార్పులు చేయటానిక కూడా కొన్ని నియమాలు నిర్దేశింప బడ్డాయి. ఆ నియమావళి ఈ క్రింది విధంగా ఉంది.

1)వికారము , 2) విశ్లేషణము, 3) వికర్షణ, 4)అభ్యాసము, 5) విరామము 6) స్తోభ మొదలయినవి.

ఇక స్వరాల విషయానికి వస్తే సామ గానంలో 7 స్వరాలుంటాయి.అవి కృష్ట, ప్రధమ, ద్వతీయ, తృతీయ,చతుర్ధ, మంద్ర మరియు అతిస్వార్య. ఇవన్నీ అవరోహణ క్రమం లో ఉంటాయి. కృష్ట ఆవర్తనం మొదలు చివర కూడా ఉంటుంది. ప్రధమ, ద్వితీయ మొదలయినవి మంద్రం లో అవరోహణలో ఉంటాయి. సామ గానంగురించిన వివరాలు మనకి వేదాంగాలలో ఒకటయిన శిక్ష లలో లభిస్తాయి. అటువంటి శిక్షలలో ఒకటయిన 'నారదీయ శిక్ష' లో సామగానంలోని స్వరాలకు గాంధర్వం అంటే ప్రస్తుత సంగీతానికి ఆలంబనయిన సంగీతానికి సామ్యం ఈ క్రింది విధంగా ఉంది.

| సామగానంలోని స్వరాలు. | గాంధర్వంలోని స్వరాలు. |
|---|---|
| 1) ప్రధమ. | మధ్యమం |
| 2) ద్వితీయ. | గాంధారం |
| 3) తృతీయ. | రిషభము |
| 4) చతుర్ధ. | షడ్జం |
| 5) మంద్రం. | దైవతం |
| 6) అతిస్వార్య. | నిషాదం |
| 7) కృష్ట. | పంచమం |

సామ గానంలోని స్వరాలను 'గాత్రవీణ' లో అంటే కుడి చేతి బొటన వేలును చూపుడు వేలు మొదలయిన వేళ్ళ మీద చూపిస్తారు. ఉదాహరణకి చూపుడు వేలుతో బొటనవేలు ఊర్ధ్వం చూపితే అది కృష్ట అనే స్వరాన్ని సూచిస్తుంది. అలాగే బొటన వేలుతో చూపుడువేలు ఊర్ధ్వం చూపితే అది ప్రధమ అవుతుంది.ద్వితీయ స్వరం బొటనవేలులో చూపుడు వేలు నడిమి కణుపు ద్వారా సూచించ పడుతుంది.అదే బొటన వేలుతో మధ్య వేలును చూపితే తృతీయస్వరం, బొటన వేలుతో అనామికను చూపితే చతుర్ధం, చిటికెన వేలు పై కణుపును చూపిన మంద్ర స్వరం క్రింది కణుపును చూపితే అతి స్వార్యను సూచిస్తాయి. ఇంకా దీని గురించిన వివరాలు వచ్చే సంచికలో తెలుసు కుందాం.

ఇక ఈ జూలై మాసం 6 తేదీ న జగద్విఖ్యాత విద్వాంసులు పద్మ విభూషణ్ చెవాలియర్ స్వర్గీయ డా. మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారి 91 వ జన్మ దిన సందర్భంగా మనం ప్రతిసారి చర్చించుకునే కీర్తన పరంపరలో బాలమురళీ గారి రచనలను చర్చించుకుందాం. ఈయన రమారమి 400 రచనలు చేశారు. వీటిలో గీతాలనుంచి పదాలు మరియూ తిల్లానాల వరకూ ఉన్నాయి. కొన్ని లలిత గీతాలు కూడా ఉన్నాయి. మనం ప్రస్తుతం సంగీతం లోపదం అనే రచన గురించి చర్చించుకుంటున్నాం కనుక ఆయన రచించిన 'బంగారు మురళి' అనే పదం గురించి తెలుసుకుందాం. ప్రాధమికంగా పదం అనేది ఒక శృంగార రచన. అయితే కృష్ణుడి యొక్క లీలను బాలమురళిగారు ఎంత హుందాగా అందంగా అమర్చారో ఈ పదం పరిశీలిస్తే అవగతమవుతుంది. ఈ పదం చక్కని నీలాంబరి రాగంలో ఖండచాపు తాళం లో కూర్చ బడింది. ముందుగా ఈ పదం యొక్క సాహిత్యాన్ని చూద్దాం.

పల్లవి:

బంగారు మురళి శృంగార రవళి డెందములు మరచి కన్విందారగించేము

వచ్చేరా మురిప మిచ్చేరా

అను పల్లవి:

అంగనలు పొంగారు జవ్వనము చూపేరు

ముంగురులు నిమిరిరి అనంగ మోహముతో ॥ వచ్చేరా॥

చరణం:

నింగి రంగుల రేడు ఖంగుమువ్వల జోడు

ఛంగు నడకల నాడు మంగళాంగుల వాడు ॥ డెందములు ॥

ఈ రచనను పరిశీలిస్తే ఆసాంతం 'గ' కార ప్రాస చాలా రమ్యంగా ఉంటుంది. ఇక అర్ధం పరంగా చూస్తే బాల కృష్ణుడిని చూసి పరవశించిన గోప కాంతల హృదయానందం మనను పులకరింప చేస్తుంది. ఇక నీలాంబరి రాగానికి మన దైనందిన జీవితం లోని ఒడిదుడుకులను మరచి ప్రస్తుతం hot topic అయిన mental stress నుండి ఊరట కలిగించి మనిషికి నిద్రను ఆవహింప చేసే లక్షణం కలిగిన రాగం. ఈ రచనను అందరూ ఆస్వాదిస్తారని ఆశిస్తూ ఇప్పటికి సెలవు.

ఈ కీర్తన శ్రీ మంగళంపల్లి బాలమురళి కృష్ణ గారి గళంలో క్రింద లింకు ద్వారా విని ఆనందించండి.


https://www.youtube.com/watch?v=bnwWSDuyDXg

❖❖❖❖❖



# వంశీ కొత్త కథలు-4 పుస్తక ఆవిష్కరణ






కరోనా మహమ్మారిని జయించే దిశగా ప్రతి ఒక్కరూ పంచ సూత్ర ప్రణాళికను అనుసరించాలని ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఈ ప్రణాళికతో భవిష్యత్తులో ఎదురయ్యే మహమ్మారులను సైతం సమర్థవంతంగా ఎదుర్కొనగలమని ఆయన పేర్కొన్నారు. కరోనాపై వస్తున్న అపోహలు, పుకార్లను విశ్వసించడం ద్వారా ఆందోళనే తప్ప సమస్యకు పరిష్కారం దొరకదన్నారు.

కరోనా నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలు, వివిధ నేపథ్యాలకు చెందిన ౮౦ మంది రచయితల కథలను వంశీ ఆర్ట్స్ థియేటర్ రూపొందించిన 'కొత్త (కరోనా) కథలు' పుస్తకాన్ని శనివారం హైదరాబాద్‌లో ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కరోనాను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన పంచసూత్రాలను ఉపరాష్ట్రపతి ప్రతిపాదించారు. మొదటగా.. కోవిడ్ ఎదుర్కొనే దిశలో శారీరక శ్రమ, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం అవసరం అన్న ఆయన... చైతన్యరహిత జీవన విధానం కారణంగా కొత్త సమస్యలు పెరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో

- వ్యాయామం, నడక, యోగ లాంటి వాటికి రోజూ కొంత సమయం కేటాయించాలని సూచించారు.
- రెండో అంశంగా.. మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి, మానసిక సంతులనానికి ఆధ్యాత్మిక చింతన అలవరుచుకోవాల్సిన అవసరాన్ని ఉపరాష్ట్రపతి సూచించారు. ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు.
- మూడో అంశంగా.. అత్యంత కీలకమైన అంశంగా భారతీయ ఆహారపు అలవాట్లను ఆయన ప్రస్తావించారు. మన దేశంలోని వాతావరణ మార్పులకు అనుగుణంగా మన పెద్దలు ఆహారాన్ని సూచిస్తూ వచ్చారని.. వ్యర్థమైన జంక్‌ఫుడ్ మీద గాక సంతులన, పోషకాహారం మీద ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఉపరాష్ట్రపతి సూచించారు.
- వ్యక్తిగత పరిశుభ్రత, జాగ్రత్తలు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా సురక్షిత దూరాన్ని పాటించడం, మాస్క్ లను ధరించడం, తరచూ చేతులను శుభ్రపరచుకోవడం వంటి వాటిని నాలుగో అంశంగా ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. టీకా వేయించుకోవడం తప్పనిసరి అని, ఆ తర్వాత కూడా మాస్క్ ధరించడంతోపాటు సురక్షిత దూరాన్ని పాటిస్తూనే ఉండాలన్నారు.

ఐదో అంశంగా ప్రకృతిని ప్రేమించడం ప్రకృతితో మమేకమై జీవించడంగా ఉపరాష్ట్రపతి ప్రస్తావించారు. ఏసీ గదుల్లో కాకుండా.. వీలైనంత ఎక్కువగా గాలి, వెలుతురు ధారాళంగా ఉండే ప్రదేశాల్లో ఉండడానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ ఐదు అంశాలను పాటిస్తూనే భయాన్ని వీడి ప్రతి ఒక్కరూ ఇతరులకు సాయం చేసే దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించిన ఆయన, జాగ్రత్త పడడమే తప్ప, పుకార్లు, భయాలతో ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు.

కరోనా కొత్తకథల్లో భాగస్వాములైన రచయితలందరినీ ఉపరాష్ట్రపతి అభినందించారు. కొత్త అనుభవాలనుంచి పుట్టిన కథలు ఆసక్తికరంగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఈ పుస్తకాన్ని గానగంధర్వుడు శ్రీ శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రమణ్యంకు అంకితమివ్వడాన్ని, ముఖచిత్రంగా ఎస్పీబీ చిత్రాన్ని ప్రచురించడం పట్ల ఉపరాష్ట్రపతి.. పుస్తక ప్రచురణకర్తలను ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీ బాలసుబ్రమణ్యం జీవితం తెలుగు సినిమా సంగీత చరిత్రలో ఓ మైలురాయిగా నిలిచిపోతుందన్న ఆయన, తెలుగు సంగీతానికి ఘంటసాల, బాలు ద్వయం స్వర్ణయుగం తీసుకొచ్చారని గుర్తుచేశారు. వీరిద్దరూ తెలుగు పాటకు పట్టాభిషేకం చేసి, ప్రేక్షక హృదయ సింహాసనంపై కూర్చోబెట్టారన్నారు. ఐదున్నర దశాబ్దాలపాటు తన గానామృతంతో సంగీతాభిమానులను అలరించిన బాలసుబ్రమణ్యం కరోనా కారణంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళడం అత్యంత విచారకరమన్న ఉపరాష్ట్రపతి ఈ వేదిక ద్వారా మరోసారి బాలు స్మృతికి నివాళులు అర్పించారు.

జీవితంలోని ఒకానొక మహత్తర సత్యాన్ని అద్భుత శిల్పనైపుణ్యంతో కళ్ళకు కట్టినట్లు చూపించి, హృదయాన్ని ఒక మహత్తరమైన అనుభూతితో నింపి, పదే పదే చదవాలనిపింపజేసేది గొప్ప కథ అన్న శ్రీ పోరంకి దక్షిణామూర్తి గారి మాటలను ఈ సందర్భంగా గుర్తుచేసిన ఉపరాష్ట్రపతి, ఎన్నో మంచి కథలను తెలుగు వారికి మరింత చేరువ చేసేందుకు ప్రయత్నం చేసిన శ్రీ కాళీపట్నం రామారావు గారిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ పూర్వ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, అమెరికాకు చెందిన గుండె వైద్య నిపుణులు, శ్రీ ఆళ్ళ శ్రీనివాసరెడ్డి, వంశీ ఆర్ట్స్ థియేటర్ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ వంశీ రామరాజు, ప్రముఖ రచయితలు శ్రీ అంపశయ్య నవీన్, శ్రీ భువనచంద్ర, అమెరికా నుండి వంగూరి ఫౌండేషన్ అధినేత డాక్టర్ చిట్టెన్ రాజు వంగూరి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మోహన్ కిషోర్ బాబు కేశాని, మరియు గానకోకిల శ్రీమతి శారద ఆకునూరి , సింగపూర్ నుండి "శ్రీ సాంస్కృతిక కళాసారథి వ్యవస్థాపక అధ్యక్షులు" శ్రీ రత్న కుమార్ కవుటూరు మరియు శ్రీమతి రాధికా మంగిపూడి, సిడ్నీ నుండి శ్రీమతి విజయ గొల్లపూడి, లండన్ నుండి శ్రీమతి నవతా తిరునగరి, ఒమన్ నుంచి డాక్టర్ రామలక్ష్మి తాడేపల్లి, కెనడా నుండి శ్రీమతి సరోజ కొమరవోలు, చెన్నై నుండి ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సీఎంకే రెడ్డి, హైదరాబాద్ నుండి జేవీ పబ్లికేషన్ శ్రీమతి జ్యోతి వాల్లభోజు మరియు ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన రచయితలు అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్నారు.... సింగపూర్ నుండి రాధాకృష్ణ గణేశ్న సాంకేతిక సహకారం అందించారు.

❖❖❖❖❖



# కలికాలంలో కరోనా 'కల'వరం

**శ్రీమతి విజయ గొల్లపూడి, సిడ్నీ**

కాలం ఏదైతేనేం ఒక్కో యుగ ధర్మాన్నిబట్టి ఒక్కో జాడ్యం మానవాళిని పట్టి పీడిస్తోంది. ఆ జాడ్యాలు కొన్ని ప్రకృతి సంబంధమైనవి అంటే సునామి, భూకంపాలు, వరదలు, తుఫాను లాంటివి అన్నమాట అదే అనిచ్ఛా ప్రారబ్ధం. మరికొన్ని మానవుడు తనకు తానుగా సృష్టించుకున్నవి. వీటినే స్వేచ్ఛా ప్రారబ్ధం, పరేఛ్ఛా ప్రారబ్ధం, అంటే వాటిలో కూడా కొన్ని స్వయంకృతాపరాధాలు ఐతే, ఇంకా కొన్ని మానవ మేధాసంపత్తితో విపత్తులు సృష్టించి దేశదేశాల మధ్య కల్లోలాలు సృష్టించి పబ్బం గడుపుకోవటం అన్నమాట. అంటే దీనివల్ల ఒరిగేదేమిటి అంటే అదే మనిషిలోని వికృత కోణం. తను సుఖంగా ఉండి అవతల మనిషి మరో దేశంలో అవస్థ పడుతుంటే చంకలు గుద్దుకోవటం, ఆధిపత్యం కోసం పోరు. కృత,త్రేతా, ద్వాపర యుగాలనుంచి ఈ కలియుగం వరకు రాక్షసులు, దెయ్యాలు, భూతాలు అని వివిధ పేర్లతో పిలువబడుతూ ఎంతో కొంత విఘాతం సృష్టించి ప్రాణ నష్టం కలిగిస్తున్నారు. సరే ఇప్పుడు వర్తమానంలోకి వస్తే ఈ కరోనా భగవంతుడు సృష్టించిన జీవియా లేక అక్కసుతో ఒక మతి చెడిన వ్యక్తి ఏదో ప్రయోగాలు చేసి ప్రపంచం మీదకి వదలిపెట్టాడా? గతంలో ఒక దేశం మరొక దేశాన్ని దెబ్బ తీయాలంటే బాంబులు, తుపాకీలు అణుసామాగ్రి ఇవన్నీ సమకూర్చుకునేది. అవేమీ అక్కరలేకుండా ఇపుడు అగ్ర రాజ్యాలనుండి, చిరు దేశాల వరకు కంటికి కనపడని చిరు సూక్ష్మజీవి లక్షలు దాటి కోట్ల ప్రాణాలు బలి తీసుకుంటోంది. మొత్తం ప్రపంచంలో తీరు తెన్నులు, జీవన విధానమే మారిపోయింది. కరోనా ప్రపంచాన్నే ఒక ఊపు ఊపేస్తోంది. ప్రతి దేశంలో కరోనా కర్ఫ్యూ నే పాటించారు కొన్నాళ్ళు సిన్సియర్ గా. మాళవిక మనస్సులో స్వగతం ఇంకా కొనసాగుతోంది.

************

ప్రపంచం మొత్తం క్రొత్త సంవత్సర వేడుకలు ఆనందంగా, అత్యంత విలాసవంతం గా జరుపుకుంటూ 2020 కి స్వాగతం పలికారు. కొత్త సంవత్సరం అనగానే ఈ విచ్చలవిడితనం ఇంకా విజృంభిస్తుంది. చూడటానికి జుగుప్సా కలిగించే చేష్టలు వెర్రెక్కిన యువతరం చేస్తుంటే మొదటిసారి భర్తతో పిల్లలను ఫైర్ వర్క్స్ కి తీసుకు వెళ్ళిన మాళవికకు నిరాశ కలిగింది. ఎపుడూ పైకి కనిపించే అందాలని దూరంగా ఉండి టెలివిజన్ లో వీక్షిస్తే బాగుంటుంది కదా అనిపించింది ఆమెకు.

రేడియో లో కరోనా వైరస్ చైనాలో సోకింది, విజృంభిస్తోందని వార్తలు వస్తున్నాయి.

"రమేష్! అంతకు ముందు చికెన్ గునియా, ఎబోలా వైరస్ అని పేర్లు విన్నాం. మళ్ళీ కొత్తగా ఈ కరోనా వైరస్ ఏమిటీ?"

"మాళవిక నువ్వు వార్తలు చూడటం మానెయ్. ఎక్కడో చైనా లో సోకితే నువ్వు ఎందుకు వర్రీ అవుతావు.

మనం ఇక్కడ సురక్షితమైన దేశంలో ఉన్నాము. ఎక్కువగా ఆలోచించకు."

"ఏంటి, రమేష్ మామూలుగా మాట్లాడినా వర్రీ అని టాగ్ చేస్తావ్?"

"ఏమిటో ఈ సారి న్యూ ఇయర్ రోజు కాస్త చప్పగా ఉంది. హాయిగా ఇంటి పట్టున ఉంటే ఉదయాన్నే కాస్త దైవ ధ్యానంతో రోజు మొదలై ఉండేది" మనస్సులో అనుకుని వేరే పనికి ఉపక్రమించింది మాళవిక.

చూస్తూ ఉండగానే పెట్టుకున్న శెలవులు పిల్లలకి, తనకు, భర్తకి ఐపోయాయి. ఈసారి బయటకు వాళ్ళు వెళ్ళకుండా డే ట్రిప్ లు, స్నేహితులతో పార్టీలతో సెల్లాళ్ళు సరదాగా గడిచిపోయాయి.

ఫిబ్రవరి లో మళ్ళీ వార్తలు చూసినపుడల్లా కరోనా కు మరో పేరు కోవిడ్-19 ఇతర దేశాలకు ప్రాకుతోందని వింటోంది.

కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని విని వణికి పోయింది.

"భగవంతుడా! అందరూ బాగుండాలి. భూతల స్వర్గంగా పేరొందిన ప్రదేశాలు, విలాస నగరాలైన న్యూయార్క్, ఇటలీ అనేక చోట్ల రోజు కరోనా పేరుతో చనిపోవడమేమిటి?"

వైద్యరంగం ఇంతగా అభివృద్ధి చెందుతున్న ఈ ఆధునిక యుగంలో కూడా వైద్యులకు అంతు చిక్కని రోగాలు కొత్త కొత్తగా పుట్టుకొస్తున్నాయి. కరోనా వ్యాధికి ఇంకా వ్యాక్సిన్ కనిపెట్టడానికి ఇపుడే పరిశోధనలు మొదలుపెడుతున్నారని న్యూస్ ఛానల్స్ లో చర్చలు జరుగుతున్నాయి.

మరోప్రక్క భర్త ఏమీ పట్టనట్టు జాలీగా టెన్నిస్ కెళ్ళి వచ్చి, రాబోయే శార్వరి నామ ఉగాది సంబరాలకు తనకున్న మిత్రులతో దాదాపు యాభై కుటుంబాలతో ఏ విధంగా జరుపుకోవాలో అని ప్రణాళిక రూపొందించటంలో బిజీగా ఉన్నాడు.

"తను ఏం చెప్పినా వినిపించుకోడు. మాట్లాడి ప్రయోజనం లేదు" అనుకుంది మాళవిక.

ఏమిటో ఒకే ఇంట్లోనే ఉంటున్న మనుష్యుల మధ్య అంతరాలలో ఎంత దూరం. మనస్సు విప్పి భర్తతో ఒక స్నేహితునిలా మాట్లాడాలని చాలా  ప్రయత్నించేది, కానీ రమేష్ మాళవిక మాటలు కొట్టి పడేస్తూ తనకున్న పురుష అహంకారాన్ని చేతలలో చూపించేవాడు.

పిల్లలు చదువులు, పరీక్షలలో హడావిడిగా ఉంటారు.

ఒకరోజు స్నేహితుల ఇంట్లో వాళ్ళ అబ్బాయి వడుగుకి పిలిస్తే రమేష్, మాళవిక పిల్లలతో వెళ్ళారు. అక్కడకు సునంద కూడా కనిపించింది. ఈ రోజు మా స్కూల్ మూసేసారు. స్కూల్లో ఒక అబ్బాయికి, వాళ్ల నాన్నకి కరోనా వచ్చింది అని. అది వినగానే మాళవికకు భయం కలిగింది.

ఇంటికి వెడుతూ కార్లో భర్తతో చెప్పింది "మనకి దగ్గర్లో ఉన్న ఎప్పింగ్ స్కూల్లో కరోనా వచ్చిందట."

అపుడు భార్య మాట విని రమేష్  వివరాలు తెలుసుకున్నాడు.

చూస్తూ ఉండగానే లాక్ డౌన్ అని న్యూసౌత్ వేల్స్ ప్రభుత్వం, ఇంకా నాలుగు రాష్ట్రాలలో నిబంధనలు విధించింది. కేవలం అత్యవసర కార్యాలయాలు మాత్రమే పని చేస్తాయని ఉత్తర్వులు జారీ చేసింది ప్రభుత్వ యంత్రాంగం. ఒక్కసారిగా విమాన సర్వీసులను రద్దు చేసింది. గ్రూప్ గేదరింగ్స్ ఉండకూడదని, సోషల్ డిస్టెన్సింగ్ కొత్త కొత్త రూల్స్ చోటు చేసుకున్నాయి.

మొదటిసారిగా కిషోర్ కి మాళవిక మీద గౌరవం, ఆరాధన కలిగాయి. మాళవిక కు ముందుచూపు, జాగ్రత్త ఉన్నాయని గమనించాడు.

మాళవికకు చేసే పని అంటే ఆరాధన, భక్తి భావం. కాని ఆమెకు ఐటి వాళ్ళలాగా ఇంటినుంచి పని చేయాలని మహా కోరిక. తను చేసే పనికి ఆ అవకాశం లేదు. ఐతే ఇపుడు కరోనా ప్రబలుతున్న కారణంగా ముందస్తు జాగ్రత్త చర్యగా తను వర్క్ ఇంటినుంచి చేస్తానని మేనేజ్మెంట్ కి రిక్వెస్ట్ పెట్టింది. పిల్లల స్కూల్ కి ఫోన్ చేసి పిల్లలు ఆన్లైన్ క్లాస్ లు హాజర్ అవుతారని కన్ ఫర్మ్ చేసింది.

ఇప్పుడు తను, భర్త, పిల్లలు ఇంట్లోంచే ఉద్యోగం, చదువు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మాళవిక క్షణం తీరిక లేకుండా అటు ఉద్యోగం, ఇటు పిల్లలు, వంట పని బాధ్యతలు ఎక్కడా శ్రమ పడకుండా సులభంగా చేయడం రమేష్ కి ఆశ్చర్యంగా అనిపించింది.

అందరూ వేడివేడి గా కలసి బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ చేస్తున్నారు.

రమేష్ వీలు దొరికినప్పుడల్లా మాళవికకు కూరలు తరిగి ఇవ్వటం, పిల్లలకు డిష్ వాషర్ లో గిన్నెలు తీయడం వంటి చిన్న పనులు చెప్పటం చేస్తున్నాడు. అదివరకు పిల్లలు తండ్రితో పాటు అమ్మని చిన్నచూపు చూసేవారు. ఇపుడు ఇంటినుంచి పనిచేస్తున్నపుడు అమ్మ మాట్లాడే తీరు, ఎంత బాధ్యాతాయుతంగా పనులు ఆఫీస్ లో చేస్తోందో తెలుసుకున్నారు.

ఇన్నాళ్ళు కరోనా రాకముందు ఉరుకులు పరుగులతో ఉద్యోగం, స్కూళ్ళకు పొద్దున్నే బయలుదేరి వెళ్ళడం, రాత్రి మిగిలిపోయిన కర్రీ, రైస్, రోటీ లంచ్. మళ్ళీ సాయంత్రం ఇంటికి చేరుకోగానే రిలాక్స్ అయి, డిన్నర్ చేసి ఎవరి పనులలో వాళ్ళు, గేడ్జెట్స్ ముందేసుకుని బిజీగా సాగిపోయే జీవితం.

వీకెండ్స్ మిత్రులు ఇంటికి రావడం, వెళ్ళడం, ట్యూషన్స్ డ్రాప్స్ పికప్స్ క్షణం తీరికలేకుండా ఐపోయేది.
ఒక్కోసారి ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులతో ఉన్నా ఎవరికి వారే ఒంటరిగా ఉంటున్నామా అనిపించేది.
కాని ఇపుడు రమేష్, మాళవిక, పిల్లల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఒకరి ఇష్టాలు ఒకరు తెలుసుకోవడం, బోర్డ్ గేమ్స్, కలసి తెలుగు పాత సినిమాలు చూడడం, వేడి వేడిగా మాళవిక చేసే కూరలు, పిండి వంటలు తినడం ఇలా జీవితంలోని మధురానుభూతులను రుచి చూస్తున్నారు.
బయటకు వెళ్ళే ప్రసక్తి లేకపోవడంతో రమేష్ పెళ్ళి ఐన పదిహేను ఏళ్ళ తరువాత మాళవిక తో ఎన్నో విషయాలు మాట్లాడటం, తన మనోభావాలు పంచుకోవడం ఒక రకంగా మాళవిక కలలు కన్న జీవితం మొదలై ఇప్పటికి ఆరు నెలలైంది.
వార్తలలో రాను రాను పెరుగుతున్న కోవిడ్ -19 కేసులు చూస్తూ కరోనా ప్రపంచం పాలిటశాపమా? ఇది నా పాలిట వరమా? క్రమశిక్షణతో ప్రభుత్వ విధి విధానాలు పాటిస్తూ ఇంటి పట్టున ఉన్నవారికి వరమే కావచ్చు. కాని ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలకు శాపమే.
అత్యవసర విధులను నిర్వర్తించే వైద్యులు ఇపుడు ప్రాణ రక్షకులు గా, సైనికులుగా మారి, భగవంతుని ప్రతిరూపాలై కరోనా బాధితులను ఆదుకుంటున్నారు. మీకిదే నా వందనం అనుకుంటూ అరమోడ్పు కన్నులతో నిద్రలోకి జారుకుంది మాళవిక.
(కొత్తకథలు వంశీ 80 కథల సంపుటిలో ఈ కథ ప్రచురింపబడింది. ఈ కథ గత సంవత్సరం 2020 లో అప్పటి పరిస్థితులను అనుసరించి వ్రాయటం జరిగింది).
గమనిక: గత వాహిని మాస పత్రికలలో ప్రచురింపబడిన శ్రీమతి విజయ గొల్లపూడి కథలు: నల్లచీర – కథాకేళి కథల సంపుటి లో, వృత్తిధర్మం – క్షీరసాగర కెరటం లో ప్రచురింపబడినాయి.

❖❖❖❖❖




**అంతరిక్షంలోకి తొలి తెలుగు కిరణం - తెలుగుజాతికి గర్వకారణం**

❖❖❖❖❖

# తెలుగువాణి

## *Radio 2TripleO FM 98.5MHz*

*8 -10AM on Saturday – Sydney Time*
*2.30 -4.30 AM on Saturday - India Time*
*(Please check for equivalent Local time@ your place)*

*Listen to Teluguvani on Radio 2Triple O FM 98.5MHz or DAB 985 or Listen audio by dialing: +61 2 8080 5650 Or Tunein App on Android / iPhone*

*Mrs Raja Tallapragada – Convener*

*Mr Chandrasekhar Raghavaraju -Coordinator*

*Mr Sai Gollapudi - Coordinator*

*For sponsorship and other details contact : Convener on 0422 953 668 or*

*Email: vani@sydneytelugu.org*

*Follow the links below :*

*https://Radio2tripleo.com.au*
*http://s7.viastreaming.net/8500/m*
*https://www.facebook.com/telugu.vani.52*

ఈవారం ప్రశ్న సమాధానం: *Please click the link below:*
*https://www.sydneytelugu.org/resources/evaram-prasna*

❖❖❖❖❖




❖❖❖❖❖

WESTMEAD DOCTORS



Shop 6, Coles Complex
29-33 Darcy Road
WESTMEAD

PH: 9687 4000
WESTMEADDOCTORS.COM.AU

Open 7 days

BULK BILLING AVAILABLE

GENERAL PRACTICE

Telugu and
Hindi speaking
Female GPs
Male GPs

ALLIED HEALTH

Psychologist
Physiotherapist
Podiatrist
Dietitian

SPECIALISTS

Paediatricians
Adult Physician
Geriatrician
Cardiologist

ONSITE PATHOLOGY

# తొంభై వసంతాల తెలుగు కవి సి.నా.రె

శ్రీమతి షామీరు జానకీ దేవి, హైద్రాబాద్



నా దేశం భగవద్గీత...        నా దేశం అగ్ని పునీత సీత...

నా దేశం కరుణాంతరంగ...   నా దేశం సంస్కార గంగ...

**సాహిత్యానికి రారాజు** డా. సి నారాయణ రెడ్డి గారి జయంతి సందర్భంగా వారిని స్మరించుకుంటూ...

సి నా రె గా పేరొందిన సింగిరెడ్డి నారాయణ రెడ్డి గారు (జులై 29, 1931 – జూన్ 12, 2017), తెలుగు కవి, సాహితీవేత్త... తెలుగు సాహిత్యానికి ఆయన చేసిన సేవలకు, ఆయనకు, 1988లో తన విరచిత కావ్యమైన "విశ్వంభర" కు భారత దేశ ప్రతిష్టాత్మకమైన "జ్ఞానపీఠ పురస్కారం" లభించింది... సినారెగారి సాహిత్య ప్రతిభను గుర్తించి భారత రాష్ట్రపతి వారిని రాజ్య సభ సభ్యులుగా కూడా నియమించినారు... తెలుగు చలన చిత్ర సీమలో 3000 లకు పైగా పాటలు వ్రాసారు... 1962లో 'గులేబాకావళి కథ' చిత్రంలోని 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని' అనే పాట వారి మొదటి రచన... ఆ పాటతో వారికి బాగా పేరు వచ్చింది...

నారాయణ రెడ్డిగారికున్నంత శబ్దస్ఫూర్తి మరెవ్వరికీ లేదు... శబ్దాలను అతికే శక్తి మహాద్భుతమయినది... అది సి నా రె గారికి ఉంది... మనిషిలోని మమతను, బాధను, కన్నీటిని, శృంగారాన్ని, వియోగాన్ని విప్లవాన్నితన కవితల్లో ప్రస్ఫుటింపచేయడం రెడ్డిగారి స్వంతం... నారాయణ రెడ్డి గారి కావ్యాలలో ఎక్కువగా మధ్య తరగతుల వారి కష్టసుఖాలే ఎక్కువగా కనపడతాయి... నారాయణ రెడ్డిగారి కలం రెండంచుల పదునుగల కత్తిలాంటిది... వారు తన కవిత్వంలో అగ్ని పెదజల్లగలరు, చల్లని అమృత జల్లులూ కురిపించగలరు...

వారి ప్రతిభకు, వారికి ఎన్నో పురస్కారాలు లభించాయి... అందులో రఘుపతి వెంకయ్య అవార్డు, ఎన్ టి రామారావు జాతీయ అవార్డు, బి ఎన్ రెడ్డి జాతీయ అవార్డు, నాగిరెడ్డి-చక్రపాణి జాతీయ అవార్డు, ఎన్నో బంగారు నందుల పురస్కారం, రజిత నందుల మరియు కాంస్య నందుల పురస్కారాలు లాంటివి ముఖ్యమైనవి...

అటు భావ కవిత్వానికి, ఇటు అభ్యుదయ కవిత్వానికి నడుమ మనిషిని కేంద్ర బిందువును చేసుకుని మానవతా కవిత్వాన్ని అందించారు... వర్తమానంలో కలిసి ప్రయాణించడం వారి జీవ లక్షణం...

'రాస్తూ రాస్తూ పోతాను... సిరా ఇంకేవరకు...

పోతూ పోతూ రాస్తాను... వపువు వాడే వరకు'...

ప్రతి పుట్టినరోజునాడు ఒక కొత్త కవితా సంపుటిని ప్రచురించడం, వారి ఆనవాయితీ... దానిని వారు చివరి వరకు కొనసాగించారు... అందుకే కాబోలు, 'నా రణం మరణం పైనే' అంటూ తన చివరి కవితా సంపుటిని మనకు అందించారు... సినారె తన కవిత్వంలో చూపించే ప్రభోదాత్మకత, తన సినీ గేయాలలోనూ చూపించారు...

'మెత్తగా ఉంటే ఈ లోకం... నెత్తిపై కాళ్ళు పెడుతుంది...

కత్తిలా ఉన్న వాడంటే... గులామై కాళ్ళు పడుతుంది'...

'గోరంత దీపం' చిత్రంలో వారు వ్రాసిన పంక్తులు నేటి యువతకు వ్యక్తిత్వ వికాస సాధనకు ప్రతీకగా నిలుస్తాయి... ఆ భావాల లోతు ప్రతి ఒక్కరికీ మార్గదర్శనం చేస్తాయి...

'కడలి నడుమ పడవ మునిగితే... కడదాకా ఈదాలి...

నీళ్ళులేని ఎడారిలో... కన్నీళ్ళను త్రాగి బ్రతకాలి'...

జీవితంలో నిరాశావాదాన్ని దరికి రానివ్వవద్దని చెప్పే ఈ వాక్యాలు ఎవరికైనా శిరోధార్యాలే...

తెలుగువాడి గొప్పదనాన్ని తెలియజెప్పే ఈ క్రింది కవిత వారిని మన మనసులో సదా చిరస్మరణీయుల్ని చేసింది...

**పంచె కట్టుటలోన ప్రపంచాన మొనగాడు...**

**కండువా లేనిదే గడప దాటని వాడు...**

**పంచ భక్ష్యాలను తన కంచాన వడ్డించిన...**

**గోంగూరకై గుటకలేసేవాడు...**


**ఎవడయ్యా? ఎవడు వాడు?..**


**ఇంకెవడయ్యా తెలుగువాడు...**

❖❖❖❖❖




**బాపు గీత తెలుగింట-గిలిగింత**


Dr. Murali Thiruvengadam
MBBS, FRACGP
Principal GP, Conjoint Lecturer
Western Sydney University
Fluent in:
Hindi, Tamil, Telugu, Malayalam
RRMC RAILWAY ROAD MEDICAL CENTRE
QUALITY COMMUNITY CARE
P: (02)88891383 | F: (02)86254326
Bulk Billing
OPEN 7 DAYS
New Medical Centre at
Quakers Hill
Mon - Fri: 8.00am - 8.30pm
Sat: 8.00am - 6.00pm
Sun: 8.00am - 12.00pm
G02 / 25 Railway Road
Quakers Hill, NSW-2763
88891383
Fax: 86254326
www.railwayroadmedical.com.au



# Kameswari



Computed according to Druk Siddhantham with Chitra Paksha Ayanamsa. Tidhi and Nakshtra are finishing times and Varjyam is start and finish times - Standard or Daylight Savings Time (AEST/AEDT) as applicable in Australia.

## జూలై 2021

ప్లవ జ్యేష్ఠ బ సప్తమి నుండి
ఆషాఢ బ సప్తమి

శు – శుద్ధ; బ – బహుళ; వ – వర్జ్యం; పూ – పూర్వ; ఉ – ఉత్తర; రా - రాహు కాలం; పూర్తి అనగా తిధి/నక్షత్రం 00:00 నుండి మరుసటి రోజు 00:00 గంటల వరకు - 24 గంటల వ్యాప్తి. ఆస్ట్రేలియా లోని సిడ్నీ మెల్బోర్న్ కాల మానాలకు వర్తిస్తుంది.

**Panchanga Kartas: Neti Sivaramakrishna Sastry (Sydney) & Karra Bhaskara Sarma (Melbourne)**

| | | | | | |
|---|---|---|---|---|---|
| **ఆది**<br>R - 16:30 to 18:30 | సిడ్నీ<br>సూర్య ఉ అ<br>1 7:01 16:57<br>8 7:00 17:00<br>15 6:58 17:04<br>22 6:54 17:08<br>29 6:50 17:13 | **4**<br>బ దశమి పూర్తి<br>అశ్విని 13:36<br>వర్జ్యం 9: వ 10:55 | **11** ఆషాఢం<br>శు పాడ్యమి 12:13<br>పునర్వసు 5:32<br>వర్జ్యం 14: 0 వ 15:42 | **18**<br>శు అష్టమి 7:8<br>చిత్ర 6:4<br>వర్జ్యం 11:20 వ 12:50 | **25**<br>బ పాడ్యమి 10:16<br>శ్రవణం15:44<br>వర్జ్యం 19:36 వ 21:9 |
| **సోమ**<br>R - 7:30 to 9:30 | మెల్బోర్న్<br>సూర్య ఉ అ<br>1 7:36 17:11<br>8 7:35 17:15<br>15 7:32 17:19<br>22 7:28 17:24<br>29 7:23 17:30 | **5**<br>బ దశమి 0:21<br>భరణి 16:45<br>వర్జ్యం 0:28 వ 2:16 | **12**<br>శు విదియ12:49<br>పుష్యమి 6:56<br>వర్జ్యం 20:11 వ 21:50 | **19**<br>శు నవమి 4:56<br>స్వాతి 4:39<br>వర్జ్యం 9:50 వ 11:20 | **26**<br>బ విదియ 8:30<br>ధనిష్ఠ 14:57<br>వర్జ్యం 22:5 వ 23:40 |
| **మంగళ**<br>R - 15:00 to 16:30 | సెలవు దినాలు<br>24 – వ్యాస పూర్ణిమ | **6**<br>బ ఏకాదశి 2:57<br>కృత్తిక 19:51<br>వర్జ్యం 6:18 వ 8:6 | **13**<br>శు తదియ 12:50<br>ఆశ్లేష 7:46<br>వర్జ్యం 19:57 వ 21:35 | **20**<br>శు దశమి 2:24<br>శు ఏకాదశి 23:44<br>విశాఖ 2:55<br>వర్జ్యం 6:37 వ 8:5 | **27**<br>బ తదియ 7:17<br>శతభిషం 14:43<br>వర్జ్యం 21:15 వ 22:54 |
| **బుధ**<br>R - 12:00 to 13:30 | బడి సెలవులు<br>విక్టోరియా - 28 జూన్ నుండి 09 జూలై<br>NSW - 26 జూన్ నుండి 11 జూలై | **7**<br>బ ద్వాదశి 5:28<br>రోహిణి 22:46<br>వర్జ్యం 13:48 వ 15:35 | **14**<br>శు చవితి 12:27<br>మఖ 8:8<br>వర్జ్యం 16:11 వ 17:47 | **21**<br>శు ద్వాదశి 20:50<br>అనురాధ 1:4<br>జ్యేష్ఠ 23:0<br>వర్జ్యం 6:11 వ 7:39 | **28**<br>బ చవితి 6:52<br>పూర్వాభాద్ర 15:14<br>వర్జ్యం లేదు |
| **లక్ష్మి**<br>R - 13:30 to 15:00 | **1** జ్యేష్ఠం<br>బ సప్తమి 18:34<br>పూర్వాభాద్ర 6:34<br>వర్జ్యం 16:54 వ 18:38 | **8**<br>బ త్రయోదశి 7:48<br>మృగశిర పూర్తి<br>వర్జ్యం 5:1 వ 6:48 | **15**<br>శు పంచమి 11:41<br>పుబ్బ 8:15<br>వర్జ్యం 15:19 వ 16:53 | **22**<br>శు త్రయోదశి 17:59<br>మూల 20:52<br>వర్జ్యం 19:24 వ 20:52 | **29**<br>బ పంచమి 7:18<br>ఉత్తరాభాద్ర 16:37<br>వర్జ్యం 1:23 వ 3:5 |
| **శుక్ర**<br>R - 10:30 to 12:00 | **2**<br>బ అష్టమి 20:0<br>ఉత్తరాభాద్ర 8:25<br>వర్జ్యం 21:36 వ 23:22 | **9**<br>బ చతుర్దశి 9:42<br>మృగశిర 1:32<br>వర్జ్యం 10:43 వ 12:27 | **16**<br>శు షష్ఠి 10:28<br>ఉత్తర 7:50<br>వర్జ్యం 15:58 వ 17:31 | **23**<br>శు చతుర్దశి 15:6<br>పూర్వాషాఢ 18:56<br>వర్జ్యం 5:41 వ 7:10 | **30**<br>బ షష్ఠి 8:24<br>రేవతి18:36<br>వర్జ్యం 5:37 వ 7:21 |
| **శని**<br>R - 09:00 to 10:30 | **3**<br>బ నవమి 21:57<br>రేవతి 10:47<br>వర్జ్యం లేదు | **10**●<br>బ అమావాస్య 11:11<br>ఆరుద్ర 3:45<br>వర్జ్యం 16:39 వ 18:22 | **17**<br>శు సప్తమి 9:1<br>హస్త 7:4<br>వర్జ్యం 14:44 వ 16:16 | **24**●<br>శు పూర్ణిమ 12:31<br>ఉత్తరాషాఢ 17:8<br>వర్జ్యం 2:20 వ 3:49<br>వర్జ్యం 20:54 వ 22:25 | **31**<br>బ సప్తమి 10:7<br>అశ్విని 21:9<br>వర్జ్యం 16:44 వ 18:30 |

kruthavan poundareekantham maha mantra visaradaan |
sriyananda gurum vande aahithagni saarvabhoumaan ||


SRI LAKSHMI SUPERMARKET
SLS
WEEKEND DEALS
Friday
Saturday &
Sunday Only
FRUIT & VEG
SPICES & LENTILS
FROZEN FOODS
UTENSILS
SNACK
FLAVOURS
RICE
Visit our store for
Weekly specials
WIDE RANGE OF GROCERIES,
INDIAN, SRILANKAN, NEPALESE,
PAKISTAN & BANGLADESH
86 Station Street,
Wentworthville NSW 2145

-శ్రీమతి డి. కామేశ్వరి, హైద్రాబాద్



ఒక్క నిమిషం తెల్లబోయింది మహిమ. ఆమె మొహం అరక్షణంలో ఎర్రబడింది. "కోడలా ? ఉన్న కోడలిని ఏం చేస్తారు మరి ..." అదో రకంగా చూస్తూ అంది.

'ఏం, ఆ కోడలి స్థానం అలాగే ఉంటుంది. ఆ కోడలెక్కడికి పోతుంది"? మహిమ మొహం చూసి ఏదో అర్థమైనట్లు ... "ఓ మైగాడ్ ! మహిమా నీవేం అర్థం చేసుకున్నావు ? గాడ్ ! ఇంకా నీకు నామీద నమ్మకం కుదరలేదన్నమాట ..." పెద్దగా నవ్వుతూ అన్నాడు. మహిమ తెల్లబోయింది. "రియల్లీ మహిమ. ఇంత తెలివైనదానివి అంత తెలివితక్కువగా ఎలా ఆలోచించావు ..."

"ఏమిటి మీరంటున్నది ... ఇంటి కోడలేమిటి" ?

"ఓ గాడ్ ! మహిమా ... నేను అన్నది విశాల్ గురించి. మా ఇంటి కోడలుగా చేసుకోవాలని ... ! యూర్, నువ్వేం చెప్పినా జనం నిన్ను నమ్మరు అని చెప్పకనే చెప్పేశావు. మై బ్యాడ్‌లక్ ..." వినోద్ వినోదంగా అన్నాడు.

ఈసారి మహిమ క్షణంలో తేరుకుని "ఓ సారీ ... సారీ ! ఏమిటో నా బుర్ర అంత దూరం ... అసలు విశాల్ గురించిన ఆలోచన రాలేదు. నన్ను కోడలిని చేసుకుంటాననగానే నాకు మతిపోయింది" సంజాయిషీ ఇచ్చింది.

"భలేదానివే. మా విశాల్ పాపం నా ఎపిసోడ్ తర్వాత ఆడపిల్లలంటేనే భయపడిపోయాడు. వాడు ఉత్త మంచివాడు. గర్ల్‌ఫ్రెండ్‌ని చూసుకోవడం కూడా రాదు. నేను చూసిపెడతానని మాటిచ్చాను వాడికి. ఇంత చక్కగా ఎనలైజ్ చేసి నిన్ను 'గర్ల్‌ఫ్రెండ్‌గా వెళ్లు' అంటే తంతావు అన్న భయంతో, డైరెక్ట్‌గా పెళ్ళి అనేశాను" వినోద్ సరదాగా మాట్లాడాడు.

"ఇంతకీ విశాల్ గురించి నీ అభిప్రాయం ఏమిటి ? నిర్మొహమాటంగా, సిగ్గుపడకుండా నీ అభిప్రాయం చెప్పు".

"ఏ ఆడపిల్ల అయినా మంచి కుటుంబం, మంచి ఉద్యోగం, మంచి వ్యాపారం, డబ్బు, సంస్కారం అన్నీ ఉన్న అబ్బాయి గురించి ఏమనుకుంటుందో నేనూ అదే అనుకున్నాను" నిబ్బరంగా అంది.

"అయితే ఓకే. మా విశాల్ అని కాదు కాని, వాడు జెంటిల్‌మేన్ ! నిజంగా చెప్తున్నా. వాణ్ణి చేసుకున్న అమ్మాయి సుఖపడుతుంది. వాడికి మంచి చదువు, సంస్కారం, నీలా తెలివి, సమర్థత అన్నీ ఉన్న అమ్మాయి దొరకాలి. అన్నీ ఉన్న అమ్మాయి ఎదుట ఉంచుకుని వేరే వెతకడం ఎందుకు ? నా ఆలోచన సరి అయినదే గదా ... ఇప్పుడు నీకు ఓకేనా కాదా ముందది చెప్పు' జాలీగా అన్నాడు.

"ఓకేనా అని నన్నడగడం కాదు. ఓకె చెప్పాల్సింది నా పేరెంట్స్" మహిమ ఆ ప్రస్తావనకి ఉబ్బి తబ్బిబ్బై పోకుండా నిబ్బరంగా అంది.

వినోద్ మహిమ వంక మెచ్చుకోలుగా చూసి "మళ్లీ మార్కులు కొట్టేశావు నీ జవాబుతో. ఇంత చక్కగా, నా పెళ్ళి విషయం నా పేరెంట్స్ ఇష్టం అని ఎంత బాగా చెప్పావు. రియల్లీ, యూ ఆర్ ఇంప్రెస్డ్ మి ..."

"నేను కొన్ని నిజాలని వంటబట్టించుకున్నాను. అమ్మాయి పెళ్ళి విషయంలో తల్లిదండ్రులు ఆలోచించినంతగా ఎవరూ ఆలోచించలేరు. కూతురి భవిష్యత్తు గురించి వారికంటే ఆరాటం ఎవరికుంటుంది. అమ్మ నాన్న అన్నీ చూసి చేస్తారని నా నమ్మకం. పెళ్ళి సంబంధాల విషయంలో ఆఖరి నిర్ణయం వారిదే. నాకు నచ్చినవాడైనా, వాళ్లు మెచ్చని వాడిని నేను చేసుకోను. కన్నవాళ్ల కంటే నా మేలు ఎవరు కోరతారు".

"గ్రేట్ ! నేను నాన్నగారితో మాట్లాడి, మీ నాన్నగారితో మాట్లాడమని చెపుతాను".

"అంతా మీరే మాట్లాడుతున్నారు. మీ తమ్ముడు లక్ష్మణస్వామి, రాముల వారి మాట జవదాటడా" ? హాస్యంగా అంది.

"నేనేం అంత చవటదద్దమ్మనా ? నీ పేరు చెప్పగానే వాడి కళ్లల్లో మెరుపు, నిన్ను చూడగానే వాడి మొహంలో వెలుగు, నీ గురించి మాటల్లో వాడి అడ్మిరేషన్ ... ఇవన్నీ గుర్తించకుండానే ... నాన్నగారికి నీ సమర్థత, తెలివి మీద కుదిరిన

గురి ఇవన్నీ వర్కవుట్ చేయకుండానే ... ఈ ప్రస్తావన తెస్తానా ? మా ఇంటికి కోడలిగా రాదగిన అమ్మాయివి నువ్వే. నువ్వు మా కుటుంబంలో సుఖ సంతోషాలు నింపుతావు ..."

"చాలా ఎక్కువగా అంచనాలు వేసేస్తున్నారేమో ... జాగ్రత్త" నవ్వింది మహిమ.

"లేదు ... నిజంగా చెపుతున్నా నువ్వు సుస్మితని కూడా మార్చేయగలవు అనిపిస్తోంది".

"ఆ మర్చిపోయాను. సుస్మిత గారికి కూడా ఈ ఆఫీసులో ఏదన్నా ఒక పోస్ట్ ఇస్తే తన సమర్థత మీద నమ్మకం కలిగించినట్టూ ఉంటుంది. ఆమెకీ కాలక్షేపం ఉంటే అనవసర ఆలోచనలు తగ్గుతాయి. భర్త ఆఫీసులో తనూ ఉద్యోగం చేస్తే ఆమెకి అనుమానాలు రాకుండా ఉంటాయి. ఆమె కంపెనీలో మేజర్ షేర్‌హోల్డర్ గదా, ఫైనాన్స్ సూపర్‌విజన్ అప్పగించండి. చెక్ పవర్ ఇస్తే, బిజినెస్ ఫైనాన్స్ నెమ్మదిగా అలవాటవుతుంది" సలహా ఇచ్చింది మహిమ.

"రియల్లీ మహిమ, యూ ఆర్ గ్రేట్! ఈ ఆలోచన మాకెవరికీ రాలేదు. నిజమే ! కాలక్షేపంగానే కాక, కంపెనీ వ్యవహారాలు తను చూసుకుంటుంటే, ఇతర ఆలోచనలు, అనుమానాలకి తావు ఉండదు. ఇవాళే డాడీతో మాట్లాడతా. థాంక్స్ మహిమ. నీ మహిమతో మా ఇల్లు పావనం చేసే రోజు దగ్గరలోనే ఉండాలని ఆశిస్తాను ..." నవ్వుతూ వంగి దండం పెట్టాడు.

మహిమ ఈసారి కాస్త సిగ్గుపడింది.

※ ※ ※

"మహిమా, నీ కోసం చిన్న బహుమతి" కాఫీ హౌస్‌లో టేబుల్ దగ్గర కూర్చున్నాక, జేబులో నుంచి చిన్న గిఫ్ట్ ప్యాక్ తీసి టేబుల్ మీద పెట్టాడు విశాల్, మహిమ కళ్లలోకి చూస్తూ.

"నాకోసమా ? ఇప్పుడు దీని అవసరం ఏముంది" ? మృదువుగా అంది మహిమ.

"అలా అనకు. ఇది నా సంతోషం, ముచ్చట. తీసి చూడవా" అన్నాడు.

మహిమ నవ్వి గిఫ్ట్ రేపర్ విప్పింది. చిన్న ముఖమల్ డబ్బాలో వజ్రపు టుంగరం.

"ఉంగరం ... మొన్న ఎంగేజ్‌మెంట్ నాడు తొడిగారుగా, మళ్లీ ఇదెందుకు"?

"అది కోడలికి అత్తవారు పెట్టింది. ఇది నా ఫియాన్సీకి ప్రేమకానుక" కొంటెగా అన్నాడు.

"బానే ఉంది. ఉన్నవారు ఎంతయినా ఖర్చు పెట్టగలరు. మరి నేనేం ఇవ్వాలి మీకు".

"ప్రేమకి విలువ కట్టకు. నీకంటే మంచి కానుక నాకింకేం కావాలి" మనస్ఫూర్తిగా అన్నాడు.

"ఫరవాలేదే, బాగానే మాట్లాడుతున్నారు మీ అన్నగారు. 'పాపం మా వాడికి అమ్మాయిలంటే భయం, జెంటిల్‌మేన్, నేనే వెతికి పెట్టాలి అమ్మాయిని' అన్నారు" మహిమ చిలిపిగా అంది.

విశాల్ కాస్త సిగ్గుగా నవ్వి ... 'అన్నయ్యకి నేనేం ఇచ్చి ఋణం తీర్చుకోవాలో ఇంత మంచి అమ్మాయిని వెతికిపెట్టినందుకు' నాటక ఫక్కీలో అన్నాడు.

"బానే ఉంది అన్నదమ్ముల వ్యవహారం. రామలక్ష్మణులని చరిత్రలోంచి తప్పించేట్లున్నారు ఇద్దరూ కలిసి ...'

"వినోద్ నిజంగా మంచివాడు. పాపం, వాడి జీవితం ఎందుకలా అయిందో ... బాధగా ఉంది".

"ఇంక ఆ పాత విషయం మరిచిపోయి, వాళ్లిద్దరిని మామూలు భార్యాభర్తల్లా కలిసి మెలిసి సంసారం చేసేట్టు చెయ్యాలి మనం. సుస్మిత గారిలో మార్పు తీసుకురావాలి. మనందరం కలిసి ఆవిడలోని భేదాభిప్రాయాలను పోగొట్టి, మనలో కలుపుకునేందుకు ప్రయత్నించాలి. మొన్న ఎంగేజ్‌మెంట్ నాడు బాగానే మాట్లాడారు ఆవిడ ..."

"ఏమో ... ఏం చేస్తావో కానీ నీ మాటల మహిమ చూపు. అన్నయ్యకి దగ్గర చేసే బాధ్యత నీదే ! అవును మహిమ, ఒక్క విషయం అడగనా ? నీకు ఇలా జాయింట్ ఫ్యామిలీలో ఉండడానికి ఇబ్బంది ఏమీ లేదు గదా ? మా మార్వాడీ కుటుంబాలలో, ఇప్పటికీ అన్నదమ్ములం కలిసే ఉంటాం. మీ సౌత్‌లో ఈ పద్ధతి లేదు గదా ? నాకెందుకో ఈ విషయంలో నీ అభిప్రాయం తెలుసుకోవడం అవసరం అనిపించింది. తరువాత అభిప్రాయ భేదాలు రాకూడదు గదా ? నీకేమైనా అభ్యంతరం ఉందా ..." సందేహిస్తూ అడిగాడు.

మహిమ అరక్షణం ఆలోచించకుండా "అస్సలు లేదు. నాకు ఇలా అందరూ కలిసి మెలిసి ఉండే కుటుంబం, పెద్దవారి అండదండల మధ్య వారి నీడలో ఉండడంలో ఎంతో తృప్తి ఉందనిపిస్తుంది. అందులో అమ్మాయిలు ఉద్యోగాలు చేసే కాలం ... ఇంట్లో పెద్దవారుంటే ఎంతో నిశ్చింతగా ఉంటుంది. ఎప్పుడైనా ముందుముందు అలా అనిపిస్తే, అలాంటి పరిస్థితి వస్తే అప్పుడాలోచిద్దాం" నిజాయతీగా అంది.

విశాల్ మహిమ చేయి మీద అభిమానంగా చేయివేసి "థాంక్స్ మహిమ"! అన్నాడు. ఆ చేతి మీద తన చెయ్యివేసి చిన్నగా నొక్కింది అభయం ఇస్తున్నట్టు మహిమ.



సమాప్తం

❖❖❖❖❖

## పాట నేర్చుకుందామా/పాడుకుందామా

**చిత్రం: దొంగ దొంగ**

**సంగీతం: ఎ.ఆర్. రెహమాన్**

**రచన: శ్రీ పాలగుమ్మి పద్మరాజు**

**పాడినవారు: మనో, చిత్ర, బృందం**

కొత్త బంగారు లోకం, మాకు కావాలి సొంతం
గాలి పాడాలి గీతం, పుడమి కావాలి స్వర్గం

జంట నెలవంకలుండే నింగి కావాలి మాకు
వెండి వెన్నెల్లలోనే వెయ్యికలలు పండాలి మాకు
పువ్వులే నోరు తెరిచి మధుర రాగాలు నేర్పి
పాటలే పాడుకోవలి అది చూసి నే పొంగిపోవలి
మనసనే ఒక సంపద ప్రతి మనిషిలోను ఉండని
మమతనే ప్రతి మనసులొ కొలువుండని
మనుగడే ఒక పండగై కొనసాగని

ఓడిపోవలి స్వార్ధం ఇల మరిచిపోవలి యుద్ధం
మరణమే లేని మానవుడె ఈ మహిని నిలవాలి కలకాలం
ఆకలే సమసిపోని అమృతం పొంగిపోని
శాంతి శాంతి అను సంగీతం వినిపించ పాడని ప్రతినిత్యం
బేదమే ఇక తొలగని, పేదుకె ఇక వెలగని
ఎల్లల పోరటమె ఇక వీడని, ఎల్లరు సుఖశాంతితొ ఇక బ్రతకని

https://www.youtube.com/watch?v=zZ8e00CjRYk

❖❖❖❖❖

**INDAUS Celebrating 15 years of excellence**

We Provide Services Related To:

- General Skilled Migration Visas
- Family Visas
- Employer Based - Skilled Visas
- Long Term Business Visas
- Visitor Visas
- Student Services and Visas
- MRT - Migration Review Tribunal

## INDAUS IMMIGRATION

Home to all your migration needs...

**You enroll for professional year through us and we do 485 Visa for FREE**

**Good Scholarships & discounts for professional year program**

**Want to Know More Call Sree on 0416 799 306**

**What we do for Students**

**Student Visa Extensions**

**University & Course Change**

**Temporary Visas ( Post Study Work)**

***Sydney (Branch Office)***

Strathfield Plaza
Suite 7, Level 7, 11 The Boulevard
Strathfield NSW - 2135

***Melbourne (HQ)***


Suite 14, Level 11
401 Docklands Drive
Docklands VIC 3008

***Hyderabad, India***

Office
F.No. 303, Star G.B.R P.R.K. Enclave,
Dharam Karam Road, Ameerpet,
Hyderabad 500016 INDIA

Phone: +91 72070 44933

www.indausimmigration.com **Call 1300 699 306** info@indausimmigration.com




SYDNEY TELUGU ASSOCIATION



# బాలవాహిని

డా॥ మీగడ రామలింగస్వామి — కళావిత్తులు

## 35. పీసపాటి నరసింహమూర్తి



*పౌరాణిక నాటకాల*
*పాండిత్యపు ప్రతిభ చూపి*
*వివిధ పాత్రలను వేసి*
*కవుల మెప్పు చేగొన్న*
*పండిత నట! పీసపాటి!*
*అభివందన చందనం!*

★ జననం :- 1920 జూలై 10 (కంతరాం) విజయనగరం జిల్లా.

★ వేదం, భారతం, శాస్త్రాలు చదువుకున్నారు.

★ పద్యనాటకాల్లో భావప్రధానంగా పద్యం చదివి వచనం కూడా అలాగే చెప్పగల నటులు.

★ పాండవోద్యోగంలో శ్రీకృష్ణుడు వేసి కవి, వేంకట శాస్త్రిగారితోనే మెప్పుగొన్నారు.

★ స్వర్ణ కిరీటాన్ని పోటీలో గెలుపొందారు.

★ శ్రీకృష్ణుడు, బాహుకుడు, నక్షత్రకుడు మొదలగు పాత్రలలో మంచి ఖ్యాతిగాంచారు.

★ తెలుగువారి ఆస్తి అనదగినది పద్యనాటకం. అందులో వీరు ప్రసిద్ధులు.

★ 1986 లో సంగీత నాటక అకాడమీ అవార్డ్.

★ 1976 లో నాటక కళాప్రపూర్ణ (ఏ.పి. నాటక అకాడమీ)

★ అప్పాజోస్యుల ప్రతిభా పురస్కారం.

★ 2003 కొప్పరపు కవుల తొలి పీఠ పురస్కారం.

★ నిర్యాణం :- 2007 సెప్టెంబరు 28, రాముడువలస.

40 | సూక్తి :- విద్య వినయమే వ్యక్తికి బలమునిచ్చు!


Swagath
Biryani House
(02) 8810 6690
http://www.swagath.com.au
46 Station Street
Wentworthville
NSW 2145

❖❖❖❖❖


Venkat Kantipudi, B.Com, MPA, FIPA, FTIA
HOME LOANS
INVESTMENT & SMSF LOANS
TAX RETURNS & ACCOUNTING
Mortagage Broker & Tax Agent
Suite 11/55 Phillip St, Parramatta, NSW
Phone: 02 9633 2536 Mob: 0421 374 365
Email: venkat@associatedaccounting.com.au

❖❖❖❖❖

# శిధిల నగరం – 5

(నెవిల్ షూట్ నవల "Ruined city" కి అనువాదం)

అనువాద కర్త: జి.వి.సోమనాధ శాస్త్రి (సోమసుధ), హైద్రాబాద్

(సయ్యద్ గదికెళ్ళి తన భార్య కోసం వెతికిన వారన్ కి ఆమె కనిపించలేదు. మిస్ నాటన్ కి అందజేయమని కింద హోటలు కౌంటర్లో ఒక ఉత్తరం యిస్తాడు. మరునాడు ఉదయం తన గదికి వచ్చిన భార్యకు కొన్ని నిబంధనలు చెప్పి, వాటికి కట్టుబడి నడుచుకోకపోతే విడాకులే శరణ్యమని వారన్ చెబుతాడు. ఆమె విడాకులకే మొగ్గు చూపుతుంది. పారిస్ నుంచి లండన్ చేరుకొన్న వారన్ తిన్నగా ఆఫీసుకి వెళ్ళి పేరుకుపోయిన పనికి సంబంధించిన ఉత్తరాలను డిక్టేట్ చేస్తాడు. తరువాత. . ..)

@@@@@@@@

అతను నీరసంగా చేతితో కళ్ళు తుడుచుకొన్నాడు. "ప్లంబర్గ్ నుంచి ఈ మధ్య కబురేమీ లేదు. మోరీస్లీ కార్పొరేషను వ్యవహారం ముగిసిపోయిందనుకొంటా! ఆ కుర్రాడు కాంటెల్లో తో నేనేమీ చేయదలచుకోలేదు."

"లేవేషన్ ఆయిల్ డెవలప్మెంట్ విషయం ఉందండీ!"

"కష్టపడనీయండి. వచ్చే వారం, ఆపైన నేను ఆఫీసుకి వేళ తప్పి రావచ్చు. పరిష్కరించాల్సిన వ్యక్తిగత కారణాలున్నాయి."

"మీరేమీ అనుకోకపోతే కొన్నాళ్ళు సెలవు తీసుకోండి" కార్యదర్శి సందేహిస్తూనే చెప్పాడు. " మీరు చాలా అలసటగా కనిపిస్తున్నారు. బోర్డు కూడా మీరు మితిమీరి కష్టపడవద్దని కోరుకుంటోంది."

"అది సరే!" ముఖం చిట్లించాడతను. "ఒకటి, రెండు రోజులు నేను ఊళ్ళో ఉండకపోవచ్చు. మిస్ సేల్ తో సాధ్యమైనంత త్వరగా ఉత్తరాలు టైపు చేసి తెమ్మనండి. ఆ తరువాతే యింటికెడతాను."

మోర్గాన్ వెళ్ళిపోయాక వారన్ ఒక్కడే తన గదిలో కూర్చున్నాడు. అతను చేతి వేళ్ళతో ముందున్న బల్లపై నీరసంగా దరువేస్తున్నాడు. తను యింటికెడతానని మోర్గాన్ తో అన్నాడు. ఎలాంటి యింటికెడుతున్నాడు? డెస్క్ టెలిఫోను మీట నొక్కి, తాను రాత్రి భోజనానికి యింటి కొస్తున్నట్లు వంటవాడికి తెలియజేయమన్నాడు.

అతను తన యింటిని అమ్మేయాలని అనుకొంటున్నాడు. పనివాళ్ళను తీసివేయాలి. పాల్మాల్లో గాని, ఆల్బనీలో గాని ఒక ఫ్లాట్లో నివసించాలి. తన వస్తువులను తీసుకొని పొమ్మని ఎలిస్ కి వ్రాయాలి. న్యాయవాదిని కలవాలి. తనకు యిష్టం లేని స్వతంత్రం కోసం విడాకులకు చెందిన దుర్భరమైన, సహించలేని నిబంధనలన్నీ చూసుకోవాలి. నడివయసులో కొత్త జీవితాన్ని, కొత్త యిష్టాలను నిర్మించుకోవాలి.

"అంతా సరదాగా ఉండబోతోంది" కటువుగా అనుకొన్నాడు.

కూర్చున్న బల్ల దగ్గర నుంచి లేచి, ఆఫీసు గదిలో అటూ యిటూ తిరగసాగాడు.

ఒకటి రెండు నిమిషాల తరువాత ఉత్తరాల కోసం చిరాగ్గా బెల్ నొక్కాడు. ఒకళ్ళిద్దరు వచ్చి సంతకాలు తీసుకొన్నారు. మిగిలిన ఉత్తరాలింకా తయారుకాలేదు.

అంతర్గత టెలిఫోను(ఇంటర్ కాం)లో మోర్గాన్ తో మాట్లాడాడు. "నేను బయల్దేరుతాను. మిగిలిన ఉత్తరాలపై నాకు బదులు మీరు సంతకం చేసెయ్యండి" అని చెప్పి కోటు, టోపీ ధరించి ఆఫీసునుంచి బయటపడ్డాడు.

పాడుబడ్డట్లున్న యింట్లో మాసిపోయిన బట్టలేసుకొని, వారన్ నిర్మానుష్యమైన భోజనాల గదిలో ఆ రాత్రి ఒంటరిగా భోజనం ముగించాడు. బల్ల మీద వెలుగుతున్న కొవ్వొత్తుల నీడలు గది మూలల్లో తారట్లాడుతున్నాయి. బట్లర్ మౌనంగా దక్షతతో అతనికి వడ్డించాడు. వారన్ కొద్దిగా మాత్రమే తిన్నాడు. గ్రంధాలయపు గదిలో కాఫీ తీసుకొని చప్పరిస్తూ నిప్పుగూటి ముందు కూర్చున్నాడు.

కాఫీ అందించిన ఇవాన్స్ ఒక్క క్షణం మౌనంగా వారన్ ముందు నిలబడ్డాడు.

వారన్ తలపైకెత్తాడు. "ఇవాన్స్! ఏమిటి?"

"అయ్యా! మీతో ఒక్క మాట చెప్పొచ్చా?"

"తప్పకుండా! కానీయి!"

అతను చిన్నగా దగ్గాడు. "నేనిలా చెప్పటానికి భయంగా ఉందయ్యా! మీకిలా యిబ్బంది పెడుతున్నందుకు మన్నించండి. ఒక నెల్లాళ్ళలో నేను పని మానుకోవాలనుకొంటున్నాను."

ఒక నిమిషంపాటు వారన్ మౌనంగా కప్పులోని కాఫీని చప్పరించాడు. "ఇవాన్స్! ఆ మాట వినాల్సి వచ్చినందుకు విచారిస్తున్నాను. ఎందుకు వెళ్ళిపోవాలనుకొంటున్నావు?" అడిగాడతను.

అతను కొద్దిసేపు తటపటాయిస్తూ చెప్పటానికి యిబ్బందిపడ్డాడు. "ప్రత్యేక కారణమేమీ లేదయ్యా! ఎందుకో యిక్కడ స్థిరపడలేనని అనిపించింది."

"జీతం సరిపోతోందిగా?"

"ఓ! దానికేం ఫరవాలేదయ్యా! నాకెందుకో పనిలో మార్పు కావాలనిపించింది."

తన ముందు వినయంగా నిలబడ్డ అతన్ని వారన్ తలెత్తి చూసాడు.

"అలాగా? ఇవాన్స్! నిజం చెప్పాలంటే, నేనే మీ అందరితో రేపు ఉదయం మాట్లాడాలనుకొన్నాను. మిసెస్ వారన్ యిక్కడ ఉండటానికి మరి రావటంలేదు. నేనీ యింటిని అమ్మేసి ఏదైనా పెద్ద హాల్లో ఉండాలనుకొంటున్నాను."

"అలా వినాల్సి వచ్చినందుకు బాధపడుతున్నానయ్యా!"

వారన్ మౌనంగా తలాడించాడు. "మీ అందరికీ ఒక నెల నోటీసు, మూడు నెలల జీతం యివ్వాలనుకొంటున్నాను. అందువల్ల పని మానేసి నాకేదో యిబ్బంది కలిగిస్తున్నానని నువ్వు బాధపడొద్దు."

"అదంతా మీ దయేనయ్యా! ఈ పరిస్థితుల్లో మీరు చేస్తున్న పనికి మన సిబ్బంది మెచ్చుకొంటారు. ఇలాంటి యిబ్బందులున్న సమయంలో మీకు నోటీసు యిచ్చినందుకు క్షమించండి. ఇలా జరిగిందని నాకు తెలియదయ్యా!" తటపటాయిస్తూ అన్నాడు.

"ఫరవాలేదు. తెలియక అడుగుతున్నాను. ఎందుకు మానెయ్యాలనుకొన్నావు?"

బట్లర్ మళ్ళీ తటపటాయించాడు. "దానికి సరైన సమాధానమంటూ ఏమీ లేదయ్యా! ఒక మనిషి తన జీవితాంతం యిలాంటి తరహా యింటిలో శ్రద్ధ తీసుకోవాలంటే. . ! నా భావం మీకు అర్థమైందనుకొంటాను."

అవును. దంపతులిద్దరూ దులుపుకొని పోయే కొంపలో, పనివాళ్ళు ఆ యింటిని సవ్యంగా సర్దుతూ ఉండాలంటే విసుగనిపించదా?

"అర్థమైంది" అంటూ వారన్ తలూపాడు. "సరె ఇవాన్స్! అలా చేద్దాం. మీ అందరినీ రేపు ఉదయం కలుస్తాను."

పనివాడు వెళ్ళిపోయాడు. ప్రశాంతంగా, నిశ్చలంగా వారన్ నిప్పుగూటి ముందు కూర్చున్నాడు.

చివరికి అలాగైంది. అతని యిల్లు, అతని జీవన విధానం, చివరికి శ్రద్ధాసక్తులున్న పనివాళ్ళు కూడా తన పక్క నిలబడలేనంత హీనంగా తయారైంది అతని బతుకు. తన పట్ల శ్రద్ధ పెట్టడానికి వారికీ బతుకులున్నాయి. వారిని అతను తప్పు పట్టలేదు. కానీ అతని సేవకులే తన గురించి అలా అనుకొంటే, లండన్ నగరం ఏమనుకొంటుంది?

ప్రిన్స్ ఆలీ సయ్యద్. . .ఇప్పటికే తన బుర్రలో హాస్యకవితలు, పొడుపుకథలను చొప్పించాడు. వస్తుమార్పిడి ఎలా చేయాలో అతనికి బాగా తెలుసు. వారన్ గ్రంధాలయంలో అలవాటుగా చేసే పుస్తక పఠనాన్ని కూడా మరిచిపోయి, మౌనంగా కూర్చున్నాడు. గూటిలో మంట కుచించుకుపోతుంటే, నీడలు అతన్ని చుట్టేస్తున్నాయి. అతను జీవితమంతా చాలా కష్టపడ్డాడు.

అతను యుద్ధంలో ఫిరంగిదళంలో సైనికుడిగా జేరి, ఫిరంగిదళాన్ని శాసించే స్థాయికి ఎదిగాడు. యుద్ధ విరమణ తరువాత అతను నగరంలో ఉన్న తన తండ్రి బాంకులో చేరాడు. గత పదిహేనేళ్ళుగా చెమటను ధారపోసి వ్యాపారాన్ని ఈ స్థాయికి చేర్చాడు.

అతని సగం జీవితం ముగిసిపోయింది. బాల్యం నుంచి తనకు కష్టపడటం అలవాటు. ఆ కష్టానికి సాక్ష్యంగా ప్రస్తుతం అతనికి దక్కిందేమిటి? భార్య మరో రంగు మనిషిని యిష్టపడి తనని వదిలేసింది. మర్యాదస్తులు, ఆఖరికి సేవకులైనా సరే, ఉండలేనంత దారుణంగా అతని యిల్లు మారిపోయింది. అతని స్నేహితులు కొద్దిమందే! స్నేహం కలుపుకోవటానికి చాలా కష్టపడతాడు. ఇంకా అతను ఆరోగ్యంగానే ఉన్నాడు. కాకపోతే తనలో అసహనం, అధైర్యం పెరిగిపోతున్నాయి. పని మీద ధ్యాస తప్ప వ్యాయామం చేయకపోవటం వల్ల కూడా తను నిద్రకు దూరం అవుతున్నాడు. నిద్రమాత్రలు ఎక్కువగా వాడటం కూడా ఒక కారణం కావచ్చు.

ఉదయాన్నే యింటిని సర్దేసి అమ్మకానికి పెట్టే చర్యలు తీసుకోవాలి. తరువాత భోజనం గట్రా దొరికే సత్రం తరహా యిల్లు చూసుకోవాలి. కొత్త జీవితాన్ని నిర్మించుకోవటానికి తాపత్రయపడాలి.

ప్రస్తుతం అతను గ్రంధాలయాన్ని వదిలి తన గదిలోకి వెళ్ళాడు. కొద్దిసేపు అద్దం ముందు నిలబడి చూసుకొన్నాడు. అతని ముఖం ముడతలు పడి, వృద్ధాప్యం పైబడ్డట్లు, వికారంగా కనిపించింది. అతను వెనక్కి తిరిగి యాంత్రికంగా డ్రెస్సింగ్ టేబిల్ వద్దకొచ్చాడు. అలవాటు ప్రకారం నిద్ర మాత్రలు ఉన్న చిన్న సీసాను చేతిలోకి తీసుకొన్నాడు.

వణుకుతున్న ముఖం తన వైపు చూస్తున్నట్లు అద్దంలో కనపడింది. అతనిలోని సైనికాధికారి నిటారుగా నిలబడ్డాడు. అతని ముఖంలో భావావేశం ఉప్పొంగింది. "భగవంతుడా! నేను శవంలా కనిపిస్తున్నాను" అంటూ నిర్మానుష్యమైన యింట్లో బిగ్గరగా అరిచి, సీసాను మంటలోకి విసిరేసి మంచం వైపు కదిలాడు.

మరునాడు తెల్లవారుఝామునే ఆరోజు కార్యక్రమాలను నిశ్చయించాడు. టిఫిను అయ్యాక అతను పని వాళ్ళందరినీ పిలిచి, వ్యాపార సూత్రాల ప్రకారం, బట్లరుకి చెప్పిందే టూకీగా చెప్పాడు. ఒక నెల నోటీసు, మూడు నెలల జీతం అని వారితో దృఢంగా చెప్పాక, ఒక నెల్లాళ్ళలో, యింట్లో ఉన్న ఫర్నిచర్ని స్టోరుకి తరలిస్తున్నానని, ఈలోగా యింట్లో ఉన్న ఆమె వస్తువులను వచ్చి తీసుకొని పొమ్మని సూటిగా, నిర్మొహమాటంగా భార్య ఎలిస్ కి ఉత్తరం వ్రాసాడు. ఆపైన ముందుగా యిళ్ళ బ్రోకరుని, తరువాత తన న్యాయవాదిని కలిసి ఒక గంటసేపు మాట్లాడాడు.

క్లబ్బులో అందరికీ దూరంగా, ప్రత్యేకం తన కోసం కేటాయించబడిన ఒక మూల బల్ల దగ్గర, ఒంటరిగా అల్పాహారం తీసుకొన్నాడు. ధూమపానానికి కేటాయించిన గదిలో కాఫీ ముగించి, యిరవై నిమిషాలు కలత నిద్ర పోయి, పిమ్మట ఆఫీసు కెళ్ళాడు.

అతను బయటకు వెళ్ళగానే పని వాళ్ళంతా వారన్ యిచ్చిన నోటీసు గురించి గుంపుగా చేరి మాట్లాడుకొన్నారు. ఆ రోజంతా వారు పని చేస్తున్నట్లు నటిస్తూ పదే పదే గుంపుగా కలవసాగారు.

"నేను చెప్పలేను గాని మూడు నెలల జీతం అంటే ఏదో చిన్న ఓదార్పు" వంటవాడు చెప్పాడు. "కానీ యింట్లో ఎలాంటి దారుణం జరిగింది!"

"నల్లవాళ్ళను నేనెప్పుడు యిష్టపడను" ఎల్సీ చెప్పింది. "ఆ ప్రిన్స్ ఆలీ గాడు, మొదటిసారి చూసినప్పుడు నన్ను చాలా భయపెట్టాడు. అమ్మగారు అతనిలో ఏమి చూసిందో. . ."

"ఇప్పుడిలా జరగటం చాలా బాధాకరం" ఇవాన్స్ చెప్పాడు. "ఈ నీటి బుడగ పేలే లోపునే తప్పుకోవాలనుకొన్నాను. ఈ రకమైన పని చేస్తే, కొత్త చోట మాత్రం ఎవరికైనా మంచి జరుగుతుందా?"

"ఇవాన్స్! నేను చెప్పేది కూడా అదే!" వంటవాడు చెప్పాడు. "అక్కడ మరిన్ని కష్టాలు ఎదుర్కోవాలి. తప్పదు. నువ్వేం చెప్పినా, దొరసానులకు నచ్చదు."

"సరె!" డ్రైవర్ అందుకొన్నాడు. "ఆవిడకు మంచి చోటు దొరికింది. ఎలాంటి తప్పు చేయలేదు."

"అక్కడయినా స్థిరంగా ఉంటారని నేను అనుకోను" ఇవాన్స్ అన్నాడు.

"ఓహ్!" వంటవాడు నర్మగర్భంగా అన్నాడు. "చెడు కూలిపోతుంది, అదృష్టం నిలదొక్కుకుంటుంది." వంటవాడికి ఎదుటి వారి వ్యక్తిగత విషయాలను మరీ సూటిగా విమర్శించే అలవాటు లేదు. ఎవరి బతుకు వారిది-అనుకొనే రకం.

అందరూ వాళ్ళ పనుల్లోకి వెళ్ళిపోయారు. డొనాగ్ పనిపిల్ల ఎల్సీ వెనుకే హాల్లోకి వెళ్ళాడు. "ఈ ఎడబాటు దౌర్భాగ్యకరం. ఇప్పుడే మనిద్దరం ఒకళ్ళ గురించి ఒకళ్ళం తెలుసుకొంటున్నాం."

అతను అక్కడ రెండు నెలల క్రితమే పనిలో చేరాడు. ఈ రెండు నెలల్లో తను యిష్టపడ్డ ఆ అమ్మాయితో వేగంగా ముందుకు వెళ్ళలేకపోయాడు. నిదానంగా సాగిపోవాలన్నది అతని సిద్ధాంతం. మధ్యలో ఈ గడబిడ చోటు చేసుకొంది.

"నాక్కూడా బాధగానే ఉంది" చెప్పిందామె. "కానీ ఆ జీవితం ముగిసిపోయింది. మీరు కోరుకొన్నట్లు బాగానే స్థిరపడ్డారు. ఏదో ఒకటి అవుతుంది."

"అది నిజమే!" ఉత్సాహంగా అన్నాడతను. "నేనూ తరచుగా అలాగే అనుకొంటూంటాను."

మౌనంగా నిలబడ్డ వారిలో ఒక్క క్షణం అన్యోన్యత తొణికిసలాడింది. అతను మెల్లిగా ధైర్యం కూడగట్టుకొన్నాడు.

"రేపు మధ్యాహ్నమంతా, అదే యిక్కడ పని అయిపోయాక మిగిలిన సమయమంతా, ఏమి చేస్తావు?"

"వారాంతాల్లో స్ట్రెథాంలో ఉన్న మా అత్తయ్య మిల్లీ యింటికెడతాను. నేను లండన్ వచ్చినప్పటి నుంచి నా పట్ల ఎంతో ప్రేమగా ఉంటోంది."

"నీకు సినిమాలు యిష్టమేనా? ఊళ్ళో మంచి సినిమాలు ఆడుతున్నాయి."

ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోయింది. "మీరు చాలా మంచివారు" అందామె. "అత్తయ్య యింటికి ఆదివారం వెడతాను. రేపు రెండున్నరకల్లా ముస్తాబై ఉంటాను."

"అదే మన కార్యక్రమం" తీయని ఊహల్లో తేలిపోతూ కారుని శుభ్రం చేయటానికి డ్రైవరు బయటకు నడిచాడు.

వారన్ ఆఫీసులో కొన్ని గంటల పాటు పనిలో మునిగిపోయాడు. అతను కొన్నాళ్ళు బయటకు వెళ్ళాలని నిర్ణయించుకొన్నాడు. అందుకే అనిశ్చితంగా పడి ఉన్న పనులన్నీ పూర్తిచేసాడు. అతన్ని అలసట ఆవరించింది. తనకు సెలవు తీసుకోవాలని ప్రత్యేకంగా లేకపోయినా, గ్రోస్నా స్క్వేర్ లోని యింటిలో ఒంటరిగా గడపాలని లేదు. తాను రోజూ చేసే పనికి భిన్నంగా ఏదో చేయాలని మనసులో కోరిక కలిగింది.

"ఈ మధ్యాహ్నం నాకు మళ్ళీ చచ్చే చావొచ్చింది" టైపిస్ట్ తన స్నేహితుడితో అంది. "ఆయన వాలకం చూస్తే జరగకూడనిదేదో జరిగిందని అనిపిస్తోంది."

సాయంత్రం బల్లపై నుంచి నేల మీద పడ్డ పెన్సిలుని తీద్దామని వారన్ ముందుకు వంగాడు. అకస్మాత్తుగా కడుపులో విపరీతమైన నొప్పి వచ్చి, ఒక నిమిషం పాటు అతను మెలికలు తిరిగాడు. తరువాత కోలుకుని కుర్చీలో కదలకుండా కూర్చున్నాడు. నొప్పి తిరగబెడుతుందన్న భయంతో జాగ్రత్తగా ఊపిరి తీసుకోవటం మొదలెట్టాడు. మెల్లిగా కుర్చీలో నుంచి లేచి, జాగ్రత్తగా తన గదిలో కొంతసేపు నడిచాడు. తరువాత అతనిలో విశ్వాసం పెరిగి మామూలుగా నడవసాగాడు.

(సశేషం)


Apex
Dental Centre
Gentle, caring, quality dentistry
FREE
Initial
Consultation*
✓ General & preventative care
✓ Complete family care
✓ Cosmetic dentistry
✓ Gum disease and bad breath
✓ Crowns & Bridges
✓ Implants
✓ Full and partial dentures
* For non health fund members and no gap for health fund members.
We have Hindi, Telugu, Kannada, Marathi, Gujrati speaking dentists
FOUR CONVENIENT LOCATIONS
BAULKHAM HILLS
Suite 110, 10 Century Cct
Tel: 8850 4525
LIVERPOOL
Suite 4,61 Moore St
Tel: 9602 7815
QUAKERS HILL
206 Farnham Rd
Tel: 9626 5553
WENTWORTHVILLE
31/15-17 Lane St
Tel: 98964949
CALL TODAY FOR AN APPOINTMENT 1300 APEX DENTAL
www.apexdentalcentre.com.au